ఒకటి కాదు.. రెండు కాదు.. 105 సార్లు



2

# మనం

జనం కోసం అక్షర యజ్ఞం..

హైదరాబాద్ - మంగళవారం 22 సెప్టెంబర్ 2026 | సంపుటి: 10 | సంచిక: 257 | పేజీలు:12 | వెల రూ.5

చితిపై నుంచి నిరసన



2

HYDERABAD | KARIMNAGAR | NIZAMABAD | NALGONDA | MAHABUBNAGAR | WARANGAL | KHAMMAM | GUNTUR | TIRUPATI | KURNOOL | ELURU | VISHAKAPATNAM | ANANTHAPURAM | KADAPA

### వరంగల్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్‌లో

## ఓపీ సేవలు అందుబాటులోకి తేవాలె

కలెక్టర్ ప్రతి రోజు పనులను పర్యవేక్షించాలి

గ్రీన్ ఛానల్‌లో నిధులు మంజూరు చేస్తున్నా

పనుల్లో నిర్లక్ష్యం ఎందుకు

అధికారులను ప్రశ్నించిన సీఎం రేవంత్ రెడ్డి



**హైదరాబాద్, సెప్టెంబర్ 21, (మనం బ్యూరో)**ఫ వరంగల్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్‌లో త్వరలో ఓపి సేవలు అందుబాటులోకి తేవాలని సీఎం రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. వచ్చే 30 రోజుల్లో 24 గంటల పాటు పనులు జరగాలని పేర్కొన్నారు. సోమవారం ఎంసీఆర్‌హెచ్‌ఆర్‌డిలో వరంగల్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్‌పై సీఎం రేవంత్ రెడ్డి సమీక్ష సమావేశం నిర్వహించారు. గ్రీన్ ఛానల్‌లో నిధులు మంజూరు చేస్తున్నా పనుల్లో నిర్లక్ష్యం ఎందుకు జరుగుతోందని అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇకపై కలెక్టర్ ప్రతి రోజు ఆసుపత్రి పనులను పర్యవేక్షించాలనీ, వర్క్ షెడ్యూల్ తయారు చేసుకుని ముందుకు వెళ్లాలని స్పష్టం చేశారు. సీఎంవో అధికారులు నిరంతరం గ్రౌండ్‌కు వెళ్లి సమీక్ష చేయాలనీ, ప్రతి పనికి ఒక ప్రత్యేక అధికారిని నియమించి పనులను పర్యవేక్షించాలన్నారు. శాఖల మధ్య సమన్వయంతో పని చేయాలనీ కో ఆర్డినేషన్ కమిటీని ఏర్పాటు చేసుకుని ముందుకు వెళ్లాలన్నారు. హాస్పిటల్ చుట్టూ మంచి ఆహ్లాదకర వాతావరణం ఉండాలనీ, ఆ విధంగా పరిసరాలను తీర్చిదిద్దాలన్నారు. హాస్పిటల్ భవన నిర్మాణంపై పలు సూచనలు చేసిన సీఎం సనత్‌నగర్ టిమ్స్ తరహాలో ఓపి సేవలు అందుబాటులోకి తీసుకు రావాలనీ, తక్షణమే స్టాఫ్ క్వార్టర్స్ పనులు పనులు ప్రారంభం కావాలన్నారు. హాస్పిటల్ మెయింటెనెన్స్‌ను ఏజెన్సీకి అప్పగించాలని ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు.

## నెలాఖరు నాటికి పీఆర్సీ నివేదిక!

**హైదరాబాద్, సెప్టెంబర్ 21:** ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజుతో ఉద్యోగ సంఘాల జేఏసీ నేతల భేటీ జరిగింది. ఈ సమావేశంలో భాగంగా ఉద్యోగుల పీఆర్సీ నివేదికకు సంబంధించి సీఎస్ సంజయ్ జాజు స్పందిస్తూ.. ఈ నెలాఖరు నాటికి పీఆర్సీ నివేదికను తెప్పిస్తామని ఉద్యోగ సంఘాల ప్రతినిధులకు తెలిపారు. అయితే, కేవలం పీఆర్సీ నివేదిక ప్రకటనతో సరిపోదని, రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఉద్యోగులకు సంవత్సరాలుగా రావాల్సిన పెండింగ్ ఉన్న ఐదు డీఏలను తక్షణమే విడుదల చేయాలని ఉద్యోగ సంఘాల నేతలు స్పష్టం చేశారు. డీఏల సాధనే ప్రధాన లక్ష్యంగా ఉద్యోగ సంఘాలు గట్టి పట్టుపట్టడంతో చర్చల్లో ప్రతిష్టంభన ఏర్పడింది. ఇక ఉద్యోగ సంఘాల నుంచి వచ్చిన ఈ డిమాండ్లపై వెంటనే ఆర్థిక పరమైన నిర్ణయాలు తీసుకోవాల్సి ఉండటంతో, ఈ అంశంపై మరోసారి సమావేశమై అన్ని విషయాలు చర్చిద్దామని సీఎస్ సంజయ్ జాజు వెల్లడించారు.

### ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల ఎంపిక

# నిబంధనల సడలింపు

**హైదరాబాద్, సెప్టెంబర్ 21 (మనం బ్యూరో):** ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు ప్రభుత్వం శుభవార్త చెప్పింది. ప్రజాప్రతినిధుల విజ్ఞప్తులతో నిర్మాణంలో ఉన్న ఇండ్లకు నిబంధనలను సడలిస్తున్నట్లు ప్రకటించింది. ఈ మేరకు రాష్ట్ర హౌసింగ్ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మంగళవారం ఇక్కడ వివరాలను వెల్లడించారు. ఇందిరమ్మ ఇండ్ల పథకం అమలులో లబ్ధిదారులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను తొలగించి నిర్మాణంలో ఉన్న ఇండ్లకు నిధులు అందేలా నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించారు. ఇందిరమ్మ ఇండ్ల పోర్టల్‌లో ఇప్పటికే మంజూరైన బేస్‌మెంట్ లేదా అంతకంటే పై స్థాయికి చేరుకున్న ఇళ్లకు ఎల్ 3 నుంచి ఎల్ 1 కేసులకు ఒకసారి ప్రత్యేక అనుమతి ఇస్తూ నిధుల విడుదలకు ప్రభుత్వం అనుమతించిందన్నారు. ఈ ప్రత్యేక సడలింపు ఒకసారి మాత్రమే వర్తిస్తుందనీ, భవిష్యత్తులో ఎల్ 3 మంజూరులకు దీనిని ప్రాతిపదికగా పరిగణించరాదని స్పష్టం చేశారు. ఈ నిర్ణయం వల్ల ఏర్పడే మొత్తం ఆర్థిక భారం ప్రభుత్వమే భరిస్తుందని తెలిపారు. అదే విధంగా ఇల్లు మంజూరైనప్పటికీ నిర్మాణం ప్రారంభం కాని వాటిని రద్దు చేసి అర్హులైన వారికి కేటాయించాలని నిర్ణయించినట్లు పేర్కొన్నారు. ఇందిరమ్మ ఇండ్లకు సంబంధించి ప్రజాప్రతినిధుల నుంచి వచ్చిన అనేక విజ్ఞప్తులను గౌరవించి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచనల మేరకు సానుకూలంగా పరిగణనలోనికి తీసుకుని ఇప్పటికే నిర్మాణం ప్రారంభించిన లబ్ధిదారులకు ఇబ్బంది కలుగకుండా నిబంధనలు సడలిస్తూ ఉత్తర్వులు జారీ చేసినట్లు ఈ మేరకు మంత్రి పొంగులేటి వెల్లడించారు.

## ఖరీదైన ప్రాంతాల్లోనే పేదలకు సొంతిల్లు

### పట్టణ పేదల సొంతింటి కలకు తొలి అడుగు

ఇందిరమ్మ ఇండ్ల టవర్స్‌కు శంకుస్థాపన

రాయదుర్గం, మల్కం చెరువు సమీపంలో నిర్మాణ పనులకు శ్రీకారం

పేదవాడి ఆత్మగౌరవమే ఇందిరమ్మ టవర్స్ లక్ష్యం

పైరవీలకు తావులేకుండా పారదర్శకంగా లబ్ధిదారుల ఎంపిక

వచ్చే బోనాల నాటికి పనులు పూర్తి చేస్తం

ఉచిత రిజిస్ట్రేషన్‌తో పాటు జాగాపై కూడా హక్కులు కల్పిస్తం

మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి



**హైదరాబాద్, సెప్టెంబర్ 21 (మనం న్యూస్):** హైదరాబాద్ మహానగరంలోని క్యూర్ పరిధిలో పేద కుటుంబాల సొంతింటి కలను సాకారం చేసే దిశగా రాష్ట్ర ప్రభుత్వం మరో కీలక అడుగు వేసింది. శేరిలింగంపల్లి నియోజకవర్గం రాయదుర్గంలోని మల్కం చెరువు సమీపంలో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇండ్ల టవర్స్ నిర్మాణానికి రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సోమవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ముఖ్యమంత్రి ఆలోచనలకు అనుగుణంగా పట్టణ పేదలకు వారు నివసిస్తున్న ప్రాంతాలకు సాధ్యమైనంత దగ్గరలోనే

...మిగతా 2లో

### స్పీకర్‌పై దూషణలు

తాతా మధు, నవీన్ రెడ్డికి హైకోర్టు నోటీసులు

**హైదరాబాద్, సెప్టెంబర్ 21:** స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ ను దూషించిన కేసులో బీఆర్ఎస్ ఎమ్మెల్సీలు తాతా మధు, నవీన్ రెడిలకు తెలంగాణ హైకోర్టు నోటీసులు జారీ చేసింది. వారిని అరెస్టు చేయొద్దంటూ గతంలో నాంపల్లి కోర్టు ఇచ్చిన తీర్పును సవాల్ చేస్తూ పోలీసులు హైకోర్టును ఆశ్రయించారు. నాంపల్లి కోర్టు ఉత్తర్వులను కొట్టివేయాలని పిటిషన్ దాఖలు చేశారు. పీపీ నాగేశ్వరరావు వాదనలు వినిపిస్తూ.. రాజ్యాంగబద్ధ పదవిలో ఉన్న స్పీకర్‌ను తాతా మధు, నవీన్ రెడ్డి అసభ్య పదజాలంతో దూషించారని తెలిపారు. విధుల్లో ఉన్న పోలీసు అధికారులపైనా దాడి చేశారని చెప్పారు. ఈక్రమంలో కౌంటర్ దాఖలు చేయాలని ఎమ్మెల్సీలు తాతా మధు, నవీన్‌రెడ్డికి ఉన్నత న్యాయస్థానం నోటీసులు జారీ చేసింది. తదుపరి విచారణను ఈ నెల 23కు వాయిదా వేసింది.

## హెల్త్ ఇన్నొవేషన్స్ కేంద్రంగా తెలంగాణ

### టెక్నాలజీతో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు

వైద్య రంగ ఆవిష్కరణలకు అండగా ప్రభుత్వం

'మెట్రిక్ ఎక్స్‌ప్లోరర్' యాప్ ఆవిష్కరణ..

ప్రభుత్వ ఆసుపత్రి రోగులకు ఉచిత ప్రొటోకాల్ ప్రారంభం

టీ-హబ్ లో 'హోమా సీఎంఈ 2026' జాతీయ సదస్సును ప్రారంభించిన మంత్రి శ్రీధర్ బాబు



**హైదరాబాద్,సెప్టెంబర్ 21 (మనం న్యూస్):** దేశంలోనే హెల్త్ ఇన్నోవేషన్స్‌కు ప్రధాన కేంద్రంగా తెలంగాణను తీర్చిదిద్దేందుకు ప్రణాళికాబద్ధంగా కృషి చేస్తున్నామని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు స్పష్టం చేశారు. హైదరాబాద్‌లో ఇప్పటికే ఉన్న ఐటీ, ఎమర్జింగ్ టెక్నాలజీస్, ఫార్మా, లైఫ్ సైన్సెస్ రంగాలు, స్టార్టప్‌ల సామర్థ్యాలను హెల్త్‌కేర్‌తో సమర్థవంతంగా అనుసంధానిస్తూ కాంప్రహెన్సివ్ ఇన్నోవేషన్ ఎకోసిస్టమ్‌ను రాష్ట్రంలో అభివృద్ధి చేస్తున్నామని ఆయన వెల్లడించారు. టీ-హబ్‌లో 'బియాండ్ నంబర్స్-ప్రెసిషన్ ఫినోటైపింగ్ ఇన్ డయాబెటిస్ అండ్ మెటబాలిక్ కేర్' అనే అంశంపై ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన హోమా సీఎంఈ 2026 జాతీయ సదస్సును మంత్రి సోమవారం

...మిగతా 2లో



## 813 కోట్ల పరిహారం తక్షణమే రైతులకు చెల్లించాలె

### నిధులు ప్రభుత్వ ఖాతాలో మూలుగుతుంటే సహించం

కలెక్టర్లు స్వయంగా జోక్యం చేసుకుని ప్రక్రియను వేగవంతం చేయాలి

ప్రాజెక్టులకు భూములిచ్చే రైతుల పట్ల మానవీయంగా వ్యవహరించాలి

నీటిపారుదల శాఖపై సమీక్షలో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి

**హైదరాబాద్, సెప్టెంబర్ 21 (మనం బ్యూరో):** భూ సేకరణ, పునరావాసంకు సంబంధించి ఇప్పటికే విడుదల చేసిన రూ.813 కోట్లను ఎలాంటి జాప్యం లేకుండా వెంటనే సంబంధిత రైతులకు అందించాలని నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆదేశించారు. మంజూరైన నిధులు ప్రభుత్వ ఖాతాలో మూలుగుతుంటే సహించేది లేదని స్పష్టం చేశారు. రాష్ట్రంలో సాగునీటి ప్రాజెక్టుల భూ సేకరణ, పునరావాసం, పరిహారం చెల్లింపుల పురోగతిపై సోమవారం రాష్ట్ర సచివాలయం నుంచి జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఏప్రిల్ ఒకటో తేదీ నుంచి ఇప్పటి వరకు భూ సేకరణ, పునరావాసంకు సంబంధించి రూ.3101 కోట్లకు టోకెన్లు సమర్పించగా ప్రభుత్వం రూ.2504 కోట్లు విడుదల చేసినట్లు అధికారులు వెల్లడించారు. ప్రస్తుతం జిల్లా

...మిగతా 2లో

## బీసీల అభ్యున్నతే.. సర్కార్ ధ్యేయం

క్షేత్రస్థాయిలో సంక్షేమం అమలు కావాల్సిందే!

ఇందిరమ్మ కుట్టు మిషన్లకు పోటెత్తిన దరఖాస్తులు



2

గురుకులాలకు త్వరలోనే సొంత భవనాలు

మెనూ అమలులో రాజీ పడితే సహించేది లేదు

అధికారులకు మంత్రి పొన్నం ప్రభాకర్ హెచ్చరిక

## నో చేంజ్ ఇన్ సిలబస్

టీజీపీఎస్సీ ప్రకటనతో ఊహాగానాలకు ఫుల్‌స్టాప్

**హైదరాబాద్, సెప్టెంబర్ 21:** రిక్రూట్ మెంట్ ఎగ్జామ్స్‌కు సంబంధించి టీజీపీఎస్సీ కీలక ప్రకటన విడుదల చేసింది. రాష్ట్రంలో ప్రభుత్వ ఉద్యోగాల భర్తీకి నిర్వహించే పరీక్షల సిలబస్లో మార్పుపై వస్తున్న ఊహాగానాలపై స్పందించింది. తాము ఎలాంటి సిలబస్ కమిటీని

...మిగతా 2లో

### 100 మంది రైతులకు నోటీసులు

సర్వే నంబర్ 325లో భూములున్న అందరికీ అందజేత

జాగాకు సంబంధించిన ఆధారాలతో రావాలని సూచన

ఎర్రవల్లిలో మూడోరోజు రెవెన్యూ అధికారుల సర్వే

3

### అయ్యప్ప ప్రసాదం కొరత

ట్రావెన్‌కోర్ దేవస్థానం బోర్డు, ప్రభుత్వాల మధ్య పంచాయతీ

2

### క్వాకర్‌వోడ్జర్‌లను తయారుచేసిన కేంద్రం

కాంగ్రెస్ ఎంపీ శశి థరూర్

3

### మనిషితో మర మనిషి కొట్లాట

చిత్రంగా చూసిన శాన్‌ఫ్రాన్సిస్కో నగరం



**శాన్‌ఫ్రాన్సిస్కో, సెప్టెంబర్ 21:** మనిషి, రోబోకి మధ్య ఫైట్ జరగడం ఎప్పుడైనా చుశారా?.. అలాంటి ఓ వినూత్న పోటీ అమెరికాలోని శాన్‌ఫ్రాన్సిస్కోలో జరిగింది. దాదాపు ఆరు అడుగుల ఎత్తున్న రోబోతో అమెరికన్ సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్, కంటెంట్ క్రియేటర్ ఫ్రాంకీ లాపెన్నా తలపడ్డాడు. బాక్సింగ్

...మిగతా 2లో

### 45 గంటల్లో 4 రాకెట్

## ప్రయోగాలు

ప్రపంచాన్ని అదరగొట్టిన చైనా రికార్డు ప్రయోగాలు



**బీజింగ్, సెప్టెంబర్ 21:** అంతరిక్ష రంగంలో వేగంగా విస్తరిస్తోన్న చైనా తన ప్రయోగ సామర్థ్యాన్ని మరోసారి ప్రపంచానికి చాటిచెప్పింది. ఇటీవల కేవలం 45 గంటల వ్యవధిలో నాలుగు రాకెట్లను విజయవంతంగా ప్రయోగించి సరికొత్త చరిత్ర సృష్టించింది. సెప్టెంబరు 15-16 మధ్య మూడు లాంచింగ్ కేంద్రాల నుంచి ఈ ప్రయోగాలు జరిగినట్లు చైనా

...మిగతా 2లో

### అక్టోబర్ 20 నుంచి న్యూజిలాండ్‌తో స్వేచ్ఛా వాణిజ్యం

**ఢిల్లీ, సెప్టెంబర్ 21:** భారత్- న్యూజిలాండ్ మధ్య స్వేచ్ఛావాణిజ్య ఒప్పందం (ఎఫ్టీఏ) అక్టోబర్ 20 నుంచి అమల్లోకి రానున్నట్లు కేంద్ర మంత్రి పీయూష్ గోయల్ వెల్లడించారు. ఇది ఇరుదేశాల మధ్య పెట్టుబడులు, వ్యాపార సంబంధాలు మెరుగుపడేందుకు దోహదం చేస్తుందన్నారు. భారత్, న్యూజిలాండ్ మధ్య ఏప్రిల్ 27 ఒప్పందం కుదిరిన సంగతి తెలిసిందే. దీని ప్రకారం.. భారత్ నుంచి న్యూజిలాండ్కు ఎగుమతి అయ్యే ఉత్పత్తులపైనా ఎలాంటి సుంకం ఉండదు. అంతేకాకుండా రానున్న 15 ఏండ్లలో న్యూజిలాండ్ 20 బిలియన్ యూఎస్ డాలర్ల మేర భారత్లో పెట్టుబడులు పెట్టేందుకు ఈ ఒప్పందం మార్గం సుగమం

...మిగతా 2లో

### పశ్చిమాసియాలో టెన్షన్.. టెన్షన్

## ఇరాన్‌లో కోడ్ 100

**టెహ్రాన్, సెప్టెంబర్ 21:** పశ్చిమాసియాలో ఘర్షణలు ఎప్పుడు ఏ రూపం దాల్చుతాయో తెలియని ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ఈ నేపథ్యంలో ఇరాన్ తన సాయుధ దళాలకు 'కోడ్ 100' అలర్ట్‌ను జారీ చేసినట్లు సమాచారం. ఈ అలర్ట్‌ను ఆ దేశ అత్యున్నత స్థాయి సైనిక సన్నద్ధతగా రక్షణరంగ నిపుణులు అభివర్ణిస్తున్నారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ క్యాంప్ డేవిడ్ (వారాంతంలో విశ్రాంతి తీసుకునే ప్రదేశం) నుంచి షెడ్యూల్ సమయం కంటే ముందుగానే వైట్‌హౌస్‌కు తిరిగిరావడం, ఈ అలర్ట్ జారీ కావడం దాదాపు ఒకేసారి జరిగాయి. దాంతో పశ్చిమాసియాలో భీకరదాడులు జరుగుతాయా..? అనే సిగ్నల్ ప్రపంచానికి వెళ్లింది.



**ఏంటీ కోడ్ 100 అలర్ట్..?**

ఈ కోడ్ 100 అలర్ట్‌ను ఇరాన్ సాయుధ దళాలకు అత్యున్నత స్థాయి సంసిద్ధతగా చెబుతుంటారు. ఇది అమలు చేయడమంటే.. తమ దేశంపై జరగబోయే దాడికి దీటుగా స్పందించడానికి సైనిక,

...మిగతా 2లో

# రూ.813 కోట్ల పరిహారం తక్షణమే రైతులకు చెల్లించాలె

(మొదటి పేజీ తరువాయి)

స్థాయిలో చెల్లింపులకు పెండింగ్‌లో రూ.813 కోట్లలో రూ.502 కోట్లు భూ సేకరణ అధికారుల వద్ద మరో రూ.311 కోట్లు జిల్లా కలెక్టర్ల వద్ద ఉన్నట్లు తెలిపారు. ఈ పరిస్థితిపై మంత్రి తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. నిధులు విడుదలైన తరువాత అవి తప్పనిసరిగా భూములు కోల్పోయిన రైతులకు చేరాలనీ, కలెక్టర్లు వ్యక్తిగతంగా చొరవ తీసుకుని రైతులతో సంప్రదింపులు జరపడంతో పాటు అవార్డుల ప్రక్రియను పూర్తి చేసి పరిహారం చెల్లింపులను వేగవంతం చేయాలని ఆదేశించారు.

సాగునీటి ప్రాజెక్టుల భూ సేకరణ, పునరావాసం, అటవీ అనుమతుల కోసం ఈ ఏడాది రూ.6 వేల కోట్లు అందిస్తామని సీఎం రేవంత్ రెడ్డి హామీ ఇచ్చిన విషయాన్ని గుర్తు చేశారు. ప్రాధాన్య ప్రాజెక్టుల పనులు నిధుల కొరతతో ఆలస్యం కాకూడదన్న ఉద్దేశంతోనే ఈ మొత్తాన్ని నీటి పారుదల శాఖ సాధారణ బడ్జెట్‌కు అదనంగా సమకూరుస్తున్నట్లు తెలిపారు. రైతుల భూములను తీసుకునే విషయంలో మానవీయంగా వ్యవహరించాలనీ, అవార్డులు జారీ చేసి చెల్లింపులకు అన్ని ఏర్పాట్లు పూర్తయిన తరువాతనే టోకెన్లు సమర్పించాలని స్పష్టం చేశారు. భూ సేకరణ ప్రక్రియలో రెండు మూడు వారాల సమయాన్ని సాధారణ పరిపాలనా జాప్యంగా భావించవద్దనీ, ప్రతి దశకు నిర్దిష్ట గడువు పెట్టుకుని సాధ్యమైనంత త్వరగా ప్రక్రియను పూర్తి చేయాలని ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ అధికారులను ఆదేశించారు.

# బీసీల అభ్యున్నతే.. సర్కార్ ధ్యేయం

## అధికారులకు మంత్రి పొన్నం ప్రభాకర్ హెచ్చరిక

హైదరాబాద్,సెప్టెంబర్ 21 (మనం న్యూస్): రాష్ట్రంలోని వెనుకబడిన తరగతుల సంక్షేమం, విద్యా ప్రమాణాల మెరుగుదలే లక్ష్యంగా ప్రభుత్వం ప్రణాళికాబద్ధంగా ముందుకు వెళ్తోంది. బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అమలవుతున్న వివిధ సంక్షేమ పథకాలు, విద్యా సంస్థల పనితీరుపై రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ మినిస్టర్ క్వార్టర్స్‌ల్లో ఉన్నతాధికారులతో సోమవారం ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. మహిళల ఉపాధి పథకం అమలు తీరు, గురుకులాల్లో మౌలిక వసతులు, పౌష్టికాహారం తదితర కీలక అంశాలపై ఆయన సుదీర్ఘంగా చర్చించారు. బీసీ మహిళల ఆర్థిక స్వయం ఉపాధి కోసం ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇంటింటా ఇందిరమ్మ కుట్టు మిషన్ల పథకానికి రాష్ట్రవ్యాప్తంగా అపూర్వ స్పందన లభిస్తోందని,ఇప్పటివరకు 4 లక్షల 6 వేల దరఖాస్తులు అందినట్లు అధికారులు మంత్రికి నివేదించారు. ఈ నెల 30తో దరఖాస్తుల స్వీకరణ గడువు ముగియనున్న నేపథ్యంలో.. అర్హత ఉన్న ప్రతి ఒక్క బీసీ మహిళకూ పథకం ఫలాలు అందేలా అధికారులు క్షేత్రస్థాయిలో ప్రత్యేక దృష్టి పెట్టాలని మంత్రి ఆదేశించారు.

**గురుకులాలు సొంత భవనాలు..**

రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 327 బీసీ గురుకుల పాఠశాలల్లో కేవలం 21 సంస్థలకు మాత్రమే సొంత భవనాలు ఉండటం, మిగిలినవన్నీ అద్దె భవనాల్లో కొనసాగుతుండటంపై మంత్రి ఆరా తీశారు.విద్యార్థులు ఇరుకైన వాతావరణంలో ఇబ్బంది పడకుండా శాశ్వత ప్రాతిపదికన వసతులు కల్పించాలి. జిల్లాల్లో గురుకుల పాఠశాలలకు సొంత భవనాల నిర్మాణం కోసం కలెక్టర్లతో సమన్వయం చేసుకుని తక్షణమే స్థల సేకరణ ప్రక్రియ పూర్తి చేయాలి. ఇప్పటికే స్థలాలు సిద్ధంగా ఉన్న చోట భవనాల నిర్మాణానికి నిధులు మంజూరు చేయించేలా ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కతో చర్చించి తగిన చర్యలు తీసుకుంటాం అని మంత్రి స్పష్టం చేశారు.

**నాణ్యమైన విద్య,**

**పౌష్టికాహారమే ప్రాధాన్యం..**

మహాత్మా జ్యోతిబా పూలే తెలంగాణ బీసీ సంక్షేమ గురుకులాలు, హాస్టళ్లలో అందుతున్న వసతులపై మంత్రి నిక్కచ్చిగా వ్యవహరించారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం విద్యార్థులకు నిర్దేశిత మెనూ ప్రకారమే నాణ్యమైన, పౌష్టికాహారం అందించాల్సిందేనని పొన్నం తేల్చిచెప్పారు. కేవలం మార్కుల సాధనే కాకుండా, క్రీడలు , సాంస్కృతిక రంగాల్లోనూ విద్యార్థులను తీర్చిదిద్దాలని ఆయన అధికారులకు సూచించారు.

గతేడాది కంటే ఈ విద్యా సంవత్సరంలో ఉత్తీర్ణతా శాతాన్ని మరింత మెరుగైన స్థాయికి తీసుకువెళ్లేలా ఉపాధ్యాయులు, అధికారులు సమన్వయంతో కృషి చేయాలని పొన్నం పిలుపునిచ్చారు.ఈ సమీక్షా సమావేశంలో బీసీ సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ బాల మాయాదేవి, సీనియర్ అధికారులు మల్లయ్య బట్టు, అలోక్ కుమార్, శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి గ్రామపంచాయతీని మోడల్‌గా తీర్చిదిద్దుతం

## పంచాయతీరాజ్ మంత్రి సీతక్క

హైదరాబాద్, సెప్టెంబర్ 21: ప్రతి గ్రామపంచాయతీని మోడల్ పంచాయతీగా తీర్చిదిద్దాలని తెలంగాణ మంత్రి సీతక్క అన్నారు. హైదరాబాద్ లోని పంచాయతీరాజ్ కమిషనర్ కార్యాలయంలో మంత్రి సీతక్క సోమవారం ఉన్నతస్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. అక్టోబర్ 2వ తేదీన గ్రామసభలు నిర్వహిస్తున్న నేపథ్యంలో ఈ ఏడాది చేపట్టాల్సిన పనుల ప్రణాళికపై సమీక్షించారు. ఈ సమావేశానికి స్పెషల్ సీఎస్ దానకిషోర్, ఇతర అధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా అధికారులకు పలు కీలక అంశాలపై మంత్రి సీతక్క దిశానిర్దేశం చేశారు. ఎన్నో తీవ్రత అందరికీ తెలుసునని.. ఈ పరిస్థితులపై అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు.



**రూ.50 లక్షల పనులు**

**చేపట్టేలా ప్రణాళిక చేస్తున్నాం..**

అక్టోబర్ 2వ తేదీన గ్రామసభలు నిర్వహించి యాక్షన్ ప్లాన్ పై తీర్మానాలను ప్రవేశపెట్టాలని మంత్రి సీతక్క మార్గనిర్దేశం చేశారు. ఆయా గ్రామాల వారీగా అవసరాలు, నిధుల ఆధారంగా అభివృద్ధి పనులు చేపట్టాలని ఆదేశించారు. ప్రాధాన్యం క్రమంలో అభివృద్ధి పనులు చేపట్టాలని సూచించారు. ఈ ఏడాది పంచాయతీలకు వచ్చే అన్ని నిధులపై గ్రామసభల్లో చర్చించాలని ఆదేశించారు. ఉపాధి హామీ కింద రూ.6,700 కోట్లను ఖర్చు చేస్తున్నామని స్పష్టం చేశారు. ప్రతి గ్రామంలో సగటున రూ.50 లక్షల పనులు చేపట్టేలా ప్రణాళిక చేస్తున్నామని చెప్పారు. ఉపాధి హామీ పనులు అడిగిన వారందరికీ కల్పించాలని సూచించారు.

**ఉపాధితో పాటు సామాజిక ఆస్తుల**

**కల్పనపై దృష్టి సారించాలె..**

ఉపాధితో పాటు సామాజిక ఆస్తుల కల్పనపై దృష్టి సారించాలని మంత్రి సీతక్క ఆదేశించారు. జలసిరి కార్యక్రమాన్ని మరింత వేగవంతం చేయాలని దిశానిర్దేశం చేశారు. రాష్ట్రస్థాయి అధికారులకు జిల్లాల వారీగా మానిటరింగ్ బాధ్యతలు అప్పగించాలని ఆదేశించారు. రెండు రోజుల పాటు జిల్లాల్లో అధికారులు క్షేత్రస్థాయి పర్యటనలు చేయాలని సూచించారు. ఈ సమావేశాలకే పరిమితం కాకుండా గ్రామస్థాయిలో పర్యటించాలని మంత్రి సీతక్క ఆదేశించారు.

# ఒకటి కాదు రెండు కాదు.. 105 సార్లు

## అయోధ్య రామాలయంలో విరాళాల చోరీపై సిట్

అయోధ్య, సెప్టెంబర్ 21: అయోధ్య రామాలయంలో విరాళాల చోరీకి సంబంధించి సిట్ దర్యాప్తులో కీలక వివరాలు వెలుగులోకి వచ్చాయి. ఒకట్రెండు సార్లు కాదు.. ఏకంగా 105 సార్లు విరాళాల చోరీ జరిగినట్లు సిట్ గుర్తించింది. చోరీ దృశ్యాలు సీసీటీవీ కెమెరాల్లో రికార్డయినట్లు సుప్రీంకోర్టుకు తెలిపింది. చోరీకి పాల్పడిన వారందరినీ గుర్తించినట్లు వివరించింది. అయోధ్య విరాళాల చోరీ కేసుపై సోమవారం సుప్రీం కోర్టులో విచారణ జరిగింది. సిట్ తరఫున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా వాదనలు వినిపించారు. దర్యాప్తులో గుర్తించిన వివరాలను న్యాయస్థానానికి వివరించారు. పూర్తిస్థాయి దర్యాప్తు త్వరలోనే పూర్తవుతుందని, సెప్టెంబర్ 25 లోపు ఛార్జిషీట్ దాఖలు చేస్తామని కోర్టుకు తెలిపారు.విచారణ సందర్భంగా న్యాయస్థానం పలు అంశాలను లేవనెత్తింది. ఈ కేసుకు సంబంధించి ఇప్పటివరకు ఎంతమందిని అరెస్టు చేశారు?ఆధారాల సేకరణ ఎంత వరకు వచ్చింది?తదితర అంశాలపై తుషార్ మెహతాను ప్రశ్నించింది. ఇప్పటి వరకు సేకరించిన సీసీటీవీ ఫుటేజీలు, ఇతర ఆధారాలను కోర్టుకు సిట్ సమర్పించింది. దర్యాప్తు వివరాలకు సంబంధించిన కాపీలను తమకు కూడా ఇవ్వాలని పిటిషనర్లు కోరగా.. న్యాయస్థానం తిరస్కరించింది.

# చితిపై నుంచి నిరసన

పన్నా, సెప్టెంబర్ 21: కెన్-బెట్వా ప్రాజెక్టులో భాగంగా చేపట్టిన మజగవా, రూంజ్ నదుల అనుసంధానంతో మధ్యప్రదేశ్ లోని పన్నా ప్రాంతంలో పలు గ్రామాలకు చెందిన రైతులు నిర్వాసితులయ్యారు.

తమకు తగిన నష్టపరిహారం అందించి, పునరావాసం కల్పించాలంటూ వారు కొన్ని నెలలుగా డిమాండ్ చేస్తున్నారు. ఈ క్రమంలో ఆదివారమూ ఆందోళన నిర్వహించారు. పలువురు ఆందోళనకారులు నీటిలో చితులు పేర్చుకుని వాటిపై శవాల్లా పడుకుని, మరికొందరు ఉరి బిగించుకుని నిరసన తెలిపారు.

# మనిషితో మర మనిషి కొట్లాట

(మొదటి పేజీ తరువాయి)

రింగ్‌లో లాపెన్నా.. రోబోపై పంచ్లు విసరగా.. రోబో కూడా కిక్కులు, పంచ్లతో ఎదురుదాడి చేసింది. ఓ దశలో రోబో ఇచ్చిన కిక్కుకు అతను కిందపడిపోయాడు. ఈ పోటీకి సంబంధించిన వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్గా మారింది. ఈ పోటీని రోబోటిక్స్ సంస్థ ఆర్ఈకే నిర్వహించింది. ప్రపంచంలోనే మనిషి-రోబోతో చేసిన తొలి ఫైట్ ఇదేనని తెలిపింది. అయితే రోబో సొంతంగా పోరాడలేదు. దానిని ఓ వ్యక్తి రిమోట్ కంట్రోల్ ద్వారా ఆపరేట్ చేశాడు.

# 45 గంటల్లో 4 రాకెట్ ప్రయోగాలు

(మొదటి పేజీ తరువాయి)

జిమీడియా వెల్లడించింది. ఇందులో ప్రైవేటు సంస్థలు అభివృద్ధి చేసిన రాకెట్లూ ఉన్నాయని పేర్కొంది. ఈ నాలుగు వ్యోమనౌకలు.. తాము మోసుకెళ్లిన ఉపగ్రహాలను నిర్ణీత కక్ష్యలో చేర్చినట్లు తెలిపింది. మొదటి ప్రయోగం సెప్టెంబరు 15న జియుక్వాన్ శాటిలైట్ లాంచ్ సెంటర్ నుంచి చేపట్టారు. ల్యాండ్‌స్పేస్ అనే ప్రైవేటు సంస్థ అభివృద్ధి చేసిన ఝుక్వే-2ఇ రాకెట్.. 10 ఉపగ్రహాలను తీసుకెళ్లి భూ దిగువ కక్ష్యలో ప్రవేశపెట్టింది.ఇదే రోజున, ఓరియన్ స్పేస్‌కు చెందిన గ్రావిటీ-1 రాకెట్‌ను షాంఘై తీరంలోని సముద్రంపై ఉన్న లాంచింగ్ కేంద్రం నుంచి ప్రయోగించారు. ఇది 9 ఉపగ్రహాలను మోసుకెళ్లింది. ఈ రాకెట్‌కు ప్రపంచంలోనే అత్యంత శక్తిమంతమైన సాలిడ్-ఫ్యూయల్ రాకెట్‌గా పేరుంది. ఇక, సెప్టెంబరు 16న ప్రభుత్వ రంగ అంతరిక్ష సంస్థ.. లాంగ్ మార్చ్ 12 అనే రాకెట్‌ను హైనాన్ ఐలాండ్ నుంచి ప్రయోగించింది. ఇది కూడా 9 ఉపగ్రహాలను అంతరిక్షంలోకి తీసుకెళ్లింది. బ్రాడ్‌బ్యాండ్ నెట్‌వర్క్‌లో భాగంగా ఈ శాటిలైట్లను కక్ష్యలో ప్రవేశపెట్టింది.

ఇదే రోజున, జియుక్వాన్ శాటిలైట్ లాంచ్ సెంటర్లో కుయ్‌ఝౌ-11 రాకెట్ ప్రయోగం జరిగింది. దీన్ని చైనా అంతరిక్ష సంస్థకు చెందిన అనుబంధ విభాగం చేపట్టింది. ఇది రెండు రాడార్ ఉపగ్రహాలను భూ దిగువ కక్ష్యలో విజయవంతంగా ప్రవేశపెట్టింది.

# హెల్త్ ఇన్నోవేషన్స్ కేంద్రంగా తెలంగాణ

(మొదటి పేజీ తరువాయి)

లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రభుత్వం విద్య, వైద్య రంగాలకు అత్యంత ప్రాధాన్యమిస్తోందని మంత్రి శ్రీధర్ బాబు పేర్కొన్నారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలను అందించేందుకు ఆధునిక సాంకేతికతను వైద్య రంగంతో మిళితం చేస్తున్నట్లు ఆయన తెలిపారు. మారుతున్న జీవనశైలి కారణంగా డయాబెటిస్, ఇతర మెటబాలిక్ వ్యాధులు వేగంగా పెరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. వీటిని కేవలం సాంప్రదాయ వైద్య విధానాలతోనే కాకుండా, లైఫ్‌స్టైల్ డేటాను విశ్లేషించడం ద్వారా సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు అవకాశాలున్నాయని తెలిపారు.



ఈ తరహా దీర్ఘకాలిక వ్యాధులను ప్రాథమిక దశలోనే గుర్తించే దిశగా మరిన్ని నూతన ఆవిష్కరణలు రావాలని శ్రీధర్ బాబు పిలుపునిచ్చారు.ఈ సదస్సు వేదికగా పలు కీలక కార్యక్రమాలకు మంత్రి శ్రీకారం చుట్టారు. ప్రముఖ వైద్యులు డాక్టర్ ముద్దు సురేంద్ర నెహ్రూ రచించిన ది న్యూ పారాడైమ్ పుస్తకాన్ని ఆయన ఆవిష్కరించారు. ప్రపంచంలోనే తొలి ఉచిత మెటబాలిక్ కాలిక్యులేటర్ యాప్ మెట్రిక్ ఎక్స్‌ప్లోరర్‌ను ఆయన ప్రారంభించారు. ప్రూఫ్ ఆఫ్‌కాన్సెప్ట్ పేరిట ప్రభుత్వ ఆసుపత్రుల నుంచి ఎంపిక చేసిన 50 మంది రోగులకు ఉచిత ప్రొటోకాల్‌ను అందించే కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించారు. రాబోయే రోజుల్లో హెల్త్‌కేర్ రంగంలో ఎదురయ్యే సవాళ్లను పరిష్కరించే ప్రతి కొత్త ఆలోచనకూ తమ ప్రభుత్వం ఎప్పుడూ అండగా ఉంటుందని మంత్రి భరోసానిచ్చారు. ప్రజారోగ్య రంగాన్ని మరింత బలోపేతం చేసేందుకు వైద్య నిపుణులు, పరిశోధకులు, సంస్థలు రాష్ట్ర ప్రభుత్వంతో కలిసి భాగస్వాములు కావాలని మంత్రి పిలుపునిచ్చారు.

# ఖరీదైన ప్రాంతాల్లోనే పేదలకు సొంతిల్లు

(మొదటి పేజీ తరువాయి)

సొంతింటిని అందించాలనే లక్ష్యంతో ఇందిరమ్మ ఇండ్ల టవర్స్ నిర్మాణానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని పొంగులేటి తెలిపారు.పేదలను నగరానికి దూరంగా తరలించడం కాకుండా, ఖరీదైన ప్రాంతాల్లోనే గౌరవంగా నివసించేలా ఇందిరమ్మ టవర్స్‌ను నిర్మిస్తున్నామని ఆయన తెలిపారు.పేదవాడి సొంతింటి కలను కేవలం నాలుగు గోడలు, పైకప్పుతో పూర్తి చేయడం తమ ప్రభుత్వ లక్ష్యం కాదని, పేదవాడికి ఆత్మగౌరవంతో జీవించే చిరునామా ఇవ్వడమే లక్ష్యమని అన్నారు.హైదరాబాద్‌లోభూముల విలువ భారీగా ఉన్న ప్రాంతాల్లోనే పేదలకు ఇళ్లు నిర్మిస్తున్నామని మంత్రి వెల్లడించారు. ఎకరం వందల కోట్ల విలువ చేసే ప్రాంతంలో పేద కుటుంబాలకు ఇల్లు ఇవ్వడం ద్వారా ప్రభుత్వం వారికి భద్రత, భరోసా కల్పిస్తోందని తెలిపారు.ఇందిరమ్మ టవర్స్‌లో లబ్ధిదారులకు 17 నుంచి 20 గజాల వరకు అన్‌డివైడెడ్ షేర్‌తో పాటు అపార్ట్‌మెంట్‌పై పూర్తి హక్కులు కల్పించేలా చర్యలు తీసుకుంటున్నామని పొంగులేటి తెలిపారు. సేల్ డీడ్‌ను రిజిస్ట్రేషన్ చార్జీలు లేకుండా అందించే విధంగా ప్రభుత్వం నిర్ణయించిందని తెలిపారు.ఇందిరమ్మ టవర్స్ లబ్ధిదారుల ఎంపికలో ఎలాంటి రాజకీయ జోక్యానికి, పైరవీలకు తావులేదని మంత్రి స్పష్టం చేశారు.

లాటరీ విధానంలో పారదర్శకంగా లబ్ధిదారులను ఎంపిక చేస్తున్నామని, ఎవరి సిఫార్సులు, ఒత్తిళ్లకు లొంగకుండా అర్హత ఆధారంగా ఎంపిక జరుగుతోందన్నారు.

**నగర పరిధిలో లక్ష ఇందిరమ్మ ఇళ్లు..**

తెలంగాణ హౌసింగ్ బోర్డు కూడా 'క్యూర్' ప్రాంతంలో లాటరీ ఎంపికలను పబ్లిక్‌గా ప్రకటించి, అభ్యంతరాలు స్వీకరించే విధానాన్ని అమలు చేస్తోందని, ప్రస్తుతం ఒక్కో నియోజకవర్గంలో తొలి విడతగా 480 ఇళ్ల చొప్పున నిర్మాణ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నారు. ఇప్పటికే గ్రామీణ ప్రాంతాలల్లో తొలి దశలో 4.50 లక్షల ఇందిరమ్మ ఇళ్లను ప్రభుత్వం మంజూరు చేసి, ఒక్కో ఇంటికి రూ.5 లక్షల ఆర్థిక సహాయం అందిస్తోందని, రెండో దశలో మరో 2.50 లక్షల ఇళ్లను మంజూరు చేసినట్లు మంత్రి తెలిపారు. హైదరాబాద్ నగర పరిధిలో లక్ష ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి ఇందిరమ్మ టవర్స్ కార్యక్రమాన్ని చేపట్టామన్నారు.ఇక్కడ దరఖాస్తు చేసుకున్న అర్హులైన ప్రతి పేద కుటుంబం నిరాశ చెందాల్సిన అవసరం లేదని,రెండో విడత, మూడో విడత, నాలుగో విడత, ఐదో విడతగా కూడా ఇళ్లు నిర్మిస్తాం. రాబోయే రెండున్నర సంవత్సరాల్లో 'క్యూర్' ప్రాంతంలో అర్హులైన పేదలకు దశలవారీగా ఇళ్లు అందిస్తాం అని మంత్రి హామీ ఇచ్చారు.ఇందిరమ్మ టవర్స్ నిర్మాణ పనులను వేగంగా పూర్తి చేసి, వచ్చే బోనాల నాటికి ఇక్కడి నుంచే లబ్ధిదారులతో బోనాలు ఎత్తించే విధంగా నిర్మాణాలను వేగవంతం చేస్తామని మంత్రి స్పష్టంచేశారు.

**నాణ్యత విషయంలో రాజీలేదు..**

ఇందిరమ్మ టవర్స్ నిర్మాణంలో నాణ్యత విషయంలో రాజీపడే ప్రసక్తే లేదని, లబ్దిదారులు తమ ఇల్లు ఎలా కడుతున్నారో చూసుకోవచ్చునని, నాణ్యతలో లోపం కనిపిస్తే అక్కడే ఉన్న అధికారులకు ఫిర్యాదు చేయాలని లబ్దిదారులకు వెల్లడించారు. ఇది ప్రభుత్వం ఇచ్చే ఒక గిఫ్ట్ కాదు.. మీ పిల్లలకు, మీ భవిష్యత్ తరాలకు మిగిలే ఆస్తి. రాయదుర్గం వంటి ప్రాంతంలో 'నాకూ ఒక సొంత అపార్ట్మెంట్ ఉంది' అని మీ పిల్లలు గర్వంగా చెప్పుకునేలా ఈ ఇంటిని కాపాడుకోండి అని మంత్రి కోరారు.గతంలో పేదలకు ఇళ్లు ఇస్తామని చెప్పి నగరానికి 30-40 కిలోమీటర్ల దూరంలో నిర్మించిన విధానాలకు భిన్నంగా, కాంగ్రెస్ ప్రభుత్వం హైదరాబాద్ నడిబొడ్డునే పేదలకు ఇళ్లు నిర్మిస్తోందని మంత్రి అన్నారు. పేదలకు ఇళ్లు నిర్మించే కార్యక్రమాన్ని కూడా రాజకీయ విమర్శలకు ఉపయోగించుకోవడం సరికాదని మంత్రి అన్నారు. గత ప్రభుత్వం అధికారంలో ఉన్న సమయంలో పేదల ఇళ్ల విషయంలో ఇచ్చిన హామీలు, అమలు చేసిన పనులపై ప్రజలే నిర్ణయం తీసుకున్నారని పొంగులేటి తెలిపారు.

# నో చేంజ్ ఇన్ సిలబస్

(మొదటి పేజీ తరువాయి)

ఏర్పాటు చేయలేదని స్పష్టం చేసింది. ఈ మేరకు ఓ ప్రకటనను విడుదల చేసింది. సిలబస్ మార్పు ప్రచారంతో ఆందోళన చెందుతున్న అభ్యర్థుల నుంచి వచ్చిన వినతులు, సందేహాలపై స్పందించిన కమిషన్.. పోటీ పరీక్షల సిలబస్ లో పెద్దగా ఏవైనా మార్పులు ప్రతిపాదిస్తే ఏడాది ముందే తెలియజేస్తామని పేర్కొంది. ఒకవేళ సిలబస్ లో స్వల్ప మార్పులు ఉన్నా గానీ.. ఆ వివరాలను సంబంధిత నియామక ప్రకటనతో పాటే జారీ చేస్తామని టీజీపీఎస్సీ కార్యదర్శి ప్రకటించారు.

# అక్టోబర్ 20 నుంచి న్యూజిలాండ్‌తో స్వేఛ్ఛా వాణిజ్యం

(మొదటి పేజీ తరువాయి)

చేస్తుందని గోయల్ తెలిపారు. 'న్యూజిలాండ్తో మరింత బలమైన భాగస్వామ్యాన్ని నెలకొల్పేందుకు భారత్ నిబద్ధతతో వ్యవహరిస్తోంది. ఈ క్రమంలోనే అక్టోబర్ 20న దసరా సందర్భంగా భారత్-న్యూజిలాండ్ స్వేఛ్ఛావాణిజ్య ఒప్పందం ప్రారంభం కాబోతోంది' అని గోయల్ వెల్లడించారు. ఈ ఒప్పందం భారత్ లోని వ్యవసాయ ఉత్పాదకతపైనా ప్రభావం చూపిస్తుందని, న్యూజిలాండ్ సాంకేతికత భారతదేశపు అవసరాలను, పెరుగుతున్న డిమాండును తీరుస్తుందని ఆయన పేర్కొన్నారు. ఇరుదేశాల ఆర్థిక వ్యవస్థలకు ప్రయోజనం చేకూరేలా ఈ స్వేఛ్ఛావాణిజ్య ఒప్పందం కుదుర్చుకున్నట్లు తెలిపారు.

# ఇరాన్‌లో కోడ్ 100

(మొదటి పేజీ తరువాయి)

భద్రతా దళాలను సంసిద్ధంగా ఉంచడమే. దళాలను అవసరమైన చోట వేగంగా మోహరించేలా, యుద్ధప్రాతిపదికన సైనిక సమాచార మార్పిడి తగ్గట్టుగా చర్యలు ఉంటాయి. దీంతో అమెరికా, ఇరాన్‌మధ్య మరోసారి భీకరదాడులు జరుగుతాయా..? అనే ఆందోళన వ్యక్తమవుతోంది. అయితే, ఈ కోడ్ 100 అలర్ట్‌పై ఇరాన్ నుంచి అధికారికంగా ఎలాంటి ప్రకటనా రాలేదు. ప్రస్తుతం పశ్చిమాసియాలో అమెరికా మిత్ర దేశం సౌదీ అరేబియా, ఇరాన్ మద్దతున్న హూతీ తిరుగుబాటుదారుల మధ్య ఘర్షణలు జరుగుతున్నాయి. సౌదీ చమురు ఎగుమతులకు తీవ్ర అంతరాయం కలుగుతోంది. కీలకమైన ఈస్ట్-వెస్ట్ ఆయిల్ పైప్‌లైన్ (పెట్రో లైన్) మూసివేయాల్సి వచ్చింది. సౌదీ రాజధాని రియాద్‌లో భారీ పేలుడు శబ్దాలు వినిపించాయి. రియాద్ సహా పరిసర ప్రాంతాలపై తాము క్షిపణి, డ్రోన్ దాడులు చేసినట్లు హూతీలు ప్రకటించగా.. వాటిని తాము అడ్డుకున్నామని సౌదీ ప్రకటించింది. హూతీలపై దాడులకు దిగే అవకాశాలను అమెరికా పరిశీలిస్తోందంటూ ఒక దశలో వార్తలు వచ్చాయి.వాటి కోసమే ట్రంప్ క్యాంప్ డేవిడ్‌లో తన పర్యటనను కుదించుకుని షెడ్యూల్ కంటే ఒక రోజు ముందుగానే శ్వేతసౌధానికి చేరుకున్నారని పలు కథనాలు పేర్కొన్నాయి. పశ్చిమాసియాలో దాడులు మరింత తీవ్రమయ్యే అవకాశం ఉండడంతో ఆయా దేశాల్లో ఉన్న తమ పౌరులు అప్రమత్తంగా ఉండాలని అగ్రరాజ్యం సూచించింది. ఆ సమయంలో ఇరాన్ కోడ్ 100ను యాక్టివేట్ చేసిందన్న మీడియా కథనాలు వెలువడ్డాయి.

# దళితుల దేవాలయ ప్రవేశానికి వందేండ్లు



హైదరాబాద్, సెప్టెంబర్ 21: దళితులు హిందూ దేవాలయంలోకి ప్రవేశించి కర్పూర హారతి ఇచ్చిన చారిత్రక ఘటనకు వందేళ్లు పూర్తవుతున్న సందర్భంగా అక్టోబర్ 11, 12, 13 తేదీల్లో

## అక్టోబర్ 11 నుంచి తిరుపతిలో శతాబ్ది ఉత్సవాలు

### నాటి ఘటన గురించి వెల్లడించిన కేంద్ర మాజీ మంత్రి చింతా మోహన్

తిరుపతిలో శతాబ్ది ఉత్సవాలు నిర్వహించనున్నట్లు కేంద్ర మాజీ మంత్రి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు చింతామోహన్ తెలిపారు. సోమవారం హైదరాబాద్‌లోని సోమాజిగూడ ప్రెస్ క్లబ్ లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు.

**మురుగన్‌ను తిరుపతి జైల్లో**

**బంధించారు..**

1925 అక్టోబర్ 13న దేశంలోనే తొలిసారిగా దాసరి మురుగన్ అనే దళితుడు హిందూ దేవాలయంలోకి ప్రవేశించి కర్పూర హారతి ఇచ్చారని చింతామోహన్ తెలిపారు. ఈ ఘటనపై అప్పట్లో సెక్షన్ 295 కింద కేసు నమోదు చేసి మురుగన్ను తిరుపతి జైలుకు తరలించినట్లు పేర్కొన్నారు. ఈ విషయం తెలుసుకున్న రాజగోపాలాచారి తిరుపతికి వచ్చి కోర్టులో మురుగన్ తరఫున వాదనలు వినిపించారని చెప్పారు. దీంతో మురుగన్కు శిక్ష పడకుండా చూశారని, అలాగే సెక్షన్ 295ను రద్దు చేయాలని న్యాయమూర్తిని కోరినట్లు తెలిపారు.

దళితుల ఆలయ ప్రవేశానికి వందేళ్లు పూర్తవుతున్న సందర్భంగా తిరుపతిలో నిర్వహించనున్న శతాబ్ది ఉత్సవాలకు దేశంలోని పలువురు ప్రముఖులు హాజరుకానున్నారని చింతామోహన్ వెల్లడించారు. ఈ చారిత్రక ఘటనను గుర్తుచేసుకుంటూ మూడు రోజుల పాటు వివిధ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

**ఆర్టికల్ 46 అమలు చేయాలి**

రాజ్యాంగంలోని ఆర్టికల్ 46 ప్రకారం ఎస్సీ, ఎస్టీల ఆర్థిక అభివృద్ధికి ప్రభుత్వాలు ప్రత్యేక చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత ఉందని చింతామోహన్ అన్నారు. దేశంలోని 28 రాష్ట్రాల్లో ఎస్సీ, ఎస్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ల ద్వారా అర్హులకు రుణాలు అందిస్తున్నట్లు తెలిపారు. అయితే ఆంధ్రప్రదేశ్లో ఎస్సీ, ఎస్టీ ఫైనాన్స్ కార్పొరేషన్లు పేరుకే ఉన్నాయని, కార్యాలయాలకు తాళాలు వేసి ఉన్నాయని ఆరోపించారు. జగన్, చంద్రబాబు నాయుడు ప్రభుత్వాలు రాజ్యాంగంలోని ఆర్టికల్ 46 స్ఫూర్తికి విరుద్ధంగా వ్యవహరిస్తున్నాయని చింతామోహన్ విమర్శించారు. ఎస్సీ, ఎస్టీల ఆర్థిక అభివృద్ధికి ప్రభుత్వాలు మరింత ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు.

**మీడియా స్వేఛ్ఛపై వ్యాఖ్యలు..**

దేశంలో మీడియా స్వేచ్ఛ తగ్గిపోయిందని చింతామోహన్ ఆవేదన వ్యక్తం చేశారు. అనేక మీడియా సంస్థలు కార్పొరేట్ల చేతుల్లోకి వెళ్లడంతో జర్నలిస్టులు వాస్తవాలను నిర్భయంగా, స్వేచ్ఛగా రాయలేని పరిస్థితి ఏర్పడిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వాల హయాంలో మీడియాకు పూర్తి స్వేచ్ఛ ఉండేదని ఆయన పేర్కొన్నారు. బీజేపీ పాలనలో గత 12 ఏళ్లుగా జర్నలిస్టులకు స్వేచ్ఛ కరువైందని చింతామోహన్ ఆరోపించారు.

# అయ్యప్ప ప్రసాదం కొరత

## ట్రావెన్‌కోర్ దేవస్థానం బోర్డు, ప్రభుత్వాల మధ్య పంచాయతీ

శబరిమల, సెప్టెంబర్ 21: సుప్రసిద్ధ శబరిమల అయ్యప్ప ఆలయంలో ప్రసాదం కొరతపై కేరళం ప్రభుత్వం, ట్రావెన్కోర్ దేవస్థానం బోర్డు మధ్య వివాదం ముదిరింది.

భక్తులకు సరిపడా ప్రసాదం లేకపోవడంపై కేరళం మంత్రి మురళీధరన్ తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. నిర్వహణ లోపం వల్లే ఇలాంటి పరిస్థితి తలెత్తిందని, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ అవసరమైతే హైకోర్టుకు వెళ్తానని అన్నారు. ప్రసాదం కొరత ఏర్పడటంతో ఆదివారం పంపిణీని పరిమితం చేసిన సంగతి తెలిసిందే. ప్రతి యాత్రికుడు ఒక అరవణ పాయసం, మూడు అప్పం ప్యాకెట్లను మాత్రమే కొనుగోలు చేసేందుకు అనుమతిచ్చారు. అది కూడా ప్రసాదం కౌంటర్లను మధ్యాహ్నం 1.30కే మూసేశారు. తిరిగి 5 గంటలకు మళ్లీ తెరిచారు. దీంతో భక్తుల నుంచి తీవ్ర విమర్శలు వ్యక్తమయ్యాయి.

ఈ తరహా పరిస్థితులు భవిష్యత్తులో పునరావృతం కాకుండా ఉండాలంటే.. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాల్సిన అవసరముందని మంత్రి మురళీధరన్ అన్నారు. ముఖ్యమంత్రి సతీశన్ తోనూ మాట్లాడి.. విచారణకు ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేయాలని కోరనున్నట్లు చెప్పారు. అయితే, కన్ని నెలలో స్వామిని దర్శించుకునే భక్తుల కోసం దాదాపు 2.6 లక్షల డబ్బాల ప్రసాదాన్ని ముందే సిద్ధం చేసినట్లు దేవస్థానం అధికారులు చెబుతున్నారు. గతేడాది కంటే 50 వేల డబ్బాలు అధికంగానే తయారు చేశామని, సీజను ప్రారంభం కాకముందే భక్తుల సంఖ్య పెరిగిపోవడంతోనే ఈ సమస్య తలెత్తిందని తెలిపారు. సోమవారం నాటికి కేవలం 14 వేల డబ్బాలు మాత్రమే మిగిలి ఉన్నట్లు చెప్పారు.మరోపక్క, ప్రసాదం తయారీ కేంద్రాన్ని ఆధునీకరిస్తున్నందువల్లే కొరత ఏర్పడిందని ట్రావెన్కోర్ దేవస్థానం బోర్డు చెబుతుండటంపై మంత్రి తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. ఎలాంటి ముందస్తు సమాచారం ఇవ్వకుండా పనులు ఎలా చేపడతారని ఆగ్రహం వ్యక్తం చేశారు. శబరిమల యాత్ర నేపథ్యంలో.. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకూడదన్న ఉద్దేశంతో ముందస్తుగా ప్రసాదం తయారీ కేంద్రాన్ని ఆధునీకరిస్తున్నట్లు దేవస్థానం బోర్డు తెలియజేయడం గమనార్హం.

## మలిదశ ఉద్యమకారుడు

- లింగాల కేదారి కుటుంబానికి ఆర్థికసాయం
- సీఎంఆర్ఎఫ్ నుంచి రూ.10 లక్షలు అందించండి
- అధికారులకు సీఎం రేవంత్ రెడ్డి ఆదేశం

హైదరాబాద్, సెప్టెంబర్ 21(మనం బ్యూరో ): తెలంగాణ మలిదశ ఉద్యమంలో అంకితభావంతో సేవలందించిన లింగాల కేదారి కుటుంబానికి ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి రూ.10 లక్షల ఆర్థిక సాయం అందించాలని సీఎం రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. కేదారి దంపతులు ఒక సాధారణ హోటల్ నడుపుతూ అన్నం పరబ్రహ్మ స్వరూపమనీ, వృథా చేయకూడదని అవగాహన కల్పిస్తూ సమాజం పట్ల ఎంతో బాధ్యతగా నడుచుకున్నారని గుర్తు చేశారు. ఉద్యమ సమయంలో వీరు ఉచితంగా భోజనం, టిఫిన్లు, టీలు అందించారని పేర్కొన్నారు. ఈనెలలో లింగాల కేదారి, పుష్పలత దంపతులు విషాదకర ఘటనలో మృతి చెందారు. దీంతో వారి కుటుంబాన్ని ఆదుకోవడానికి సీఎంఆర్ఎఫ్ నుంచి రూ.10 లక్షల ఆర్థిక సాయాన్ని మంజూరు చేశారు. మంజూరైన ఆర్థిక సాయాన్ని అర్హులైన చట్టబద్ధ వారసులు, కుటుంబ సభ్యులకు అందించేలా చర్యలు తీసుకోవాలని హనుమకొండ కలెక్టర్‌ను ఆదేశించారు.

# లాభాల శిఖరాగ్రానికి ఏపీహెచ్ఎంఈఎల్

## మూడేళ్లలో రూ.34.20 కోట్ల నికర లాభం

### మూసివేత అంచుల నుంచి జాతీయ స్థాయికి ఎదిగిన సింగరేణి అనుబంధ సంస్థ

### 2025-26 ఆర్థిక సంవత్సరంలో రికార్డు స్థాయిలో రూ.23.33 కోట్ల లాభాలు నమోదు

### ఉప ముఖ్యమంత్రి చొరవతో పారిశ్రామికంగా నూతన జవసత్వాలు



హైదరాబాద్,సెప్టెంబర్ 21 (మనం న్యూస్): మూడేండ్ల క్రితం వరకు నష్టాల కారణంగా మూసివేత అంచున కొట్టుమిట్టాడిన ఆంధ్రప్రదేశ్ హెవీ మెషినరీ అండ్ ఇంజినీరింగ్ లిమిటెడ్ (ఏపీఎచ్ఎంఈఎల్) ఇప్పుడు లాభాల బాటలో దూసుకుపోతోంది. సింగరేణి కాలరీస్ సంస్థ నిర్వహణ, రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రోత్సాహంతో ఈ సంస్థ అద్భుతమైన ప్రగతిని సాధిస్తోంది. సింగరేణి అధికారులు వెల్లడించిన వివరాల ప్రకారం.. గడిచిన మూడేండ్లలో ఏపీఎచ్ఎంఈఎల్ రూ.34.20 కోట్ల నికర లాభాన్ని ఆర్జించి రికార్డు సృష్టించింది. దాదాపు మూడు దశాబ్దాల క్రితం రూ.21 కోట్ల పేరుకుపోయిన నష్టాలతో మనుగడే ప్రశ్నార్థకంగా మారిన ఈ సంస్థకు సింగరేణి రూపంలో పునర్జన్మ లభించింది. 1998-99లో సింగరేణి ఆధీనంలోకి వచ్చిన నాటి నుంచి ఇప్పటివరకు సంస్థ మొత్తం రూ.60.85 కోట్ల సంచిత లాభాలను ఆర్జించింది. ముఖ్యంగా గత మూడేళ్లలో సంస్థ ఆర్థిక పనితీరు అసాధారణంగా మెరుగుపడింది.2023-24 ఆర్థిక సంవత్సరంలో రూ.1.05 కోట్లు,2024-25 ఆర్థిక సంవత్సరంలో రూ.9.87 కోట్లు,2025-26 ఆర్థిక సంవత్సరంలో రికార్డు స్థాయిలో రూ.23.33 కోట్ల నికర లాభాలను సాధించింది.

**జాతీయ స్థాయికి వ్యాపార విస్తరణ**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ప్రత్యేక చొరవతో ఏపీఎచ్ఎంఈఎల్‌ను జాతీయ స్థాయిలో పోటీపడే సంస్థగా తీర్చిదిద్దేందుకు చర్యలు చేపట్టారు. గత ఏడాది ఆగస్టులో ఉప ముఖ్యమంత్రి స్వయంగా కొండపల్లిలోని ప్లాంటును సందర్శించి అభివృద్ధి ప్రణాళికలపై సమీక్షించారు.

కేవలం తెలుగు రాష్ట్రాలకే పరిమితం కాకుండా బీహెచ్ఈఎల్, జెన్‌కో, ఎన్ఎండీసీ, ఆర్ఐఎన్ఎల్ వంటి దేశంలోని దిగ్గజ సంస్థలకూ యంత్రాలు, విడిభాగాలను సరఫరా చేస్తూ ఏపీఎచ్ఎంఈఎల్ తన మార్కెట్‌ను విస్తరిస్తోంది. సంస్థను మరింత లాభదాయకంగా మార్చేందుకు వ్యయ నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారించారు. ఇందులో భాగంగా ప్లాంటు ప్రాంగణంలో రూ.1.24 కోట్ల వ్యయంతో 300 కిలోవాట్ల సోలార్ విద్యుత్ ప్లాంటును ఏర్పాటు చేశారు. దీని ద్వారా ప్రతి నెలా రూ.2 లక్షల వరకు విద్యుత్ ఖర్చు ఆదా కానుండగా, క్లీన్ ఎనర్జీ దిశగా సంస్థ గొప్ప ముందడుగు వేసింది. సింగరేణి నుంచి ఎండీ స్థాయి అధికారి నియామకం, పద్ధతుల మార్పు, నూతన ఆర్డర్‌ల సాధన తదితర చర్యలతో ఏపీఎచ్ఎంఈఎల్ నేడు దేశవ్యాప్తంగా గుర్తింపు పొందుతున్నట్లు అధికారులు వెల్లడించారు.

# సర్ ప్రక్రియ పేరుతో వికృత చేష్టలకు పాల్పడుతున్నరు




## అద్వానీ, జైశంకర్ వంటి ప్రముఖ నేతలకు సైతం నోటీసులు జారీ చేసిండ్రు

## పెళ్లి తర్వాత మహిళల ఇంటిపేర్లు మారడాన్ని పెద్ద సమస్యగా చూపుతున్నరని సీపీఐ నారాయణ ఫైర్

## ఎద్దు ఈనిందంటే దూడను గాట్లో కట్టేయమన్నట్లుగా' ఉందని ఎద్దేవా

హైదరాబాద్, సెప్టెంబర్ 21, మనం ప్రతినిధి: ఎన్నికల సంఘం ఓటర్ల జాబితా ప్రక్షాళన (సర్) పేరుతో చేపడుతున్న వింత, వికృత చర్యలు ప్రజల ప్రాథమిక ఓటు హక్కును కాపాడేలా లేవని, విజ్ఞతలేని తీరుతో ఓటర్లను తీవ్రంగా అవమానించేలా ఉన్నాయని సీపీఐ సీనియర్ నేత నారాయణ ఘాటుగా విమర్శించారు. సర్ ప్రక్రియ పేరుతో ఎన్నికల కమిషన్ వ్యవహరిస్తున్న వైఖరి 'ఎద్దు ఈనిందంటే దూడను గాట్లో కట్టేయమన్నట్లుగా' ఉందని ఎద్దేవా చేశారు. ఓటర్ల వివరాల్లో ఏవైనా సాంకేతిక లోపాలు, తప్పులు ఉంటే వాటిని క్షేత్రస్థాయిలో సరిదిద్దాలే తప్ప... దేశ మాజీ ఉపప్రధాని ఎల్.కె. అద్వానీ, ప్రస్తుత విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్ వంటి అత్యున్నత ప్రముఖులకు కూడా నోటీసులు జారీ చేయడం ఏ రకమైన ప్రక్షాళన అని నారాయణ నిలదీశారు. ఇదిలా ఉంటే, పేర్లలో చిన్నపాటి స్పెల్లింగ్ పొరపాట్లు, వివాహానంతరం మహిళల ఇంటిపేర్లు మారడం వంటి అత్యంత సహజమైన అంశాలను కూడా పెద్ద సమస్యలుగా చిత్రీకరించడం, తాతముత్తాతల పుట్టిన తేదీలను వెతకాలంటూ ప్రజలను ఇబ్బందులకు గురిచేయడం విడ్డూరంగా ఉందని నారాయణ మండిపడ్డారు. దేశంలో ఉన్న కోట్లాది మంది ఓటర్ల హక్కుల పరిరక్షణ విషయంలో ఎన్నికల సంఘం అత్యంత పారదర్శకంగా, రాజ్యాంగబద్ధమైన నిష్పక్షపాతంతో వ్యవహరించాలని స్పష్టం చేశారు. ప్రధాని కార్యాలయం నడిపించే ఒక 'సురభి నాటకం'లో స్వయంప్రతిపత్తి గల ఎన్నికల కమిషన్ అపవిత్రమైన పావుగా మారకూడదని తీవ్ర స్థాయిలో విమర్శించారు.

# జర్నలిస్టులు వృత్తి నిర్వహణలో టెక్నాలజీని అందిపుచ్చుకోవాలి

- మీడియా అకాడమీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి
- తెలంగాణ మీడియా అకాడమీ, గూగుల్ న్యూస్ ఇనీషియేటివ్ ఆధ్వర్యంలో ఏఐపై వర్క్‌షాప్
- ఏఐ టూల్స్ వినియోగంపై జర్నలిస్టులకు అవగాహన కల్పించిన నిపుణులు



హైదరాబాద్,సెప్టెంబర్ 21 (మనం న్యూస్): జర్నలిస్టులు తమ వృత్తి నిర్వహణలో టెక్నాలజీని పూర్తిగా అందిపుచ్చుకోవాలని తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ కే.శ్రీనివాసరెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం నాంపల్లిలోని తెలంగాణ మీడియా అకాడమీలో కృత్రిమ మేధ (ఏఐ) టూల్స్ అండ్ టెక్నిక్స్‌పై ఒకరోజు వర్క్‌షాప్‌ను నిర్వహించారు. తెలంగాణ మీడియా అకాడమీ,డాటా లీడ్స్, గూగుల్ న్యూస్ ఇనిషివేటివ్ సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ప్రముఖ దినపత్రికలు, టీవీ ఛానెళ్లకు చెందిన తెలుగు, ఇంగ్లీష్, ఉర్దూ భాషా జర్నలిస్టులు పెద్దఎత్తున పాల్గొన్నారు. జర్నలిజం రంగంలో ఏఐ పరిజ్ఞానాన్ని జర్నలిస్టులు తప్పనిసరిగా పెంపొందించుకోవాల్సిన సమయం ఆసన్నమైందని శ్రీనివాసరెడ్డి అన్నారు. డిజిటల్, సోషల్ మీడియా విభాగాల్లో ఏఐని వృత్తిగతంగా ఉపయోగించుకోవడం ద్వారా రిపోర్టింగ్ విధానాలు సులభతరమవుతాయని, తక్కువ సమయంలోనే ఎక్కువ సమాచారాన్ని పాఠకులు, వీక్షకులకు అందించవచ్చని ఆయన తెలిపారు.

రిసోర్స్ పర్సన్ ఉడుముల సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ.. జర్నలిస్టు ఎప్పుడూ నిత్య విద్యార్థిలా ఉంటూ కొత్త విషయాలను నేర్చుకోవాలని తెలిపారు. ఏఐ శిక్షణలో భాగంగా ఏఐ టూల్స్ ఉపయోగాలు, వాటి వల్ల ఎదురయ్యే సవాళ్లు, నియమ నిబంధనలు, ప్రాథమిక అంశాలను ఆయన విశదీకరించారు. చాట్‌జీపీటీ, పెర్‌ప్లెక్సిటీ, నోట్‌బుక్ ఎల్ఎం, గూగుల్ జెమిని, మిడ్‌జర్నీ, సోరా, వీఈవో తదితర ఆధునిక టూల్స్ జర్నలిజంలో ఎలా ఉపయోగించాలో పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా వివరించారు. ప్రాంప్టింగ్ సరిగ్గా చేయకపోవడం వల్ల తప్పుడు సమాచారం వ్యాప్తి చెందే ప్రమాదం ఉందని హెచ్చరిస్తూ, ఏఐ నైతిక నియమ నిబంధనలకు లోబడి జర్నలిస్టులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని నిపుణులు సూచించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ మీడియా అకాడమీ కార్యదర్శి నాగులపల్లి వెంకటేశ్వరరావుతో పాటు పలువురు జర్నలిస్టులు, అధికారులు పాల్గొన్నారు.

# జంతు సంక్షేమం, ప్రజా భద్రతకు సర్కార్ పెద్దపీట

### సుప్రీంకోర్టు ఆదేశాల అనుసారంగా వీధి కుక్కల నిర్వహణపై ఉన్నత స్థాయి సమీక్ష

### ప్రజారోగ్యం, జంతు సంరక్షణ సమన్వయంతో ముందుకు వెళ్లాలి

### మంత్రి వాకిటి శ్రీహరి స్పష్టీకరణ



హైదరాబాద్,సెప్టెంబర్ 21 (మనం న్యూస్): తెలంగాణ రాష్ట్రంలో జంతు సంక్షేమం, ప్రజా భద్రతకు రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని రాష్ట్ర మంత్రి వాకిటి శ్రీహరి స్పష్టం చేశారు.రాష్ట్ర సచివాలయంలో మంత్రి అధ్యక్షతన తెలంగాణ రాష్ట్ర జంతు సంక్షేమ బోర్డు రెండో బోర్డు తొలి సమావేశం జరిగింది. వీధి కుక్కల నిర్వహణ, కుక్క కాట్ల నివారణ, ప్రజా భద్రత తదితర కీలక అంశాలపై సుప్రీంకోర్టు ఆదేశాలకు అనుగుణంగా ఈ సమావేశంలో విస్తృతంగా చర్చించారు. రాష్ట్రవ్యాప్తంగా ఏబీసీ రూల్స్ 2023 పకడ్బందీగా అమలు చేయడం, ఏబీసీ కేంద్రాలను మరింత బలోపేతం చేయడంపై సమావేశంలో ప్రత్యేకంగా సమీక్షించారు. ప్రమాదకర కుక్కల నిర్వహణ, జంతు సంరక్షణ కేంద్రాల ఏర్పాటు, అత్యవసర పశువైద్య సేవలను మరింత మెరుగుపరచడం వంటి అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. చిన్నారులు, సాధారణ ప్రజలు, రహదారి భద్రతతో పాటు ప్రజారోగ్యానికి అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, అదే సమయంలో జంతువుల పట్ల చట్టబద్ధమైన, మానవతా దృక్పథంతో వ్యవహరించాలని మంత్రి అధికారులను ఆదేశించారు.

**సమన్వయంతోనే క్షేత్రస్థాయిలో సత్ఫలితాలు..**

జంతు సంక్షేమం, ప్రజా భద్రత వంటి బృహత్తర బాధ్యతలను విజయవంతంగా నిర్వర్తించాలంటే కేవలం ఒక్క శాఖపైనే భారం పెట్టకుండా సంయుక్తంగా ముందుకు వెళ్లాలని మంత్రి సూచించారు. పశుసంవర్ధక, మున్సిపల్, పంచాయతీరాజ్, వైద్యారోగ్య, విద్య, పోలీస్ శాఖలు,స్థానిక సంస్థలు పరస్పర సమన్వయంతో పనిచేస్తేనే ఆశించిన ఫలితాలు సాధించవచ్చని ఆయన స్పష్టంచేశారు.ఈ సమావేశంలో ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్, డాక్టర్ కె. ఇలంబర్తి , డాక్టర్ బి. గోపీ , ప్రొఫెసర్ జ్ఞానప్రకాశ్, దివ్య దేవరాజన్, చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్స్ క్షితిజ, జీహెచ్ఎంసీ, సీఎంసీ, ఎంఎంసీ కమిషనర్‌లులతో పాటు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# 100 మంది రైతులకు నోటీసులు

### సర్వే నంబర్ 325లో భూములున్న అందరికీ అందజేత

### జాగాకు సంబంధించిన ఆధారాలతో రావాలని సూచన

### ఎర్రవల్లిలో మూడోరోజు రెవెన్యూ అధికారుల సర్వే

### శివారు వెంకటాపూర్ రైతుల అభ్యంతరాలు

గజ్వేల్, సెప్టెంబర్ 21 మనం న్యూస్ : సిద్దిపేట జిల్లా మర్కుక్ మండలం ఎర్రవల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని సర్వే నంబర్ 325లో భూములున్న వంద మంది రైతులకు రెవెన్యూ అధికారులు నోటీసులు జారీ చేశారు. ఈ నెల 21న భూమికి సంబంధించిన ఆధారాలతో రావాలని సూచించారు. రైతుల వారీగా క్షేత్రస్థాయి సర్వే నిర్వహించేందుకు ఈ నోటీసులు జారీ చేశారు. ఎర్రవల్లిలో మాజీ సీఎం కేసీఆర్ ఫామ్హౌస్ పరిసరాల్లో రెవెన్యూ అధికారులు మూడో రోజూ సర్వే నిర్వహించారు. ఎర్రవల్లి గ్రామ పరిధిలోని 325 సర్వే నంబర్లో 388 ఎకరాల భూమి ఉండగా.. ఇందులో దాదాపు 160 మంది రైతులకు పట్టాలున్నాయి.

వీరిలో బీసీ, ఎస్సీలే అధికంగా ఉన్నారు. శనివారం గజ్వేల్ ఆర్డీవో చంద్రకళ, సర్వే ఏడీ సుదర్శన్ల నేతృత్వంలో ఐదు ప్రత్యేక టీమ్లు ఎర్రవల్లి సమీపంలోని భూములను క్షేత్రస్థాయిలో పరిశీలించాయి. 325 సర్వే నంబర్లోని 388 ఎకరాల భూ హద్దులపై సర్వే పూర్తి చేశారు. అనంతరం ఎర్రవల్లి గ్రామ పంచాయతీ కార్యాలయంలో జీపీవో ఆధ్వర్యంలో 325 సర్వే నంబర్లో భూములున్న వంద మంది రైతులకు నోటీసులు అందజేశారు. రైతులు ఈ నెల 21న ఆధారాలతో వచ్చిన తర్వాత వారి భూముల హద్దులను కూడా పరిశీలించనున్నారు. ఎర్రవల్లి, శివారు వెంకటాపూర్ గ్రామాల్లోని భూములతో పాటు 325 సర్వే నంబర్లోని భూముల హద్దులను గత రెండు రోజులుగా ప్రత్యేక టీమ్ల ద్వారా నమోదు చేశారు. శనివారం ఆయా గ్రామాల పరిధిలోని భూములను ప్రత్యేక టీమ్లు క్షేత్రస్థాయిలో పరిశీలించాయి. అనంతరం మర్కుక్ తహసీల్దార్ ఆఫీస్లో సర్వే బృందాలు సమావేశమై అప్పటి వరకు సేకరించిన వివరాలు, మ్యాప్లను పరిశీలించాయి.

**కాస్రా, సేత్వార్ ప్రకారం సర్వే చేయండి**

ఎర్రవల్లిలోని కేసీఆర్ ఫామ్ హౌజ్ సమీప గ్రామాల్లో రెవెన్యూ ఆఫీసర్లు భూములను సర్వే చేస్తుండగా శివారు వెంకటాపూర్ రైతులు అభ్యంతరం వ్యక్తం చేశారు. కేసీఆర్ ఫామ్ హౌజ్ సమీపంలోని325 సర్వే నంబర్ లో 388 ఎకరాలుంటే ఇందులో 180 ఎకరాలు శివారు వెంకటాపూర్ గ్రామానికి సంబందించినవేనన్న విషయాన్ని రైతులు అధికారులకు తెలియజేశారు.

మొత్తం 388 ఎకరాల్లో 250 ఎకరాలు మాత్రమే ఎర్రవల్లి గ్రామస్తులవని, మిగిలిన 180 ఎకరాలు శివారు వెంకటాపూర్ గ్రామానికి చెందినవైతే వాటిని కూడా ఎర్రవల్లి గ్రామంలో కలుపుకుంటున్నారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రస్తుతం జరుగుతున్న సర్వే వల్ల తమకు అన్యాయం జరుగుతుందని కాస్రా, సెత్వార్ రికార్డుల ప్రకారం సర్వే చేయాలని డిమాండ్ చేశారు. గతంలో అధికారులు, సిబ్బంది చేసిన తప్పిదం వల్లే భూ రికార్డుల్లో తప్పులు నమోదు అయ్యాయని, శివారు వెంకటాపూర్ గ్రామంలోని దాదాపు 20 సర్వే నంబర్లలోని భూమి 325 సర్వే నంబర్ లో ఉన్నట్లుగా చూపిస్తున్నారని ఈ విషయంలో తమకు అన్యాయం జరిగితే సహించేది లేదని హెచ్చరించారు.

# క్వాకర్‌వోడ్జర్ లను తయారుచేసిన కేంద్రం

- కాంగ్రెస్ ఎంపీ శశి థరూర్ వ్యాఖ్య

ఢిల్లీ, సెప్టెంబర్ 21 : కాంగ్రెస్ ఎంపీ శశి థరూర్ క్లిష్టమైన ఆంగ్ల పదంతో మరోసారి ఎక్స్ వేదికగా పోస్టు పెట్టారు. తాజాగా 'క్వాకర్ వోడ్జర్' అనే పదాన్ని తెరపైకి తెచ్చారు. దీనికి అర్థం 'ఇతరుల నియంత్రణలో ఉండే రాజకీయ నాయకుడు.. ఇతరుల ఆదేశాల మేరకు పనిచేసే రాజకీయ కీలుబొమ్మ' (పొలిటికల్ పప్పెట్) అంటూ అందులో వివరించారు. గత 12 ఏండ్లుగా కేంద్రంలో అధికారంలో ఉన్న పార్టీ ఇలాంటి కొందరిని తయారు చేసిందని ఆయన వ్యాఖ్యానించారు. దీంతో ఆయన ఎవరిని ఉద్దేశించి అన్నారనే దానిపై చర్చ మొదలైంది. అయితే ఈ పదం థరూర్ తొలిసారి ఉపయోగించింది కాదు. 2022 ఏప్రిల్లోనూ దీనిని ఉపయోగించి పోస్టు పెట్టారు. థరూర్ గతంలోనూ ఇలాంటి ఎన్నో పదాలను రాజకీయ వ్యాఖ్యలకు ఉపయోగించారు. అలోడాక్సాఫోబియా.. ఈ భయం ఉన్న వ్యక్తులు ఇతరుల ముందు తమ అభిప్రాయాలను చెప్పడానికి తీవ్రంగా భయపడుతుంటారని పేర్కొన్నారు. క్లిష్టమైన పదజాలంతో రాజకీయ అంశాలను ప్రస్తావించడం థరూర్ ప్రత్యేకత అన్న విషయం పాఠకులకు తెలిసిందే.

## అద్వితీయం.. అపూర్వం

# 1600 రోజుల దేశభక్తి పర్వం

### రేపటితో సరికొత్త రికార్డు సృష్టించనున్న నిత్య జనగణమన

హైదరాబాద్,సెప్టెంబర్ 21 (మనం న్యూస్): ఒక రోజు కాదు.. రెండు రోజులు కాదు.. ఏకంగా 1600 రోజులు! ఎక్కడా ఆగకుండా, ఏనాడూ విశ్రాంతి తీసుకోకుండా, వర్షం, ఎండ అనే తేడా లేకుండా ప్రతిరోజూ ఉదయం అక్షరాలా దేశభక్తిని ఆవాహన చేసుకుంటూ హైదరాబాద్ నగరంలోని నల్లకుంటలో సాగుతున్న అద్భుత ప్రయాణం 'నిత్య జనగణమన'. ఎలాంటి విరామమూ లేకుండా సరిగ్గా రేపటితో 1600 రోజులను పూర్తి చేసుకుంటూ ఈ వేడుక చరిత్ర సృష్టిస్తోంది. దేశ చరిత్రలోనే ఇదొక అరుదైన, అపూర్వమైన మైలురాయిగా నిలుస్తోంది. ఈ చారిత్రక ఘట్టానికి వేళవుతున్న వేళ.. 1598వ రోజైన సోమవారం నిర్వహించిన ప్రత్యేక వేడుక ఎంతో ఉత్సాహభరితంగా సాగింది. ఈ కార్యక్రమానికి ప్రముఖ 'బ్లైండ్ ఫోల్ వర్ల్డ్ రికార్డ్ మేజిషియన్', కల్చరల్ పెర్సనాలిటీ, జీఎంఆర్ ఎయిర్‌పోర్ట్ ప్యాసింజర్ ఎంగేజ్‌మెంట్ అండ్ సేఫ్టీ డిపార్ట్మెంట్ ఆర్గనైజర్ టీ. విజయ్‌కాంత్ ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా వందే ప్రజాసభ్యులు ఆయనకు ఘనంగా స్వాగతం పలికారు. ముందుగా మాతృభూమికి వందనం చేస్తూ 'వందేమాతరం' గీతాలాపనతో ప్రాంగణం మార్మోగింది.

అనంతరం ముఖ్య అతిథి విజయ్‌కాంత్ చేతుల మీదుగా జాతీయ జెండా ఆవిష్కరింపజేశారు. త్రివర్ణ పతాకానికి వందనం చేస్తూ.. అక్కడున్న ప్రతి ఒక్కరూ గొంతుక కలిపి ఆలపించిన జనగణమన గీతం అందరిలోనూ దేశభక్తి భావాలను తట్టిలేపింది. నరనరాన దేశభక్తిని నింపుకుంటూ సాగిన ఈ సామూహిక గీతాలాపన ప్రతి ఒక్కరిలో దేశభక్తిని నింపుకునేలా చేసింది. ఈ స్ఫూర్తిదాయక యాత్ర వెనుక ఉన్న విశేషాలను ఫౌండర్ ఆర్గనైజర్




నేలంటి మధు పంచుకున్నారు. దేశభక్తిని కేవలం గణతంత్ర, స్వాతంత్ర్య దినోత్సవాలకే పరిమితం చేయకుండా, ప్రతినిత్యం ప్రజల్లో జాతీయ భావాన్ని నింపాలన్న సంకల్పంతో ప్రారంభించిన ఈ ప్రయాణం రేపటితో 1600 రోజులకు చేరుకోవడం యావత్ దేశం గర్వించదగ్గ విషయమన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్గనైజర్‌లు వందే ప్రజా శ్రీనివాస్, ఉపేందర్ ప్రసాద్ దూబే, డీఎన్ రావు, బట్టు రమాదేవి, గంధం బాలరాజు, శంకర్ తదితరులు పాల్గొని ఈ అరుదైన విజయానికి బాటలు వేయడంలో తమ వంతు పాత్ర పోషించినందుకు గర్విస్తున్నామని తెలిపారు. రోజురోజుకూ ప్రజల భాగస్వామ్యం పెరుగుతూ, అప్రతిహతంగా కొనసాగుతున్న 'నిత్య జనగణమన' నేడు దేశానికే రోల్‌మాడల్‌గా నిలుస్తోంది.

# బీఆర్ఎస్ ఎమ్మెల్సీలు తాతా మధు, నవీన్ రెడ్డిలకు హైకోర్టు నోటీసులు

### స్పీకర్ ను దూషించిన కేసులో.. అరెస్టు చేయొద్దన్న నాంపల్లి కోర్టు తీర్పుపై హైకోర్టులో పోలీసులు కౌంటర్ దాఖలు

### తాతా మధు, నవీన్ రెడ్డిలకు హైకోర్టు నోటీసులు

హైదరాబాద్, సెప్టెంబర్ 21, మనం ప్రతినిధి: తెలంగాణ శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ ను అసభ్య పదజాలంతో దూషించారనే ఆరోపణల కేసులో బీఆర్ఎస్ ఎమ్మెల్సీలు తాతా మధు, నవీన్ రెడ్డిలకు తెలంగాణ రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం షాక్ ఇచ్చింది. నాంపల్లి సీనియర్ సివిల్ కోర్టు ఇచ్చిన అరెస్ట్, రిమాండ్ నిరాకరణ ఉత్తర్వులను సవాలు చేస్తూ పోలీసులు దాఖలు చేసిన పిటిష్న విచారణ చేపట్టిన హైకోర్టు ధర్మాసనం, ఈ వ్యవహారంలో తమ సమాధానాన్ని వివరణాత్మకంగా కౌంటర్ దాఖలు చేయాలని ఇద్దరు ఎమ్మెల్సీలకు సోమవారం నాడు అధికారిక నోటీసులు జారీ చేసింది. అయితే ఈ విచారణ సందర్భంగా పబ్లిక్ ప్రాసిక్యూటర్ నాగేశ్వరరావు కోర్టు ఎదుట వాదనలు వినిపిస్తూ, రాజ్యాంగబద్ధమైన స్పీకర్ పదవిలో ఉన్న వ్యక్తిని బీఆర్ఎస్ ఎమ్మెల్సీలు అత్యంత అనుచిత పదజాలంతో దూషించడమే కాకుండా... విధులు నిర్వర్తిస్తున్న పోలీసు అధికారులపై కూడా దాడులకు తెగబడ్డారని తెలిపారు. వీరిద్దరి అరెస్టును, రిమాండ్ను అడ్డుకుంటూ నాంపల్లి కోర్టు ఇచ్చిన ఉత్తర్వులను కొట్టివేయాలని కోరారు. ఇరు వర్గాల ప్రాథమిక నివేదికలను పరిశీలించిన హైకోర్టు, తదుపరి స్పష్టత కోసం ఎమ్మెల్సీల కౌంటర్ దాఖలుకు ఆదేశిస్తూ తదుపరి విచారణను ఎల్లుండికి వాయిదా వేసింది.

**దస్తావేజులు పోయినవి**

నేను టి. నాగ నారాయణ రావు తండ్రి టి. సుబ్బా రాయుడు నివాసం కర్నూలు గ్రామం కర్నూలు మండలం కర్నూలు జిల్లా, ఏమనగా పుల్లూరు గ్రామ శివారులో ఉన్న ప్లాటు నెం.17 నాకు సంబంధించిన దస్తావేజు నెం. 2111/1985. నేను హైదరాబాదు నుండి కర్నూలుకు బస్సులో వస్తుండగా దస్తావేజులు పోయినవి. కావున దస్తావేజులు దొరికిన వారు నాకు ఇవ్వగలరని తెలియచేయడం అయునది.
తమ విదేయులము
టి. నాగ నారాయణ రావు
కర్నూలు గ్రామం, కర్నూలు మండలం, కర్నూలు జిల్లా.
పోన్ నెం. 8121938698

## హేతువాద సూర్యుడు!

బావుల్లో తన్నీర్
తాకనివ్వని మూర్ఖుల
చేతులను నడివీధిలో
మణికట్టుతో సహా
నరికిన పురట్చి గండ్రగొడ్డలి ఆయన
గుడి గుమ్మాల్లో
అడుగు పెట్టనివ్వని
అహంకారుల కనుగుడ్లను
తన రేడికల్ సూదితో పొడిచి
ఇరుళ్ చేసిన క్రోధాగ్ని
ఇన్ ది నేమ్ ఆఫ్ గాడ్
బహుజనుల శ్రమను
దోచిన కురుతి వ్యవస్థ గుండెకాయను
చేతులతోనే వెళియే లాగి
కసితీర పిండేసిన సమరశీలి

ఓ తంబి అణగారిన వర్గాల దేహాల్లో
చల్లారిపోయిన ఆ ముర్దా ఖూన్ను
ధమనులు బద్దలయ్యేలా
ఉడికించిన ఇంతికామ్ జ్వాల పెరియార్
అక్షరానికి దూరం చేసి
చదువును దొంగిలించిన ఆతిక్క శక్తిగళ్
తలలను మోకాళ్ల కింద నలిపి
విద్యాదాతగా నిలిచాడు

తీండత్తగాదవర్గళ్ అంటూ మిమ్మల్ని
ఒడుక్కుపట్టవర్గళ్ గా మార్చి
ఊరి వెలుపల నిలబెట్టిన
ఈ జాలిమ్ సమాజ్ వెన్నుపూసను
ఐ విల్ కిక్ హిం డౌన్ స్టైర్ అంటూ
ఒక్క లాత్ మార్తో విరిచి
ఆ కుళ్లిన సమాజపు అస్థిపంజరంపై
మన మక్కళ్ సెల్ఫ్ రెస్పెక్ట్ జయకేతనాన్ని
నిజంగానే ఎగరేసిన
చారిత్రక శిల్పి ఆయన

మహిళలను వంటింటి గులామిగా
కేవలం భోగ వస్తువులుగా
చూసిన లోకాన్ని
వన్ స్ట్రైట్ బ్లోతో
నిలువునా చీల్చి పారేశాడు
ఆడబిడ్డల కాళ్లకు వేసిన
పాట్రియార్కీ బేడీలను
వారి పాదాల చర్మం
ఊడిపోయేలా లాగి పడేసి
ఆ గాయాల నుండి
చిమ్మిన రక్తంతోనే
విడుదలై
సమానత్వ సామ్రాజ్యానికి
పునాది వేసిన రౌద్రమూర్తి ఆయన
మనుషుల్లో హెచ్చుతగ్గులు చూపే
ఈ జాత్ పాత్ కుళ్లిన దేహాన్ని
గోళ్లతో చీల్చి ప్రేగులను
బాహర్ తీసి తగులబెడుతూ
ఇదేం తమాషా కాదు
దిమాగ్ లేని ఆ అంధేరా తలలకు
సర్జరీ చేసిన
పగుత్తరివు సూరియన్ పెరియార్
ఆయన ఆలోచనలు
ఎన్నటికీ ఇమ్మోర్టల్
ఈ నేలపై ప్రతి అణగారిన వాడి
నరాల్లో రక్తం ప్రవహించినంత కాలం
శత్రువుల గుండెలెనక
ఖౌఫ్ పుట్టించే ఇంక్విలాబ్ అయి
ఈ పోరాటం జీవించే ఉంటుంది!

**- సర్వేశ్వరరావు నీలం**
630 4664 725

ఎడిట్ పేజీ కోసం మీ సామాజిక విశ్లేషణలు, సాహిత్య వ్యాసాలు
manamlekhalu@ gmail.com
మెయిల్ అడ్రస్‌కు పంపగలరు
ఈ పేపర్ కోసం
https://www.manamepaper.com/
వెబ్‌సైట్‌లో చూడండి- ఎడిటర్

# గుర్తింపు అడిగిన చోట.. అవకాశం లేదేంటి?



ఒక మనిషికి తన గుర్తింపుతో జీవించే హక్కు ఉన్నప్పుడు, ఆ గుర్తింపుతోనే విద్య, వైద్యం, ఉపాధి పొందే అవకాశం కూడా ఉండాలి. 2026లో లింగ వైవిధ్యంతో జీవిస్తున్న వారి విషయంలో సమాజం ముందున్న ప్రధాన ప్రశ్న ఇదే. 2014 ఏప్రిల్ 15న సుప్రీంకోర్టు నేషనల్ లీగల్ సర్వీసెస్ అథారిటీ వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా తీర్పులో వారి లింగ గుర్తింపును గుర్తించింది. స్వీయ గుర్తింపుకు చట్టపరమైన ప్రాధాన్యం ఇచ్చింది. సమానత్వం, వివక్ష నుంచి రక్షణ, జీవించే హక్కు వంటి రాజ్యాంగ హక్కుల పరిధిలో లింగ గుర్తింపునకూ రక్షణ ఉంటుందని స్పష్టం చేసింది. ఆ తర్వాత ట్రాన్స్‌జెండర్ వ్యక్తుల హక్కుల పరిరక్షణ చట్టం-2019 అమల్లోకి వచ్చింది. వివక్ష నిషేధం, విద్య, ఉపాధి, నివాసం, వృత్తి శిక్షణ, స్వయం ఉపాధి, ఆరోగ్యసేవలు వంటి అంశాలకు చట్టపరమైన వ్యవస్థను కల్పించింది. చట్టం దిశను నిర్దేశించింది. ఇప్పుడు ఆ హక్కులు పత్రాల్లో మాత్రమే కాకుండా తరగతి గదిలో, ఉద్యోగ స్థలంలో, ఆసుపత్రిలో, ప్రభుత్వ కార్యాలయంలో, కుటుంబంలో కూడా ఆచరణలో కనిపించాల్సిన అవసరం ఉంది. గుర్తింపును అంగీకరించడం మొదటి అడుగు. ఆ గుర్తింపుతో ప్రతిభను నిరూపించుకునే అవకాశం కల్పించడం తదుపరి అడుగు.

2011 జనగణనలో దేశవ్యాప్తంగా 4,87,803 మంది 'ఇతరులు' అనే వర్గంలో నమోదయ్యారు. అయితే ఆ వర్గాన్ని మొత్తం ట్రాన్స్‌జెండర్ జనాభాగా నేరుగా పరిగణించడం సరి కాదు. ఆ వర్గీకరణలో ఇతర కారణాలతో నమోదు చేసుకున్న వ్యక్తులు ఉండే అవకాశం ఉంది. కొంతమంది తమను పురుషుడు లేదా మహిళగా నమోదు చేసి ఉండే అవకాశం కూడా ఉంది. అందువల్ల 2011లో నమోదైన 'ఇతరులు' సంఖ్యను ప్రస్తుత జనాభాకు నేరుగా సమానంగా చూడలేం. 2023 డిసెంబర్ 12న కేంద్ర ప్రభుత్వం వెల్లడించిన వివరాల ప్రకారం, తెలంగాణలో జాతీయ ట్రాన్స్‌జెండర్ పోర్టల్ ద్వారా 1,236 దరఖాస్తులు అందగా, 631 గుర్తింపు ధ్రువపత్రాలు జారీ అయ్యాయి. ఇవి మొత్తం జనాభా సంఖ్యలు కావు. ప్రభుత్వ గుర్తింపు వ్యవస్థలో నమోదైన దరఖాస్తులు, ధ్రువపత్రాల సంఖ్య మాత్రమే. 2026 మే 19న జాతీయ మానవ హక్కుల కమిషన్ జారీ చేసిన ట్రాన్స్‌జెండర్ వ్యక్తుల సంక్షేమంపై సలహా పత్రం-2.0లో రాబోయే జనగణన, జాతీయ సర్వేల్లో ఈ సమాజానికి సంబంధించిన మరింత సమగ్ర సమాచార సేకరణ అవసరాన్ని సూచించింది. సరైన గణాంకాలు ఉంటేనే అవసరాలను అంచనా వేయడం, పథకాలను రూపొందించడం, వాటి ఫలితాలను కొలవడం మరింత సమర్థంగా సాధ్యమవుతుంది.



అంతర్జాతీయ స్థాయిలోనూ ఈ అంశం కేవలం గుర్తింపు ప్రశ్నగా కాకుండా ఆరోగ్యం, మానవ హక్కులు, భద్రత, విద్య, ఉపాధి, సామాజిక భాగస్వామ్యంతో ముడిపడిన అంశంగా ఉంది. ప్రపంచ ఆరోగ్య సంస్థ అంతర్జాతీయ వ్యాధుల వర్గీకరణ వ్యవస్థ పదకొండో సంచికలో లింగ అసమతుల్యతను మానసిక, ప్రవర్తనా రుగ్మతల అధ్యాయం నుంచి 'లైంగిక ఆరోగ్యానికి సంబంధించిన పరిస్థితులు' విభాగానికి మార్చింది. ప్రపంచ ఆరోగ్య సంస్థ వివరణ ప్రకారం, ఈ విభాగంలో చేర్చడం ద్వారా లింగ గుర్తింపుకు సంబంధించిన ఆరోగ్య అవసరాలు ఉన్న వారికి అవసరమైన వైద్య సేవలు అందుబాటులో ఉండేలా చూడటం, ఆరోగ్య బీమా వంటి అంశాలను పరిగణనలోకి తీసుకునే అవకాశం కల్పించడం లక్ష్యాల్లో ఒకటి. దేశాల చట్టాలు, విధానాలు, సామాజిక పరిస్థితులు ఒకేలా ఉండవు. అందువల్ల అంతర్జాతీయ అనుభవం నుంచి కనిపించే ముఖ్యమైన అంశం గుర్తింపు ఒక ప్రారంభ దశ మాత్రమే. విద్య, ఆరోగ్యం, ఉపాధి, భద్రత, సామాజిక గౌరవం అందేలా వ్యవస్థలను బలోపేతం చేయడం తదుపరి దశ.

వారి జీవితాల్లో శాశ్వతమైన మార్పు రావాలంటే సంక్షేమాన్ని కేవలం ఆర్థిక సహాయానికి పరిమితం చేయకూడదు. విద్య నుంచి ఉపాధి వరకు ఒక నిరంతర అవకాశ వ్యవస్థగా మార్చాలి. ట్రాన్స్‌జెండర్ వ్యక్తుల హక్కుల పరిరక్షణ చట్టం-2019 సమగ్ర విద్య, వృత్తి శిక్షణ, స్వయం ఉపాధి, ఆరోగ్య సేవలకు ప్రాప్యత వంటి అంశాలపై ప్రభుత్వ చర్యలకు చట్టపరమైన ఆధారాన్ని కల్పించింది. జాతీయ స్థాయిలో ఈ వర్గం కోసం విద్య, నైపుణ్యాభివృద్ధి, వైద్య సదుపాయాలు, ఆర్థిక అనుసంధానం వంటి అంశాలను కలుపుకున్న సంక్షేమ కార్యక్రమాలు అమల్లో ఉన్నాయి. 2026 మేలో జాతీయ మానవ హక్కుల కమిషన్ విద్య, ఆరోగ్యం, ఆస్తి, ఉద్యోగ స్థలాలు, న్యాయ హక్కులు, పోలీసు వ్యవస్థ, ఆశ్రయ గృహాలు వంటి కీలక రంగాల్లో చర్యలను సూచించింది. రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో రక్షణ వ్యవస్థలను బలోపేతం చేయడం కూడా ప్రభుత్వ విధాన చర్చలో భాగమైంది.

ఒక వ్యక్తి ప్రభుత్వ సహాయం కోసం జీవితాంతం ఎదురు చూడాల్సిన పరిస్థితి కాకుండా, విద్యను పూర్తి చేసి, నైపుణ్యం సంపాదించి, ఉద్యోగం లేదా స్వయం ఉపాధితో తన జీవితాన్ని తానే నిర్మించుకునే స్థితి రావాలి. సంక్షేమ పథకాలు తక్షణ అవసరాలను తీర్చగలవు. కానీ దీర్ఘకాలిక మార్పుకు నాణ్యమైన విద్య, వృత్తి శిక్షణ, ఉద్యోగ అవకాశాలు, సురక్షితమైన పని వాతావరణం, ఆరోగ్య సేవలు, సామాజిక అంగీకారం అవసరం. ఒక వ్యక్తి తన ప్రతిభతో ముందుకు వెళ్లే పరిస్థితి ఏర్పడితే ప్రభుత్వ సహాయం కూడా మరింత ఫలప్రదంగా మారుతుంది. వాళ్లకూ కలలున్నాయి. మనం అవకాశాలిస్తున్నామా? ఈ ప్రశ్నకు సమాధానం పథకాల సంఖ్యలో మాత్రమే కాదు. ఆ పథకాల ద్వారా ఎంతమంది గౌరవంగా తమ జీవితాలను తామే నిర్మించుకోగలుగుతున్నారన్న దాంట్లోనూ ఉంటుంది. ప్రభుత్వం ఇవ్వాల్సింది కేవలం సహాయం కాదు.. స్వయం నిలబడే అవకాశం. సమాజం చూపాల్సింది జాలి కాదు. సమాన గౌరవం. చట్టం గుర్తింపును ఇచ్చింది. ఇప్పుడు ఆ గుర్తింపుకు విద్య, ఉపాధి, ఆరోగ్యం, భద్రత, గౌరవం జతకావాలి. అప్పుడే హక్కు కాగితంపై ఉన్న మాట కాకుండా జీవితంలో కనిపించే వాస్తవంగా మారుతుంది.

**- ఫిరోజ్ ఖాన్**
9640466464

# ఉద్యమ నాయకుడు కొండా లక్ష్మణ్

భారత స్వాతంత్ర్య పోరాటంలో, ముల్కీ ఉద్యమంలో, నిరంకుశ నిజాం వ్యతిరేక పోరాటంలో, తెలంగాణ 1969 నాటి తొలి, మలి దశ ఉద్యమాలలో కీలక పాత్రలు వహించిన, జీవితాంతం తెలంగాణ సమస్యలపై పోరాటం చేసిన తెలంగాణ పక్షపాతి దివంగత కొండా లక్ష్మణ్ బాపూజీ. ఏక కాలంలో నాలుగు భిన్నమైన, అంతర్గత సంబంధం కలిగి ఉన్న ప్రజా ఉద్యమాలతో ఆయన జీవితం ముడివడి ఉన్నది. అవి వరుసగా నిజాం వ్యతిరేక పోరాటం, వెనుకబడిన కులాల ఉద్యమం, చేనేత సహకారోద్యమం, ప్రత్యేక తెలంగాణోద్యమం. వాస్తవానికి తెలంగాణ ఉద్యమానికి ఆయన ఆది గురువు. 1969లో తొలి దశ పోరాటంలోనే కీలక పాత్ర పోషించి, మంత్రి పదవిని కూడా తృణ ప్రాయంగా త్యజించిన త్యాగశీలి. తెలంగాణ వాసుల కష్టాలు తీరాలంటే, ప్రత్యేక రాష్ట్ర సాధన తప్ప వేరే మార్గం లేదని భావించి, అందుకు వివిధ మార్గాలలో నిరసన స్వరాలు వినిపించాడు. ఆదిలాబాద్ జిల్లా వాంకిడిలో 1915 సెప్టెంబర్ 27న కొండా లక్ష్మణ్ జన్మించాడు. ప్రాథమిక విద్య ఆసిఫాబాద్‌లో, హైదరాబాద్‌లో న్యాయ శాస్త్ర విద్య పూర్తి చేసి, 1948లో న్యాయవాదవృత్తి చేపట్టాడు. నిజాం ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఉద్యమించిన వారి పక్షాన కేసులను వాదించాడు. 1942లో క్విట్ ఇండియా ఉద్యమంలో పాల్గొన్నాడు. 1947 ఆగస్టు 15న దేశానికి స్వాతంత్ర్యం సిద్ధించిన, దేశంలోని అంతర్భాగమైన నిజాం ఏలుబడిలో ఉన్న తెలంగాణ, నిజాం నిత్య అకృత్యాలకు లోనైన దుస్థితిలో తెలంగాణ విమోచనోద్యమంలో క్రియా శీలక పాత్ర పోషించాడు. 1947 డిసెంబర్ 4న నిజాం ప్రభువుపై బాంబులు విసిరిన నారాయణరావు పవార్ బృందంలో కొండా లక్ష్మణ్ కూడా నిందితుడే. కొంతకాలం అజ్ఞాతంగా ఉన్నాడు. నిజాం నిరంకుశ పాలనపై నిప్పుల వర్షం కురిపిస్తూ, ఆయన పాలన అంతానికి, తిరుగుబాటు బావుటా ఎగుర వేసి, తొలుదొలుత వ్యూహ రచన చేసింది బాపూజీయే. 1952 లో తొలిసారి ఆసిఫాబాద్ శాసనసభ కాంగ్రెస్ అభ్యర్థిగా విజయం సాధించి, శాసనసభలో అడుగు పెట్టాడు. 1957లో చిన్న కొండూరు నుండి గెలుపొంది శాసనసన డిప్యూటీ స్పీకర్‌గా బాధ్యతలు స్వీకరించాడు. 1962లో స్వల్పతేడాతో ఓటమి పాలైనా, ప్రత్యర్థి అక్రమాలతో గెలిచారని కేసు పెట్టి, విజయం సాధించాడు. 1967లో భువనగిరి నుండి గెలిచాడు. 1957-60 వరకు ఉమ్మడి రాష్ట్రం డిప్యూటీ స్పీకర్‌గా, అనంతరం దామోదరం సంజీవయ్య క్యాబినెట్‌లో ఎక్సైజ్, చేనేత, చిన్నతరహా పరిశ్రమల శాఖ మంత్రిగా, బ్రహ్మానందరెడ్డి మంత్రివర్గంలో కార్మిక, సమాచార శాఖ మంత్రిగా బాధ్యతలు నిర్వర్తించారు. తర్వాత సీఎం పదవికోసం పీవీ నరసింహారావుతో పోటీ పడ్డాడు. సీఎం పదవి దక్కనందుకు గవర్నర్‌గా నియమిస్తామని నాటి ప్రధాని ఇందిరా గాంధీ పిలిచిచెపితే, సున్నితంగా తిరస్కరించాడు. కాసు బ్రహ్మానంద రెడ్డి ముఖ్యమంత్రిత్వ ప్రభుత్వంలో కేబినెట్ మంత్రిగా ఉంటూ, ప్రత్యేక తెలంగాణ ఉద్యమ సమయంలో తెలంగాణ పక్షపాతిగా ఉద్యమ ఉధృతి కోసం రాజీనామా



చేశాడు. 1969 మార్చి 27న తన రాజీనామాను ముఖ్యమంత్రి కాసు బ్రహ్మానందరెడ్డికి అందజేసిండు. దాన్ని ఆమోదిస్తున్నట్లు సీఎం ప్రకటించిండు. ఈ రాజీనామా ప్రత్యేక తెలంగాణ ఉద్యమాన్ని ఒక చారిత్రక మలుపు తిప్పిందని చెప్పవచ్చు. 1972లో భువనగిరి నుండి విజయం కైవసం చేసుకున్నాడు. 1973లో పాములపర్తి వేంకట నరసింహారావు తదనంతరం ముఖ్యమంత్రి అయ్యే అవకాశం గడప తొక్కిన , ఇందిరా గాంధీ ఒప్పుకున్నా, నాటి హోంమంత్రి ఉమా శంకర్ దీక్షిత్ పట్టు వల్ల వెంగళరావుకు ముఖ్యమంత్రి అయ్యే ఛాన్స్ దొరికింది. 1958లో హుస్సేన్‌సాగర్ తీరాన భూమి కొనుక్కుని జలదృశ్యం నిర్మించుకోగా, 2002లో చంద్రబాబు ప్రభుత్వం దాన్ని నేలమట్టం చేయించగా, కోర్టు కెళ్ళి తనకు అనుకూల తీర్పు పొందాడు. చివరకు 97వ సంవత్సరంలో 2012 సెప్టెంబర్ 21న మరణించగా, జలదృశ్యం లోనే అంత్య క్రియలు జరిగాయి. 1952లో ముల్కీ ఉద్యమంతో తెలంగాణ కోసం పోరాటం ప్రారంభించి, ప్రత్యేక రాష్ట్రం కోసం తొలి రాజీనామా చేసి, 97 ఏళ్ల పండు ముదుసలి వయసులో, ఎముకలు కొరికిన చలిని లెక్క చేయక ఢిల్లీలో దీక్షచేసి, గాంధీ మార్గంలో శాంతియుత పోరాటాన్ని ఎంచుకుని, బాపూజీగా పిలువబడే కొండా లక్ష్మణ్, తన ఆస్తులను, జీవితాన్ని ధారబోసి, కొండంత గొప్ప వ్యక్తిత్వం, నిబద్ధత కలిగిన రాజకీయ ఆదర్శ నేతగా గుర్తింపు నొందాడు. 2000లో మలి దశ ఉద్యమం ప్రారంభించిన కేసీఆర్‌ను ప్రోత్సహించడమే కాదు సెక్రటేరియట్ ఎదురుగా ఉన్న తన నివాస బంగ్లా జలదృశ్యంను టీఆర్ఎస్ ప్రధాన కార్యాలయానికి ఇచ్చారు. ఇక్కడే తెలంగాణ రాష్ట్ర సమితి ఆవిర్భవించింది. నాటి నుంచి అశోక్ నగర్‌లోని అద్దె ఇంటిలోనే కొండా లక్ష్మణ్ బాపూజీ నివసించాడు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధన కోసం చివరి శ్వాస ఉన్నంత వరకు చిత్తశుద్ధితో కృషి చేసి, మూడు తరాల వారధి ఉన్న తెలంగాణ రాష్ట్ర అలు పెరుగని, అవిశ్రాంత పోరాట యోధుడు బాపూజీ తెలంగాణ ప్రజానీకానికి ప్రాతఃస్మరణీయుడు.

**- రామ కిష్టయ్య సంగన భట్ల**
9440595494

## నిశ్శబ్దంగా ఉండిపోకు

ఇప్పుడు ఆమె ఎందుకో
మాటలను పూర్తిగా మరిచిపోయింది
వెలుగును చీకట్లు మింగేసినట్టు
ఇప్పుడు ఆమె నిశ్శబ్దాన్ని మింగేసింది
చిన్న పిల్లోడు జాతరలో కాట కలిసినట్టు
ఇప్పుడు ఆమె మా ఇంటిని కూడా కాటకలిసింది

చిన్న హాస్యపు గుళికను విసిరితేనే
పత్తి పువ్వోలే పక్కున నవ్వే ఆమె
ఇప్పుడు మాట్లాడని పర్వతంలా

ఎక్కడో ఒంటరిగా ఉండిపోయింది
కదిలిస్తే కుండపోతలా కురిసే మాటలు
ఇప్పుడు ఎక్కడో ఆగిపోయినవి

ఇప్పుడు తనకు తానే అంతర్యుద్ధం చేస్తూ
అరణ్యంలో మౌన .మునిలా మారిపోయింది
కర్పూరంలా కరిగిపోయే ఆమె మనసు ఇప్పుడు
ఇంకిపోయిన సముద్రమయింది

నువ్వు నింగిలా నిశ్శబ్దంగా ఉండిపోకు
నా ఎదపై కోకిల గొంతై వినిపించూ
నువ్వు సముద్రం లా ఉండిపోకు
నా దాహాన్ని తీర్చే నదిలా మారిపో
నేలలా మౌనంగా ఉండిపోకు
నా జీవిత గాలి పటానికి దారంలా సాగిపో

నది సముద్రాన్ని వదలదు
ఆకాశం భూమిని మరవదు
మన మధ్య ఎడబాటు తగదు

**- తాటిపాముల రమేష్ (తార)**
7981566031

# సీక్రెట్ డేటింగ్ ఉచ్చు.. కుటుంబంలో చిచ్చు!

చేతిలో సెల్‌ఫోన్.. తెరపై పరిచయం.. మాటల్లో మమకారం.. ఆపై రహస్య చాటింగ్! ఒక్క క్లిక్‌తో మొదలయ్యే పరిచయం ఎటు దారి తీస్తుందో తెలియదు. ఫొటో, వీడియో, డబ్బు, బ్లాక్‌మెయిల్ దాకా చేరితే ఒక వ్యక్తి సమస్య కాస్తా కుటుంబ సమస్యగా మారుతుంది. ప్రేమ కోసం వెతికిన పరిచయం..మోసానికి బాట వేస్తే? నమ్మకం పేరుతో వ్యక్తిగత వివరాలు రాబట్టి, ఆ తర్వాత అదే సమాచారాన్ని ఆయుధంగా మార్చితే? సీక్రెట్ డేటింగ్ పేరుతో పెరుగుతున్న డిజిటల్ పరిచయాలను ఇక వ్యక్తిగత వ్యవహారంగా మాత్రమే చూసే పరిస్థితి లేదు. గ్లీడెన్ వెల్లడించిన నగరాల వారీ వినియోగదారుల గణాంకాల్లో బెంగళూరుకు 18 శాతం, హైదరాబాద్‌కు 17 శాతం, ఢిల్లీకి 11 శాతం, ముంబైకి 9 శాతం, పుణెకు 7 శాతం వాటా ఉంది. భారత వినియోగదారుల్లో 65 శాతం పురుషులు, 35 శాతం మహిళలు కాగా, రెండేళ్లలో మహిళల భాగస్వామ్యం 148 శాతం పెరిగిందని సంస్థ తెలిపింది. ఈ గణాంకాలు ఒకే వేదికకు సంబంధించినవే. అయినా రహస్య పరిచయాల కోసం ప్రత్యేక డిజిటల్ వేదికలకు పెరుగుతున్న ఆదరణ కుటుంబ సంబంధాలపై కొత్త ప్రశ్నలు లేవనెత్తుతోంది. దేశవ్యాప్తంగా గత ఐదేళ్లలో 4.5 కోట్లకు పైగా భారతీయులు సీక్రెట్ లేదా డిస్క్రీట్ డేటింగ్ వేదికలను ఉపయోగించినట్లు లేదా పరిశీలించినట్లు ఒక నివేదిక పేర్కొంది. ఒక్క ఏడాదిలోనే 1.6 కోట్ల కొత్త నమోదులు జరిగినట్లు తెలిపింది. పరిచయం నేరం కాదు.. పరిచయాన్ని మోసానికి, బెదిరింపులకు, డబ్బు దోపిడీకి ఉపయోగించడమే అసలు ప్రమాదం.

తెలంగాణలో 2025లో డేటింగ్ యాప్ మోసాలకు సంబంధించి 569 మంది బాధితులు ఫిర్యాదు చేసి, రూ.2.81 కోట్ల నష్టం జరిగినట్లు నివేదించబడింది. బాధితుల్లో 61 శాతం మంది 18 నుంచి 35 ఏళ్ల మధ్య వయస్కులేనని గణాంకాలు చెబుతున్నాయి. పెళ్లి పేరుతో నమ్మించడం, విదేశీయులమని చెప్పి సంబంధాలు పెంచడం, నకిలీ పెట్టుబడులు చూపించడం, క్రిప్టోకరెన్సీ పేరుతో డబ్బు తీసుకోవడం, సన్నిహిత వీడియోలను అడ్డుపెట్టి బెదిరించడం వంటి పద్ధతులు నమోదయ్యాయి. డేటింగ్ యాప్లో మొదలైన పరిచయం డేటింగ్ దగ్గరే ఆగడం లేదు. డబ్బు, వ్యక్తిగత సమాచారం, ఫొటోలు, వీడియోలు దొరికితే అదే మోసగాళ్లకు కొత్త ఆయుధంగా మారుతోంది. అయితే నమోదైన ఘటనల్లో యువతులు, యువకులు, ఉద్యోగులు, వివాహితులు, కొత్త పరిచయాల కోసం డిజిటల్ వేదికలను ఆశ్రయించే వ్యక్తులు వివిధ రకాలుగా లక్ష్యంగా మారుతున్నారు. నకిలీ ఫొటోతో ప్రొఫైల్ సృష్టించడం.. కొద్దిరోజుల్లోనే ఆప్యాయత పెంచడం.. వ్యక్తిగత విషయాలు రాబట్టడం.. వీడియో కాల్కు ఒప్పించడం.. ఆ దృశ్యాలను రికార్డు చేయడం.. ఆపై డబ్బు డిమాండ్ చేయడం.. ఇదే తరహా మోసాల్లో కనిపించే పద్ధతి. ఏ పేరుతో పరిచయం మొదలైనా, చివరికి వ్యక్తిగత సమాచారం కోసం వల వేయవచ్చన్నదే హెచ్చరిక. హైదరాబాద్ పోలీసులు డేటింగ్ ఫ్రాడ్స్, హనీట్రాప్, ఫేక్ ప్రొఫైల్స్, మ్యాట్రిమోనియల్ ఫ్రాడ్స్, గోప్యత ఉల్లంఘన వంటి సైబర్ నేరాలపై హెచ్చరిస్తున్నారు. అపరిచితుడితో వీడియో కాల్ చేయడం, వ్యక్తిగత ఫొటోలు పంపడం, గుర్తింపు పత్రాలు లేదా బ్యాంకు వివరాలు పంచుకోవడం ప్రమాదకరం.



తాజాగా 'రెంట్-ఎ-బాయ్‌ఫ్రెండ్' పేరుతో ముందస్తు బుకింగ్ లేదా సెక్యూరిటీ డిపాజిట్ అడిగి, వ్యక్తిగత సమాచారాన్ని సేకరించి బ్లాక్‌మెయిల్ చేసే మోసాలపై కూడా హెచ్చరికలు వచ్చాయి.

ఈ ముప్పు పెద్దలతోనే ఆగడం లేదు. చిన్నారులను లక్ష్యంగా చేసుకుని లైంగిక వేధింపులకు పాల్పడుతున్న ఘటనలు మరింత ఆందోళన కలిగిస్తున్నాయి. డీప్‌ఫేక్, కృత్రిమ మేధ (ఏఐ) సాధనాలు అందుబాటులోకి రావడంతో నిజమైన చిత్రాలను మార్ఫింగ్ చేయడం, నకిలీ చిత్రాలతో బెదిరించడం వంటి ముప్పులు పెరిగాయి. ఇన్‌స్టాగ్రామ్‌లో చిన్నారుల లైంగిక దుర్వినియోగానికి సంబంధించిన కంటెంట్‌ను ప్రోత్సహించే ప్రకటనలపై కేంద్రం, జాతీయ బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ (ఎన్సీపీసీఆర్) దృష్టి సారించిన నేపథ్యంలో మెటా భారత దర్యాప్తు సంస్థలకు చిన్నారుల భద్రతకు సంబంధించిన కేసులను నేరుగా నివేదించేందుకు అంగీకరించింది. సమాచారం అందడం మొదటి అడుగు మాత్రమే; దానిపై వేగంగా దర్యాప్తు జరగడం, బాధిత చిన్నారిని రక్షించడం, నేరపూరిత దృశ్యాల వ్యాప్తిని అడ్డుకోవడం అంతే కీలకం. ముఖ్యంగా చిన్నారులకు సంబంధించిన అశ్లీల కంటెంట్ విషయంలో 'ఫిర్యాదు వచ్చిన తర్వాత తొలగించడం' సరిపోదు. వ్యాప్తి మొదలయ్యే ముందే గుర్తించి అడ్డుకునే సామర్థ్యం ఉండాలి. వ్యాపారం చేసే హక్కు ఉన్నట్టే, సమాజాన్ని కాపాడే బాధ్యత కూడా వేదికలపై ఉంటుంది. మెటా తాజా నిర్ణయం ఆ దిశగా ఒక ముందడుగు కావచ్చు. కానీ అది ముగింపు కాదు.

రహస్య పరిచయం.. దాపరికం.. అబద్ధం.. వ్యక్తిగత చిత్రాల మార్పిడి.. డబ్బు లావాదేవీ.. చిన్నచిన్న చెడు విత్తనాలు ఒకదానికొకటి పెనవేసుకుంటేనే మహావృక్షం రూపుదిద్దుకుంటుంది. ఇంట్లోనూ అంతే. ఆ మార్పును కుటుంబం గమనించకపోతే, శ్రద్ధ చూపకపోతే, 'ఏమవుతుందిలే' అంటూ ఉపేక్షిస్తే.. చివరకు అదే కుటుంబాన్ని చుట్టుముట్టే ప్రమాదం ఉంది. అందుకే తల్లిదండ్రులు పిల్లలతో, భార్యాభర్తలు ఒకరితో ఒకరు, కుటుంబ సభ్యులు పరస్పరం మాట్లాడు కోవాలి. నిఘా కేంద్రం కాకూడదు. అనుమానం పెంచడం కాదు.. నమ్మకాన్ని పెంచే సంభాషణ మొదలు పెట్టడం ముఖ్యం. పిల్లలు ఆన్‌లైన్‌లో ఎవరితో మాట్లాడుతున్నారో తెలుసుకోవాలి; అదే సమయంలో వారిని భయపెట్టకుండా, సమస్య వచ్చినప్పుడు చెప్పుకునే ధైర్యం కల్పించాలి. ఆధారాలను భద్రపరచి వెంటనే పోలీసులను ఆశ్రయించడం అవసరం. తెలంగాణలో సైబర్ నేరాల విస్తృతి పెరుగుతున్న నేపథ్యంలో రాష్ట్ర డీజీపీ సీవీ ఆనంద్ సైబర్ నేరాలు భవిష్యత్తులో అతిపెద్ద సవాల్‌గా మారుతున్నాయని హెచ్చరించారు. సమస్యను కేవలం డేటింగ్ యాప్ వరకు కుదించలేం. డిజిటల్ ప్రపంచంలో మనిషి గోప్యత, డబ్బు, గౌరవం, కుటుంబ బంధం అన్నీ ఒకే తెరపై ప్రమాదంలో పడే పరిస్థితి ఏర్పడింది.

అపరిచితుల ఫ్రెండ్ రిక్వెస్టును అంగీకరించకపోవడం, వ్యక్తిగత ఫొటోలు లేదా వీడియోలు పంపకపోవడం, ఓటీపీలు, పాస్వర్డ్‌లు పంచుకోకపోవడం, అనుమానాస్పద లింకులు తెరవకపోవడం, డేటింగ్ యాప్‌లో పరిచయమైన వ్యక్తికి డబ్బు పంపకపోవడం వంటి సాధారణ జాగ్రత్తలే తొలి రక్షణ గోడ. కుటుంబం నిందించే స్థలం కాకుండా అండగా నిలిచే స్థలంగా మారాలి. పిల్లలకు స్మార్ట్‌ఫోన్ ఇచ్చినంత మాత్రాన డిజిటల్ భద్రత నేర్పినట్టుకాదు. పాఠశాలల్లో సురక్షిత ప్రవర్తనపై అవగాహన, ఇళ్లలో సంభాషణ, వేదికల్లో పటిష్టమైన భద్రతా వ్యవస్థలు.. ఈ మూడూ కలిసినప్పుడే రక్షణ గోడ బలపడుతుంది. సంబంధాల్లో వ్యక్తిగత స్వేచ్ఛకు స్థానం ఉంది. కానీ స్వేచ్ఛకు తోడు బాధ్యత, డిజిటల్ వివేకం కూడా ఉండాలి. సాంకేతికతను ఆపడం సాధ్యం కాదు. దాని దుర్వినియోగాన్ని అడ్డుకోవడం మాత్రం సాధ్యం. ఒక అపరిచిత పరిచయం ఎప్పుడు నమ్మకంగా మారుతుందో, ఆ నమ్మకం ఎప్పుడు మోసగాడి ఆయుధంగా మారుతుందో గుర్తించడం కష్టం. అందుకే ప్రతి క్లిక్ ముందు ఒక్కసారి ఆలోచించాలి. పిల్లల చేతిలో స్మార్ట్‌ఫోన్ ఉంటే పక్కనే సంస్కారం ఉండాలి. పెద్దల చేతిలో డేటింగ్ యాప్ ఉంటే పక్కనే వివేకం ఉండాలి. కుటుంబాన్ని కాపాడేది కేవలం తలుపులు తాళాలు కాదు. పరస్పర నమ్మకం, సంభాషణ, డిజిటల్ జాగ్రత్త. సీక్రెట్ డేటింగ్ ఉచ్చు బయట కనిపించకపోవచ్చు.. కానీ అప్రమత్తమైన కుటుంబం దానికి చిక్కకుండా నిలబడగలదు.

**- శ్రీశైలం దూడం**
9133947176

# ప్రజావాణి ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలి

**పలు సమస్యలపై వినతులు స్వీకరించిన జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్**




**జగిత్యాల, సెప్టెంబర్ 21(మనం ప్రతినిధి):** ప్రజావాణి ద్వారా ప్రజల నుండి అందుతున్న ఫిర్యాదులు, వినతులపై సమగ్ర విచారణ జరిపి సమస్యలను సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ ఆడిటోరియంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ ప్రజల నుండి ఫిర్యాదులు, వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ మాట్లాడుతూ జిల్లా కేంద్రంతో పాటు వివిధ మండలాల నుండి ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం ప్రజావాణి కార్యక్రమానికి వస్తున్నారని తెలిపారు. ప్రజల నుండి అందుతున్న ప్రతి ఫిర్యాదును అధికారులు బాధ్యతాయుతంగా తీసుకొని, సంబంధిత సమస్యపై సమగ్ర విచారణ జరిపి సత్వర పరిష్కారానికి చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రజావాణి ద్వారా అందిన అర్జీలను పెండింగ్లో ఉంచకుండా ఎప్పటికప్పుడు పరిశీలించి, నిర్ణీత సమయంలో పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం లేకుండా ప్రజలకు మెరుగైన సేవలు అందించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈరోజు నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి మొత్తం 57 ఫిర్యాదులు, వినతులు అందాయని, వాటిని సంబంధిత శాఖల అధికారులు పరిశీలించి తగిన చర్యలు తీసుకొని పరిష్కరించాలని సూచించారు. ప్రజావాణి ద్వారా అందిన ప్రతి దరఖాస్తును అధికారులు ప్రాధాన్యతతో పరిశీలించి, సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టడంతో పాటు దరఖాస్తుదారులకు తగిన సమాచారం అందించాలని పేర్కొన్నారు. ప్రజలకు ప్రభుత్వ సేవలు సకాలంలో అందే విధంగా అధికారులు సమన్వయంతో పనిచేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ (రెవెన్యూ) బిఎస్ లత, అడిషనల్ కలెక్టర్ (లోకల్ బాడీస్) బి. రాజ గౌడ్, డిఆర్ఓ కె. వై ప్రసాద్, జిల్లా అధికారులు, వివిధ శాఖల అధికారులు, మున్సిపల్ కమిషనర్లు మరియు తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి ఓటరుకు నోటీసు అందేలా చర్యలు తీసుకోవాలి

**విచారణ ప్రక్రియను పారదర్శకంగా,నిబంధనల ప్రకారం నిర్వహించాలి**

**జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించిన రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి**



**జగిత్యాల, సెప్టెంబర్ -21(మనం ప్రతినిధి):** ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) కార్యక్రమంలో అనామలీస్, నో మ్యాపింగ్ కేటగిరీలో గుర్తించిన ప్రతి ఓటరుకు నోటీసులు అందించి, వారితో పకడ్బందీగా విచారణ నిర్వహించాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి జిల్లా ఎన్నికల అధికారులను ఆదేశించారు.సోమవారం హైదరాబాద్ నుంచి ఎస్ఐఆర్ ప్రక్రియ పురోగతిపై అన్ని జిల్లాల కలెక్టర్లతో రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. అనామలీస్, నో మ్యాపింగ్ ఓటర్లకు నోటీసుల జారీ, పంపిణీ, విచారణ ప్రక్రియపై జిల్లాల వారీగా సమీక్షించారు. సమీకృత జిల్లా కలెక్టరేట్ నుంచి జిల్లా కలెక్టర్ బి సత్య ప్రసాద్ మరియు అదనపు కలెక్టర్ (రెవెన్యూ) బి. ఎస్ లత పాల్గొన్నారు. ఈ సందర్భంగా ₹రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ ఫారమ్ 6, 7 మరియు 8ల పరిష్కారాన్ని చివరి నిమిషం వరకు వాయిదా వేయకుండా తొందరగా పరిష్కరించాలని ఆదేశించారు. ఛ్టి 25 లోపు అన్ని పనులు పూర్తి చేసుకోవాలని ఆఖరి 10 రోజులు చివరి క్షణం సవరణల కొరకు కేటాయించాలని కోరారు.ఫామ్ 6 తో డిక్లరేషన్ ఫారం తప్పకుండా ఇవ్వడం తప్పనిసరి అని మరియు నోటీస్ లు ఆజూా లు మాత్రమే పంపిణీ చెయ్యాలని ఆఔఅ లని పంపిణీలో పాల్గొననివ్వద్దు అని ఆదేశించారు.వయో వృద్ధులకు, అంగ వైకల్యం కలవారు మరియు విదేశాల్లో లో ఉన్న వారి తరపున వారీ కుటుంబ సభ్యులు హియరింగ్ కి హాజరయ్యి సంబంధిత డాక్యుమెంట్స్ ఇవ్వగలరని తెలిజేశారు.

వీడియో కాన్ఫరెన్స్ అనంతరం ₹జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి బి. సత్య ప్రసాద్ మాట్లాడుతూ,₹ జిల్లాలో పెండింగ్లో ఉన్న ఫారం-6, ఫారం-7, ఫారం-8 దరఖాస్తులను ఎప్పటికప్పుడు పరిశీలించి పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఎస్ఐఆర్-2026 ప్రక్రియలో నిర్దేశించిన లక్ష్యాలను గడువులోగా పూర్తి చేయాలని సూచించారు.బీఎల్ఓ స్థాయిలో ఐదు రోజులకు మించి పెండింగ్లో ఉన్న దరఖాస్తులను ప్రత్యేకంగా పరిశీలించి, వాటి పరిష్కారానికి అవసరమైన చర్యలు చేపట్టాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు.నోటీసుల జారీ, విచారణ, దరఖాస్తుల పరిష్కారం వంటి ప్రతి ప్రక్రియను ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు అనుగుణంగా నిర్వహించాలని తెలిపారు. అక్టోబర్ 25 గడువును దృష్టిలో ఉంచుకుని ముందస్తు కార్యాచరణతో పనిచేయాలని, చివరి దశలో పనులు పేరుకుపోకుండా ప్రతిరోజూ పురోగతిని సమీక్షించాలని కలెక్టర్ సూచించారు. ఎస్ఐఆర్-2026 ప్రక్రియను పారదర్శకంగా, పకడ్బందీగా పూర్తి చేసేందుకు అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో అదనపు కలెక్టర్ రెవెన్యూ బి.ఎస్ .లత, ఆర్డీవోలు, మున్సిపల్ కమిషనర్ లు, ఎన్నికల అధికారులు, సంబంధిత ఎన్నికల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# కిరణ్ గౌడ్ ను సన్మానించిన గౌడ సంఘం నాయకులు

**మంథని సెప్టెంబర్21(మనం న్యూస్):** రాష్ట్రమంత్రి శ్రీధర్ బాబు,టీపీసీసీ ప్రధాన కార్యదర్శి శ్రీనుబాబుల ప్రియ శిష్యుడు,కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా రాష్ట్ర కార్యదర్శిగా ఆరెల్లి కిరణ్ గౌడ్ నియామకం పట్ల గౌడ సంఘం రాష్ట్ర కార్యదర్శి మాచిడి రవితేజ గౌడు,మంథని గౌడ సంఘం అధ్యక్షులు వీర శంకర్ గౌడ్,సంఘం కార్యవర్గ సభ్యులు సోమవారం కిరణ్ గౌడును శాలువలతో ఘనంగా సత్కరించి సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.నా నియమకం పట్ల శుభాకాంక్షలు తెలిపిన గౌడ సంఘం నాయకులకు పేరుపేరునా కృతజ్ఞతలు తెలుపుతున్నామని ఆరెల్లి కిరణ్ గౌడ్ పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో మంథని గౌడ సంఘం నాయకులు మాచిడి మోహన్ గౌడ్,చిన్నశంకర్ గౌడ్,కమ్మగోనిశంకర్ గౌడ్,మాచిడి సత్యనారాయణ గౌడ్,పోన్నంచంద్రయ్యగౌడు, పొన్నమోహన్గౌ డ్,రవికుమార్ గౌడ్, శ్రీనివాస్ గౌడ్,తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా ఫిర్యాదులను పరిశీలించిన ఎస్పీ

**బాధితులకు సత్వర న్యాయం జరిగేలా చూడాలని అధికారులకు ఆదేశం**



**జగిత్యాల సెప్టెంబర్ 21(మనం ప్రతినిధి):** ప్రతి సోమవారం ప్రజల సౌకర్యార్థం నిర్వహించే గ్రీవెన్స్ డే లో బాగంగా ఈ రోజు జిల్లా పోలీసు కార్యాలయంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన 12 మంది అర్జీదారులతో నేరుగా మాట్లాడి వారి సమస్యలను తెలుసుకొని సంబంధిత అధికారులతో ఫోన్ లో మాట్లాడి ఫిర్యాదులపై తక్షణ చర్యలు తీసుకొని బాధితులకు న్యాయం చేయాలని ఎస్పీ ఆదేశించారు. ప్రజలకు పోలీస్ శాఖను మరింత చేరువ చేయడం లక్ష్యంగా ప్రజా సమస్యలను పరిష్కరించే విధంగా కృషి చేస్తున్నామని అన్నారు. పోలీస్ స్టేషన్ కి వచ్చిన ఫిర్యాదుదారులతో మర్యాదగా మాట్లాడి వినతులు స్వీకరించి సంబంధిత ఫిర్యాదులపై క్షేత్ర స్థాయిలో పరిశీలించి వేగంగా స్పందించి బాధితులకు న్యాయం జరిగే విధంగా చూడడం జరుగుతోందని తెలిపారు.

# సెర్ప్ కార్యక్రమాలను విజయవంతం కోసం కృషి చేయాలి

**జిల్లా గ్రామీణభివృద్ధి శాఖ అధికారి యం. రఘువరణ్**



**జగిత్యాల సెప్టెంబర్ 21 (మనం న్యూస్):** సెర్ప్ కార్యక్రమాల విజయవంతం కోసం జిల్లా మహిళ సమాఖ్య కృషి చేయాలనీ జిల్లా గ్రామీణభివృద్ధి శాఖ అధికారి యం. రఘువరణ్ అన్నారు., జిల్లా కార్యాలయం లో నూతనంగా ఎన్నుకోబడిన జిల్లా సమాఖ్య కార్యవర్గ సభ్యులు జిల్లా డి. ఆర్. డి. ఓ ని, అదనపు డిఆర్డీఓ సునీత లను అధ్యక్షురాలు యన్. ఆమనీ, కార్యదర్శి రజిత, కోశాధికారి వి. రూప కళ వారిని మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్బంగా అయన మాట్లాడుతు జిల్లాలో 18 మండల సమాఖ్య లు, 565 గ్రామ సమాఖ్య లు, 15466 స్వశక్తి సంఘాలు, 180234 మంది సభ్యులు ఉన్నారని, ప్రభుత్వం ద్వారా ఆర్థిక స్వావలంబన కోసం వడ్డీ లేని రుణాలు ఇవ్వడం, వివిధ రకాల ఆదాయభివృద్ధి కార్యక్రమాలు అమలు చేయడం, మార్కెటింగ్ కార్యక్రమాలు, ఫామ్, నాన్ ఫామ్ కార్యక్రమాలు, ఇంకా పలు రకాల కార్యక్రమాలు అమలు చేయడం, వీటిని మహిళా సంఘాల సభ్యులకు అందేలా చేయాల్సిన బాధ్యత సెర్ప్ సిబ్బంది తో పాటు జిల్లా సమాఖ్య కూడా కృషి చేయాలనీ అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు ప్రాజెక్టు డైరెక్టర్ పి. సునీత, డిపియాలు రమేష్,నారాయణ,నాగేశ్వర్ రావు,ఎపియం వి. గంగాధర్, త్రివేణి, హుస్సేన్, శ్రీనివాస్, సీసీ లు సత్యం, రాజు, జిల్లా సమాఖ్య సిబ్బంది భాగ్య, కిరణ్ తదితరులు ఉన్నారు.

# ప్రభుత్వ క్వార్టర్లను ప్రజావసరాలకు వినియోగించాలి

**జగిత్యాల, సెప్టెంబర్ 21(మనం న్యూస్):** జగిత్యాల పట్టణంలోని శ్రీరామ థియేటర్ ఎదురుసందు నుంచి టీవీ స్టేషన్ వరకు వెళ్లే మార్గంలో శిథిలావస్థకు చేరుకున్న ప్రభుత్వ, మున్సిపల్ క్వార్టర్ల సమస్యను పరిష్కరించాలని కోరుతూ కౌన్సిలర్ అరవ లక్ష్మి, అఇఖి రాజు ప్రజావాణిలో జిల్లా కలెక్టర్కు వినతిపత్రం సమర్పించారు.



చాలా కాలంగా వినియోగంలో లేకపోవడంతో మున్సిపల్ కమిషనర్, మున్సిపల్ డీఈ తదితర క్వార్టర్లు పూర్తిగా శిథిలావస్థకు చేరుకున్నాయని, భవనాలు ప్రమాదకరంగా మారడంతో పాటు పరిసర ప్రాంతాలు అపరిశుభ్రంగా మారుతున్నాయని వారు తెలిపారు. రాత్రి వేళల్లో ఈ ప్రాంతం అసాంఘిక కార్యకలాపాలకు కేంద్రంగా మారే అవకాశం ఉండటంతో స్థానిక ప్రజలు, ముఖ్యంగా మహిళలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు.

అలాగే రైతుబజార్లో పెద్ద ఎత్తున కూరగాయల వ్యాపారం నిర్వహించే దళారుల బండ్లు రాత్రి వేళల్లో నివాస ప్రాంతాల గుండా రావడం వల్ల స్థానిక ప్రజలకు ఇబ్బందులు కలుగుతున్నాయని తెలిపారు. ప్రజలకు ఇబ్బంది కలగకుండా కూరగాయల వ్యాపారాన్ని బీట్ బజార్లోని ఇంటిగ్రేటెడ్ మార్కెట్కు తరలించేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

గతంలో రైతుబజార్ కోసం మున్సిపల్ నుంచి 32 గుంటల స్థలం తీసుకున్న నేపథ్యంలో, దరూర్ క్యాంప్ ప్రాంతంలో మున్సిపాలిటీకి కేటాయిస్తామని మార్కెటింగ్ శాఖ అధికారులు తెలిపిన 5 ఎకరాల స్థలాన్ని ఇప్పటికైనా కేటాయించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. శిథిలమైన క్వార్టర్లను సంబంధిత అధికారులు తక్షణమే పరిశీలించి, అవసరమైన భద్రతా చర్యలు చేపట్టి, సాధ్యమైన చోట వాటిని ప్రజోపయోగ కార్యక్రమాలకు వినియోగంలోకి తీసుకురావాలని కౌన్సిలర్ అరవ లక్ష్మి, అఇఖి రాజు జిల్లా కలెక్టర్ను కోరారు.



# నిమజ్జన ట్రాఫిక్ నియంత్రణలో ట్రాన్స్‌జెండర్ల భాగస్వామ్యం

- **జిల్లా ఎస్పీ అశోక్ కుమార్**

**జగిత్యాల సెప్టెంబర్ 21 (మనం ప్రతినిధి):** గణేశ్ నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని జగిత్యాల జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నిమజ్జనోత్సవ బందోబస్తులో ట్రాన్స్జెండర్లను భాగస్వామ్యం చేస్తూ ట్రాఫిక్ నియంత్రణ విధులు నిర్వహించే అవకాశం కల్పిస్తున్నట్లు జిల్లా ఎస్పీ అశోక్ కుమార్, తెలిపారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో ట్రాన్స్జెండర్లతో సమావేశం నిర్వహించిన ఎస్పీ గణేశ్ నిమజ్జనోత్సవ బందోబస్తులో ట్రాఫిక్ నియంత్రణ విధులు నిర్వహించనున్న 17 మంది ట్రాన్స్జెండర్లకు టీ-షర్టను అందజేశారు. అనంతరం వారికి విధుల నిర్వహణకు సంబంధించిన పలు సూచనలు, మార్గదర్శకాలను అందించారు.

# అంగన్వాడి మానిటరింగ్ కమిటీల ఏర్పాటు




**జగిత్యాల సెప్టెంబర్ 21 (మనం న్యూస్):** ఐసిడిఎస్ ప్రాజెక్టు జగిత్యాల 12వ వార్డు కౌన్సిలర్ బోయినపల్లి ప్రశాంత్ రావు ఆధ్వర్యంలో పోషణ మాసం సందర్భంగా ఈరోజు అంగన్వాడీ కేంద్రాలలో అంగన్వాడి మానిటరింగ్ కమిటీ ఏర్పాటు చేయనైనది దీనిలో ముఖ్యంగా పోషకాహారం ,విద్య, ఆరోగ్యము ,ఆరోగ్యమైన పిల్లలు, బలమైన సమాజం నిర్వహించాల్సిన కార్యకలాపాలు ప్రతి అంగన్వాడీ కేంద్రంలో అంగన్వాడి మానిటరింగ్ కమిటీ ఏర్పాటు చేయడము జరిగినది మూడు నుంచి ఆరు సంవత్సరాల పిల్లల తల్లులను భాగస్వాములను చేయడము ఆశా కార్యకర్త మరియు అంగన్వాడికి సమీపంలో ఉన్న పాఠశాల మహిళ ఉద్యోగి భాగస్వామ్యం చేయడము ఈ అంగన్వాడి మానిటరింగ్ కమిటీలు చర్చించిన అంశములు పిల్లల పోషణ ,మరియు ఆహారపు అలవాట్లు, ఆరోగ్య పరీక్షలు ,ఎదుగుదల,పెరుగుదల పర్యవేక్షణ పూర్వ ప్రాథమిక విద్యా, కార్యక్రమాలు పిల్లల హాజరు శాతం పెంచడం పరిసరాలు పరిశుభ్రత సమాజంలో భాగస్వామ్యం చేయడము ఈ కమిటీలో సూపర్వైజర్ చైర్ పర్సన్ అంగన్వాడీ టీచర్ కన్వీనర్ మరియు మెంబరు ఆశ వర్కర్, మూడు నుంచి ఆరు సంవత్సరాల పిల్లల తల్లులు ఇద్దరు,ఆర్ పి, ప్రైమరీ స్కూల్ టీచర్ మహిళ మెంబర్స్ గా కమిటీని ఏర్పాటు చేయడము జరిగినది ఈ కమిటీ రెండు నెలలకు ఒకసారి సమావేశము నిర్వహించి అంగన్వాడీ కేంద్రంలో జరిగే కార్యకలాల పై పూర్వ ప్రాథమిక ,ఆరోగ్య పరీక్షలు ,ఇమ్మునైజేషన్, బరువు ఎత్తు, పోషకాహారము,పిల్లల హాజరు శాతం తదితర అంశాలపై చర్చించి తీర్మానించుకోవడం జరుగుతుంది 12వ వార్డు కౌన్సిలర్ బోయినపల్లి ప్రశాంత్ రావు గారు మాట్లాడుతూ అంగన్వాడీలో ఇచ్చే బాలామృతం పిల్లలకు తినిపించాలని పూర్వ ప్రాథమిక విద్య పోషకాహారము ఆరోగ్యము బరువులు ఎత్తులు చూపించుకోవాలని ఆరోగ్యవంతమైన సమాజాన్ని ఏర్పాటు చేయవలసిందిగా తల్లులకు అవగాహన కలిగించడం జరిగినది ఈ కార్యక్రమంలో శ్రీమంతాలు అన్న ప్రసన్న నిర్వహించడం జరిగినది ఈ కార్యక్రమానికి 12 వ వార్డు కౌన్సిలర్ బోయినపల్లి ప్రశాంత్ రావు గారు సూపర్వైజర్స్ మమత, స్వరూపరాణి , ఆర్పీలు అర్చన, ఆశ వర్కర్ అంజలి అంగన్వాడీ టీచర్స్ శ్యామల ,సుజాత గర్భవతులు బాలింతలు పిల్లలు తల్లులు పాల్గొన్నారు.

# వయో వృద్ధుల చట్టం పై అవగాహన సదస్సు

**జగిత్యాల, సెప్టెంబర్ 21(మనం న్యూస్):** తెలంగాణ ఆల్ సీనియర్ సిటిజెన్స్ అసోసియేషన్ జగిత్యాల జిల్లా శాఖ ఆధ్వర్యంలో వయో వృద్ధుల పోషణ, రక్షణ సంక్షేమ చట్టం పై జిల్లా, డివిజన్, మండలాల, గ్రామాల వివిధ సంఘాల ప్రతినిధులకు జిల్లా అధ్యక్షులు హరి అశోక్ కుమార్ అవగాహన కల్పించారు.

సోమవారం టాస్క జిల్లా సమావేశ మందిరం లో జరిగిన ఈ సదస్సులో హరి అశోక్ కుమార్ మాట్లాడుతూ 2016 లో రిటైర్డ్ రాష్ట్ర స్థాయి ఉన్నత అధికారి పి. నర్సింహా రావు రాష్ట్ర అధ్యక్షులుగా అప్పటి ముఖ్య మంత్రి కే సీ ఆర్ చేతులమీదుగా ప్రారంభం అయిన తెలంగాణ అల్ సీనియర్ సిటిజెన్స్ అసోసియేషన్ 10 ఏళ్లుగా 33 జిల్లాల్లో నిరాధరణ గురైన వృద్ధ తల్లి దండ్రుల కేసుల పరిష్కారం కు కృషి చేస్తున్నామన్నారు. వచ్చే డిసెంబర్ 11 న దశాబ్ది ఉ త్సవాలకు ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి ముఖ్య అతిథి గా, ప్రత్యేక అతిథి గా మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ లు హాజరు కానున్నారని పేర్కొన్నారు. అనేక సందర్భా ల్లో వృద్ధ తల్లి దండ్రుల కొడుకులకు, కోడళ్ళకు కౌన్సిలింగ్ ఇస్తూ వారి కేసులు పరిష్కరిస్తున్నామన్నారు. వారు వినని పక్షం లో ఆర్డీఓలకు ఫిర్యాదులు చేయించి ఆసరాగా ఉంటున్నామన్నారు కలెక్టర్ యాస్మిన్ భాషా అనుమతితో రూ. 6 లక్షల వ్యయంతో ఎమ్మెల్యే సంజయ్ కుమార్ సహకారం తో నిర్మించుకున్న తమ కార్యాలయం ను అర్బన్ తహసీల్దార్ బలవంతంగా స్వాదీనం చేసుకున్న విషయం లో తమ ఫర్నిచర్ ఇంకా ఇవ్వకు పోవడం పై జిల్లా, డివిజన్ మండల, గ్రామాల సీనియర్ సిటిజెన్స్ సంఘాల నాయకులు ఆందోళన వ్యక్తం చేశారు.

తమ వృద్ధుల జనాభ యువత కంటే చాలా ఎక్కువుందని, రాష్ట్రములో వృద్ధుల సమస్యల పరిష్కారం కోసం సీనియర్ సిటిజెన్స్ కమిషన్ ఏర్పాటుకు బొద్దింకల స్ఫూర్తితో తాబేలు ఉద్యమం చేపడుతామని వెల్లడించారు. ఈ సదస్సులో రాష్ట్ర ఉపాధ్యక్షులు పి. హన్మంత్ రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి మాజీ మున్సిపల్ చైర్మన్ జీ ఆర్ దేశాయ్, జిల్లా కార్యదర్శి గౌరి శెట్టి విశ్వనాథం, ఉపాధ్యక్షులు బొల్లం విజయ్, పూసాల అశోక్ రావు, ఎం.డి.యాకూబ్, కోశాధికారి వెల్ముల ప్రకాష్ రావు, కోరుట్ల అధ్యక్షులు పబ్బా శివానందం, మెట్ పల్లి అధ్యక్షులు వొజ్జల బుచ్చి రెడ్డి, ధర్మపురి అధ్యక్షులు కండ్ల గంగాధర్, రాయికల్ అధ్యక్షులు ఏనుగంటి రాములు, జగిత్యాల పట్టణ అధ్యక్షులు మానాల కిషన్, మహిళా కార్యదర్శులు రాద, కరుణ, విజయలక్ష్మి, మహిళా జేఏసీ జిల్లా అధ్యక్షురాలు జలజ, యువజన సంఘాల జేఏ సీ ఉమ్మడి జిల్లా అధ్యక్షులు దొనూరి భూమా చారి తదితరులు పాల్గొన్నారు.



# సూర్యప్రభపై.. అనంత తేజోమూర్తిగా విహారం..!

- **సూర్యకిరణాలు తాకగానే ప్రత్యేక హారతులు..**
- **గోవింద నామస్మరణతో మార్మోగిన పుర వీధులు**

**తిరుపతి రూరల్ సెప్టెంబరు 21 మనం న్యూస్:** సూర్యకిరణాల వెలుగులో స్వామివారి దివ్యమంగళ రూపం మరింత తేజోవంతమైంది. తుమ్మల గుంటలోని శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామివారి బ్రహ్మోత్సవాల్లో ఏడవ రోజైన సోమవారం ఉదయం సూర్యప్రభ వాహనంపై అనంత తేజోమయునిగా శ్రీ కల్యాణ వేంకటేశ్వరుడు భక్తులను కటాక్షించారు. ఉదయం 7 గంటల నుంచి పుర వీధుల్లో సాగిన సూర్యప్రభ హనసేవలో భక్తులు పాల్గొని గోవింద నామస్మరణ చేయడంతో ఆధ్యాత్మిక సందడి చేశారు. సరిగ్గా ఉదయం 6.45 గంటలకు సూర్యకిరణాలు స్వామివారిని వాహనాన్ని తాకడంతో ఆలయ అర్చకులు ప్రత్యేక హారతులు సమర్పించారు. ఈ దృశ్యాన్ని తిలకించిన భక్తులు భక్తిపారవశ్యంతో గోవింద నామస్మరణ చేశారు. వాహనసేవకు ముందు అశ్వాలు, వృషభాలు ఠీవిగా నడవగా.. భక్త బృందాలు చెక్కభజనలు, కోలాటాలతో స్వామివారిని కీర్తించారు. మంగళ వాయిద్యాల నడుమ సూర్యప్రభ వాహనసేవ కోలాహలంగా సాగింది. భక్తులు అడుగడుగునా కర్పూర హారతులు సమర్పిస్తూ స్వామివారిని దర్శించుకున్నారు.



**చంద్రప్రభపై చల్లనయ్యగా...**

ఆదివారం రాత్రి చంద్రప్రభ వాహనంపై శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామి చల్లనయ్యగా దర్శనమిచ్చారు. చంద్రునిపై కొలువుదీరిన ఆది నారాయణుడిని దర్శించుకునేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. చంద్రుని అమృత కిరణాల వలె స్వామి వారి కరుణాకటాక్షాలు భక్తులకు ప్రసరిస్తాయని భక్తుల విశ్వాసం. సూర్యప్రభ వాహన సేవకు చంద్రగిరి మండలంలోని చంద్రగిరి, రెడ్డివారిపల్లి, నరసింగాపురం, రాయలపురంకు చెందిన భక్తులు సారె సమర్పించారు. అలాగే గాంధీపురంకు చెందిన భక్తులు సారె తీసుకుని రాగా చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి సాదర స్వాగతం పలికారు. చంద్రప్రభ వాహన సేవకు రామచంద్రాపురం మండలం నెన్నూరు, నడవలూరు, సొరకాయల పాలెం, దేసూరికండ్రిగ,

# పటాన్‌చెరు ప్రజావాణికి స్పందన కరువు





- సమస్యలు అనేకం..దరఖాస్తులు స్వల్పం!
- ఐదు వారాల్లో 25 ఫిర్యాదులే.. సోమవారం కేవలం 3 అప్లికేషన్లు
- ప్రజావాణి ఉంది.. ప్రజలకు సమాచారం ఉందా?
- జిల్లా కేంద్రం ప్రజావాణికి వెళ్తున్న పటాన్చెరు ప్రజలు

**పటాన్‌చెరు, సెప్టెంబర్ 21 (మనం న్యూస్):** ప్రజల సమస్యలను నేరుగా అధికారుల దృష్టికి తీసుకెళ్లి, వాటి పరిష్కారానికి మార్గం చూపించేందుకు ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమానికి పటాన్చెరు మండలంలో ఆశించిన స్థాయిలో స్పందన కనిపించడం లేదు. పటాన్చెరు మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ప్రతి సోమవారం నిర్వహిస్తున్న మండలస్థాయి ప్రజావాణి కార్యక్రమం సోమవారం నాటికి ఆరో వారానికి చేరుకుంది. అయితే వినాయక చవితి సందర్భంగా సెలవు కారణంగా ఒక వారం కార్యక్రమం నిర్వహించ లేదు. ఇప్పటివరకు జరిగిన ఐదు వారాల్లో మొత్తం 25 దరఖాస్తులు మాత్రమే అందాయి.

తాజాగా సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమం మరింత వెలవెలబోయింది. దాదాపు ప్రధాన శాఖలకు చెందిన అధికారులు హాజరైనప్పటికీ.. ఫిర్యాదులు అందజేసేందుకు ప్రజలు పెద్దగా రాలేదు. దీంతో కేవలం మూడు దరఖాస్తులు మాత్రమే అధికారులకు అందాయి. ఈ మూడు దరఖాస్తులు కూడా రెవెన్యూ శాఖకు సంబంధించినవేనని ఎంపీడీవో యాదగిరి తెలిపారు.

**సమస్యలు అనేకం.. దరఖాస్తులు మాత్రం స్వల్పం..**

పటాన్చెరు మండలం మూడు గ్రామ పంచాయతీలు, రెండు మున్సిపాలిటీల పరిధితో పాటు పెద్ద పారిశ్రామిక ప్రాంతాన్ని కలిగి ఉంది. దీంతో రెవెన్యూ, భూసంబంధిత అంశాలు, రహదారులు, డ్రైనేజీ, తాగునీరు, పారిశుద్ధ్యం, విద్యుత్, పారిశ్రామిక సమస్యలు తదితర అనేక ప్రజా సమస్యలు ఉన్నాయి. ఇలాంటి ప్రాంతంలో ప్రతి వారం ప్రజావాణికి పెద్ద సంఖ్యలో ఫిర్యాదులు రావాల్సి ఉండగా.. ఐదు వారాల్లో 25 దరఖాస్తులు మాత్రమే రావడం చర్చనీయాంశంగా మారింది. తాజా కార్యక్రమంలో మూడు దరఖాస్తులకే పరిమితం కావడంతో ప్రజావాణిపై ప్రజలకు సరైన అవగాహన ఉందా? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

**జిల్లా కేంద్రం ప్రజావాణికి వెళ్తున్న ప్రజలు..**

పటాన్చెరు ప్రాంతానికి చెందిన కొందరు ప్రజలు తమ సమస్యలను స్థానిక మండలస్థాయి ప్రజావాణిలో కాకుండా సంగారెడ్డి జిల్లా కేంద్రంలో నిర్వహించే ప్రజావాణిలో అందజేస్తున్నట్లు తెలుస్తోంది. జిల్లా స్థాయిలో తమ సమస్యలకు పరిష్కారం లభిస్తుందనే ఉద్దేశంతో కొందరు నేరుగా సంగారెడ్డి జిల్లా కేంద్రానికి వెళ్తున్నట్లు సమాచారం. దీంతో మండల కేంద్రంలో ప్రతి సోమవారం ప్రజావాణి నిర్వహిస్తున్నప్పటికీ.. స్థానికంగా ఫిర్యాదులు తక్కువగా ఉండటానికి జిల్లా కేంద్రం ప్రజావాణికి ప్రజలు వెళ్లడం కూడా ఒక కారణమా? అనే చర్చ జరుగుతోంది. మండలస్థాయిలోనే సంబంధిత అధికారులు అందుబాటులో ఉన్న విషయాన్ని ప్రజలకు మరింత విస్తృతంగా తెలియజేయాల్సిన అవసరం ఉందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు.

**ప్రచారం లోపించిందా?..**

ప్రజావాణికి స్పందన తగ్గడానికి ప్రధాన కారణం ఏమిటన్నది చర్చనీయాంశంగా మారింది. కార్యక్రమంపై సరైన ప్రచారం లేకపోవడం వల్ల ప్రజలకు సమాచారం చేరడం లేదా? లేక గతంలో అందించిన ఫిర్యాదుల పరిష్కారంలో జాప్యం కారణంగా ప్రజల్లో ఆసక్తి తగ్గిందా? అనే ప్రశ్నలు వినిపిస్తున్నాయి. ముఖ్యంగా ప్రతి సోమవారం ప్రజావాణి నిర్వహిస్తున్న విషయాన్ని గ్రామాలు, కాలనీలు, మున్సిపాలిటీలు, పారిశ్రామిక ప్రాంతాల్లో విస్తృతంగా ప్రచారం చేస్తే ప్రజలకు కార్యక్రమంపై స్పష్టత వచ్చే అవకాశం ఉంది. ప్రజావాణి తేదీ, సమయం, వేదికతో పాటు ఏ సమస్యలపై ఫిర్యాదు చేయవచ్చు, దరఖాస్తుతో ఏ పత్రాలు తీసుకురావాలి వంటి వివరాలను కూడా ప్రజలకు తెలియజేయాల్సిన అవసరం ఉంది.

**ఫిర్యాదుల పరిష్కారంపై నమ్మకం కల్పించాలి..**

ప్రజావాణికి ప్రజలు రావాలంటే తమ సమస్యను అధికారులకు అందజేసిన తర్వాత దానిపై చర్యలు జరుగుతాయన్న నమ్మకం కూడా అవసరం. అందిన ఫిర్యాదులను సంబంధిత శాఖలకు పంపడంతో పాటు వాటి పురోగతిని పర్యవేక్షించి, పరిష్కారంపై ఫిర్యాదుదారులకు సమాచారం అందిస్తే ప్రజల్లో విశ్వాసం పెరిగే అవకాశం ఉంది.

**ఇప్పటికైనా ఉన్నతాధికారులు దృష్టి సారించాలి..**

పటాన్చెరు వంటి పెద్ద పారిశ్రామిక మండలంలో ప్రజా సమస్యలను పరిష్కరించేందుకు అందుబాటులో ఉన్న ప్రజావాణి కార్యక్రమానికి ఆశించిన స్థాయిలో స్పందన లేకపోవడంపై ఉన్నతాధికారులు దృష్టి సారించాల్సిన అవసరం ఉంది. మండలస్థాయి ప్రజావాణిపై విస్తృత ప్రచారం నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించడంతో పాటు.. ప్రజలు తమ సమస్యలను స్థానికంగానే అధికారుల దృష్టికి తీసుకువచ్చేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

# దరఖాస్తుదారులు లేక వెలవెలబోయిన ప్రజావాణి

- ప్రజావాణిపై ప్రజలకు అవగాహన కల్పించాలి

**కన్నాయిగూడెం, సెప్టెంబరు 21 (మనం న్యూస్):** కన్నాయిగూడెం మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమం దరఖాస్తుదారులు లేక వెలవెలబోయింది. ప్రజల సమస్యలను స్వీకరించి పరిష్కరించేందుకు నిర్వహించిన ఈ కార్యక్రమానికి ఎంపీడీవో



రామకృష్ణతో పాటు వివిధ శాఖల అధికారులు హాజరయ్యారు.

అయితే కార్యక్రమం ప్రారంభం నుంచి ముగిసే వరకు ఒక్క దరఖాస్తుదారుడు కూడా హాజరుకాకపోవడంతో అధికారులు ప్రజావాణి కార్యక్రమాన్ని ముగించారు. ప్రజావాణి నిర్వహణపై ముందుగానే సమాచారం అందించినప్పటికీ ప్రజలు హాజరుకాకపోవడం గమనార్హం.

ప్రజల సమస్యలను నేరుగా అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు ప్రభుత్వం ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది.

అయితే ప్రజావాణి కార్యక్రమం గురించి ప్రజలకు మరింత అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని పలువురు అభిప్రాయపడుతున్నారు. గ్రామాల్లో అధికారులు, సిబ్బంది ప్రజావాణి నిర్వహించే తేదీ, సమయం, కార్యక్రమం ఉద్దేశం తదితర వివరాలను ప్రజలకు ముందుగానే తెలియజేస్తే ఎక్కువ మంది తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లే అవకాశం ఉంటుంది.

ప్రజా సమస్యల పరిష్కారానికి వేదికగా ఉన్న ప్రజావాణిని సద్వినియోగం చేసుకునేలా అధికారులు గ్రామస్థాయిలో విస్తృతంగా అవగాహన కల్పించాలని ప్రజలు కోరుతున్నారు.

# జగ్గారెడ్డిని కలిసిన నూతన డీసీసీ అధ్యక్షుడు

**సంగారెడ్డి సెప్టెంబర్ 21 మనం న్యూస్ ప్రతినిధి :** సంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ కమిటీ (డీసీసీ) నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన చంద్రశేఖర్ రెడ్డి, నారాయణఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డితో కలిసి టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డిని సంగారెడ్డి పట్టణంలోని రామ్నగర్ రామ్ మందిర్లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నూతన డీసీసీ అధ్యక్షుడు చంద్రశేఖర్ రెడ్డిని జగ్గారెడ్డి ఘనంగా సన్మానించి అభినందించారు.

ఈ సందర్భంగా జగ్గారెడ్డి మాట్లాడుతూ.. నిర్మలా జగ్గారెడ్డి డీసీసీ అధ్యక్షురాలిగా ఏడు సంవత్సరాలకు పైగా సుదీర్ఘకాలం పనిచేశారని తెలిపారు. ఆమె హయాంలో జిల్లా కేంద్రంలో ఏ విధంగా పార్టీ కార్యక్రమాలను నిర్వహించామో, అంతకంటే ఎక్కువగా చంద్రశేఖర్ రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీ కార్యక్రమాలను నిర్వహిస్తామని చెప్పారు. చంద్రశేఖర్ రెడ్డికి తన పూర్తి సహాయ సహకారాలు అందిస్తానని తెలిపారు. సోనియాగాంధీ, రాహుల్ గాంధీ, మల్లికార్జున ఖర్గే, పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ ఆదేశాలకు అనుగుణంగా పార్టీ అభివృద్ధి కోసం కృషి చేయాలని జగ్గారెడ్డి సూచించారు. జిల్లాలో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేసేందుకు నాయకులు, కార్యకర్తలతో సమన్వయంతో ముందుకు సాగాలని అన్నారు.





**సహకరించిన నాయకులకు కృతజ్ఞతలు: చంద్రశేఖర్ రెడ్డి**

నూతన డీసీసీ అధ్యక్షుడు చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ.. తనను డీసీసీ అధ్యక్షుడిగా ఎంపిక చేయడంలో సహకరించిన మంత్రి దామోదర్ రాజనర్సింహ, ఇన్చార్జి మంత్రి వివేక్ వెంకటస్వామి, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డిలకు కృతజ్ఞతలు తెలిపారు.

నిర్మలా జగ్గారెడ్డి అడుగుజాడల్లో నడుస్తూ, ఆమె మాదిరిగానే అందరితో సమన్వయం చేసుకుంటూ పార్టీ కోసం పనిచేస్తానని చెప్పారు. జిల్లాలో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు.

**అధిష్టానానికి కృతజ్ఞతలు: ఎమ్మెల్యే సంజీవరెడ్డి**

నారాయణఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి మాట్లాడుతూ.. తన తమ్ముడు చంద్రశేఖర్ రెడ్డిపై నమ్మకంతో డీసీసీ అధ్యక్షుడిగా నియమించిన ఏఐసీసీ అధిష్టానానికి కృతజ్ఞతలు తెలిపారు. అలాగే చంద్రశేఖర్ రెడ్డి ఎంపికకు సహకరించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి దామోదర్ రాజనర్సింహ, జగ్గారెడ్డిలకు ధన్యవాదాలు తెలిపారు. జిల్లా కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి అందరి సహకారంతో ముందుకు సాగుతామని పేర్కొన్నారు.

# తాడ్వాయి రోడ్లకు భారీ నిధులు!

- సీసీ రోడ్ల నిర్మాణానికి రూ.5.60 కోట్లు మంజూరు..
- ప్రభుత్వానికి కాంగ్రెస్ నేతల కృతజ్ఞతలు



**తాడ్వాయి, సెప్టెంబర్ 21, మనం ప్రతినిధి:** గ్రామాల్లో రహదారి కష్టాలకు తెరపడనుంది. తాడ్వాయి మండల వ్యాప్తంగా సీసీ రోడ్ల నిర్మాణానికి రూ.5.60 కోట్ల నిధులు మంజూరయ్యాయని మండల కాంగ్రెస్ నాయకులు తెలిపారు. నిధుల మంజూరుతో గ్రామాల్లో మౌలిక వసతులు మెరుగుపడనున్నాయని పేర్కొన్నారు. మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయం వద్ద సోమవారం నిర్వహించిన మీడియా సమావేశంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు మంకిడి నరసింహస్వామి, మాజీ అధ్యక్షుడు బొల్లు దేవేందర్ ముదిరాజ్ మాట్లాడారు. మండలంలోని వివిధ గ్రామాల్లో సీసీ రోడ్ల నిర్మాణానికి రూ.5,60,00,000 నిధులు మంజూరు చేసినందుకు ముఖ్యమంత్రి రేవంత్రెడ్డి, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్కకు కృతజ్ఞతలు తెలిపారు.

మట్టి రోడ్లకు చెక్.. సీసీ రోడ్లతో సౌకర్యంమండలంలోని గ్రామాల్లో అంతర్గత రహదారుల సమస్యలను పరిష్కరించేందుకు సీసీ రోడ్ల నిర్మాణం చేపట్టడం కీలకమని నాయకులు పేర్కొన్నారు. ముఖ్యంగా వర్షాకాలంలో మట్టి, గుంతల రోడ్ల కారణంగా ప్రజలు, వాహనదారులు ఎదుర్కొంటున్న ఇబ్బందులు తగ్గనున్నాయని తెలిపారు. మంజూరైన నిధులతో అవసరమైన ప్రాంతాల్లో సీసీ రోడ్ల నిర్మాణ పనులు చేపట్టనున్నట్లు వెల్లడించారు.గ్రామాల అభివృద్ధికి ప్రాధాన్యంప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనతో పాటు గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని కాంగ్రెస్ నాయకులు అన్నారు. రహదారులు మెరుగుపడితే ప్రజల రాకపోకలు సులభతరం కావడంతో పాటు గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి కూడా దోహదపడుతుందని పేర్కొన్నారు.

తాడ్వాయి మండలానికి రూ.5.60 కోట్ల నిధులు మంజూరు కావడం పట్ల వారు హర్షం వ్యక్తం చేశారు.నాయకుల కృతజ్ఞతలుమంత్రి సీతక్క ప్రత్యేక చొరవతో మండలంలోని గ్రామాలకు అభివృద్ధి నిధులు అందుతున్నాయని కాంగ్రెస్ నాయకులు తెలిపారు. గ్రామాల సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం దృష్టి సారిస్తోందని పేర్కొంటూ ముఖ్యమంత్రి రేవంత్రెడ్డి, మంత్రి సీతక్కకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ సమావేశంలో అంకంపల్లి సర్పంచ్ ఇర్ప వెంకటేశ్వర్లు, బయ్యక్కపేట సర్పంచ్ సూరకంటి సమ్మక్క-గోవర్ధన్, పంబాపూర్ సర్పంచ్ ముక్తి శ్రీనివాస్, మహిళా కాంగ్రెస్ మండల అధ్యక్షురాలు గొంది సరిత, ఆత్మ కమిటీ డైరెక్టర్ మర్రి నరేష్, మండల నాయకులు ఆలం సాంబశివరావు, దాయ వెంకన్న, గజ్జెల సంపత్, పాయం కోటేశ్వరరావు, యూత్ కాంగ్రెస్ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ శనిగరపు చిరంజీవి, వార్డు సభ్యురాలు పాయం సుజాత తదితరులు పాల్గొన్నారు.

# కొండా లక్ష్మణ్ బాపూజీ వర్ధంతి సందర్భంగా ఘన నివాళులు

**ములుగు, సెప్టెంబర్ 21(మనంన్యూస్):** శ్రీ కొండా లక్ష్మణ్ తెలంగాణ ఉద్యాన విశ్వవిద్యాలయంలో తెలంగాణ ఉద్యమ స్ఫూర్తిదాత, స్వాతంత్ర్య సమరయోధుడు, మాజీ మంత్రి శ్రీ కొండా లక్ష్మణ్ బాపూజీ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఈ



సందర్భంగా విశ్వవిద్యాలయ గౌరవ ఉపకులపతి డా. దండ రాజిరెడ్డి బాపూజీ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.

ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమానికి గౌరవ ఉపకులపతి డా. దండ రాజిరెడ్డి అధ్యక్షత వహించి ప్రసంగించారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం కొండా లక్ష్మణ్ బాపూజీ చేసిన కృషి, ప్రజాసేవ, సామాజిక న్యాయం కోసం ఆయన సాగించిన పోరాటం చిరస్మరణీయమని పేర్కొన్నారు. తెలంగాణ ప్రజల హక్కులు, ఆత్మగౌరవం కోసం బాపూజీ చేసిన సేవలు నేటి తరానికి స్ఫూర్తిదాయకమని అన్నారు. ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళ్లేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ డా. ఏ. భగవాన్, డీన్ హార్టికల్చర్ మరియు డీన్ ఆఫ్ స్టూడెంట్స్ అఫైర్స్ ఒ. చీనా, పరిశోధనా విభాగం సంచాలకులు డాక్టర్ డి. లక్ష్మీనారాయణ, విస్తరణ విభాగం సంచాలకులు మరియు డీన్ ఆఫ్ పీజీ స్టడీస్ డాక్టర్ టి. సురేష్ కుమార్, ఆఫీసర్ ఇన్-చార్జ్ డా. సుచిత్ర , ప్రణాళిక మరియు పర్యవేక్షణ విభాగం డైరెక్టర్ డాక్టర్ డి. అనితా కుమారి, విద్యార్థులు, బోధన, బోధనేతర, అవుట్సోర్సింగ్ మరియు ఒప్పంద సిబ్బంది పాల్గొన్నారు.

# వినాయక నిమజ్జనానికి పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి

## జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు

**ములుగు, సెప్టెంబర్ 21, మనం ప్రతినిధి:** ఈ నెల 23న నిర్వహించనున్న వినాయక విగ్రహాల నిమజ్జనానికి పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం వినాయక విగ్రహాల నిమజ్జన ఏర్పాట్లపై అదనపు కలెక్టర్, ఆర్డీవో, జిల్లా అధికారులు, మండల ప్రత్యేక అధికారులు, తహసీల్దార్లు, ఎం పి డి ఓ లు, పోలీసు అధికారులతో జిల్లా కలెక్టర్ టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో వినాయక విగ్రహాల నిమజ్జనానికి గుర్తించిన ప్రాంతాలను అధికారులు ముందుగానే పరిశీలించాలని ఆదేశించారు. ఆయా ప్రాంతాల్లో నీటి లోతు, ప్రవాహ పరిస్థితులను అంచనా వేసి ప్రమాదాలకు ఆస్కారం లేకుండా రక్షణ చర్యలు చేపట్టాలన్నారు. బారికేడ్లు, విద్యుద్దీపాలు, తాగునీరు, పారిశుద్ధ్యం, వైద్య శిబిరాలు, అంబులెన్సులు, అగ్నిమాపక వాహనాలను అందుబాటులో ఉంచాలని సూచించారు.



నిమజ్జనానికి అవసరమైన క్రేన్లను ఏర్పాటు చేయడంతోపాటు గజ ఈతగాళ్లు, రక్షణ సిబ్బందిని సిద్ధంగా ఉంచాలన్నారు. నిమజ్జన ప్రాంతాల్లో సామర్థ్యానికి మించి ప్రజలు గుమిగూడకుండా నియంత్రణ చర్యలు చేపట్టాలని పోలీసు అధికారులను ఆదేశించారు. ఊరేగింపులు నిర్ణీత మార్గాల్లో, నిర్ణీత సమయాల్లో కొనసాగేలా ఉత్సవ కమిటీలకు ముందస్తు సూచనలు ఇవ్వాలన్నారు. నిమజ్జన కార్యక్రమం పూర్తయ్యే వరకు అధికారులు అప్రమత్తంగా ఉంటూ పరిస్థితులను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని కలెక్టర్ ఆదేశించారు. ఏదైనా సమస్య తలెత్తిన వెంటనే సంబంధిత శాఖ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి సత్వర పరిష్కారానికి చర్యలు చేపట్టాలని సూచించారు. విద్యుత్ తీగలు, స్తంభాల కారణంగా ప్రమాదాలు చోటుచేసుకోకుండా విద్యుత్ శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించాలని ఆదేశించారు. నిమజ్జనం పూర్తయ్యే వరకు రెప్పపాటు విద్యుత్ అంతరాయం లేకుండా నిరంతర విద్యుత్ సరఫరా ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. అత్యవసర పరిస్థితుల కోసం ప్రత్యామ్నాయ విద్యుత్ దీపాలను సిద్ధంగా ఉంచాలని సూచించారు. జలాశయాలు, చెరువులు, వాగుల వద్ద నీటి పరిస్థితులను నీటిపారుదల, మత్స్య శాఖల అధికారులు పరిశీలించాలని తెలిపారు. నిమజ్జనానికి అనువైన ప్రదేశాలను నిర్ధారించి అవసరమైన సూచిక బోర్డులను ఏర్పాటు చేయాలన్నారు. చిన్నారులు, వృద్ధులు నీటి ప్రదేశాల సమీపానికి వెళ్లకుండా ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ప్రతి నిమజ్జన ప్రాంతంలో వైద్య సిబ్బంది, అవసరమైన మందులు, ప్రథమ చికిత్స సామగ్రిని అందుబాటులో ఉంచాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులను ఆదేశించారు. అగ్నిమాపక సిబ్బంది అత్యవసర పరిస్థితులను ఎదుర్కొనేందుకు పూర్తి సంసిద్ధతతో ఉండాలన్నారు.

అన్ని మండలాల్లో మంగళవారం మండల ప్రత్యేక అధికారులు మండల స్థాయిలో సమావేశం ఏర్పాటు చేయాలన్నారు. అనంతరం నిమజ్జన ఏర్పాట్లను పర్యవేక్షించాలని కలెక్టర్ ఆదేశించారు. స్థానిక సర్పంచులు, ప్రజాప్రతినిధులను సమన్వయం చేసుకుంటూ వారి సహకారంతో ఏర్పాట్లు పూర్తి చేయాలని సూచించారు. మండల ప్రత్యేక అధికారులు, తహసీల్దార్లు, ఎంపిడిఓ తమ పరిధిలోని నిమజ్జన ప్రాంతాలను ప్రత్యక్షంగా పరిశీలించి ఏర్పాట్లను పర్యవేక్షించాలని సూచించారు. సంబంధిత శాఖల అధికారులు బాధ్యతాయుతంగా క్షేత్రస్థాయిలో ఎదురయ్యే సమస్యలను ముందుగానే గుర్తించి పరిష్కరించాలని, అత్యవసర సమస్యలను వెంటనే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలని ఆదేశించారు.

నిమజ్జనం పూర్తయిన వెంటనే వ్యర్థాలను తొలగించి పారిశుధ్య చర్యలు చేపట్టాలని పురపాలక, పంచాయతీ అధికారులను ఆదేశించారు. నిమజ్జన ప్రాంతాలు, ఊరేగింపు మార్గాల్లో ఎప్పటికప్పుడు పారిశుధ్య పనులు చేపట్టాలని సూచించారు. లోటుపాట్లకు తావులేకుండా రెవెన్యూ, పోలీసు, పురపాలక, పంచాయతీ, మత్స్య, గనులు, కార్మిక, వైద్య ఆరోగ్య, అగ్నిమాపక, భూగర్భ జల, రహదారులు భవనాలు, విద్యుత్, నీటిపారుదల శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో విధులు నిర్వర్తించాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ టెలికాన్ఫరెన్స్ లో అదనపు కలెక్టర్లు సిహెచ్ మహేందర్ జి, సంపత్రావు, ఆర్డీవో కృష్ణవేణి, ములుగు పురపాలక కమిషనర్, జిల్లా పౌర సంబంధాల అధికారి, జిల్లా మత్స్య శాఖ అధికారి, గనులు భూగర్భ శాస్త్ర శాఖ సహాయ సంచాలకుడు, సహాయ కార్మిక అధికారి, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి, డీఎస్పీ డీసీఆర్బీ, జిల్లా అగ్నిమాపక అధికారి, భూగర్భ జల శాఖ ఉప సంచాలకుడు, రహదారులు భవనాల శాఖ కార్యనిర్వాహక ఇంజినీర్, విద్యుత్ శాఖ పర్యవేక్షక ఇంజినీర్, జిల్లా పంచాయతీ అధికారి, జిల్లా నీటిపారుదల అధికారి, మండల ప్రత్యేక అధికారులు, తహసీల్దార్లు, పోలీస్ స్టేషన్ అధికారులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# లక్ష్మణ్ బాపూజీ సేవలు చిరస్మరణీయం

## రోటరీ క్లబ్ ఆఫ్ గజ్వేల్ అధ్యక్షుడు సాయి రెడ్డి

**ములుగు, సెప్టెంబర్ 21(మనంన్యూస్):** తెలంగాణ సాధనలో కొండా లక్ష్మణ్ బాపూజీ సేవలు చిరస్మరణీయమని రోటరీ క్లబ్ ఆఫ్ గజ్వేల్ అధ్యక్షుడు కొక్కొండ సాయి రెడ్డి అన్నారు. లక్ష్మణ్ బాపూజీ 14వ వర్ధంతి సందర్భంగా ములుగు మండలం వంటిమామిడి వద్ద ఆయన చిత్రపటానికి పూలమాలవేసి రోటరీ క్లబ్ సభ్యులు నివాళులర్పించారు. ఈ సందర్భంగా సాయి రెడ్డి మాట్లాడుతూ.. ప్రత్యేక



తెలంగాణ తొలి దశ, మలిదశ ఉద్యమాల్లో కీలకపాత్ర పోషించారని గుర్తు చేశారు. యువత ఆయన సేవలను పూర్తిగా తీసుకొని ఉన్నత చదువులు చదవాలని కోరారు. పెద్దలు చూపిన బాటలో నడుస్తూ ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో అంతర్జాతీయ రోటరీ 3150 జోనల్ చైర్మన్లు కర్ణాకర్ రెడ్డి, జగదీశ్వర్, క్లబ్ కార్యదర్శి బొల్లెపల్లి బాలకృష్ణ, కోశాధికారి నారెండ్ల కరుణాకర్ రెడ్డి, పూర్వ అధ్యక్షులు సందుగారి నరసింహ రెడ్డి, బాబు రెడ్డి, శ్రీనివాస్ గౌడ్ లు పాల్గొన్నారు.

# ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ ఆశయాలను పద్మశాలి లందరికీ ఆదర్శం

## బోల్లి బత్తిని దేవదాస్, ఎలగందుల రామచంద్రం

**గజ్వేల్, సెప్టెంబర్ 21(మనంన్యూస్):** సిద్దిపేట జిల్లా గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలోనీ ఆచార్య కొండ లక్ష్మణ్ బాపూజీ చౌరస్తా లో కొండ లక్ష్మణ్ బాపూజీ విగ్రహానికి కొండ లక్ష్మణ్ బాపూజీ వర్ధంతి సందర్భంగా పూలమాల అలంకరణ చేయడం జరిగింది. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి పద్మశాలి సంఘం అధ్యక్షులు బొల్లి బత్తుల దేవదాసు, చేనేత సహకార సంఘం కార్యదర్శి ఎలగందుల రామచంద్రం మాట్లాడుతూ తెలంగాణ జాతిపిత, తెలంగాణ కోసం నిరంతరం శ్రమించిన గొప్ప వ్యక్తి అని కొనియాడినారు. కొండా లక్ష్మణ్ బాపూజీ ఆశయాలు మనందరికీ ఆదర్శమని , పద్మశాలీల ఉన్నతికి అహర్నిశలు కృషి చేసిన గొప్ప మనసున్న మహారాజు అని, అతని అడుగు, జాడలలో మనం నడవవలసిన అవసరం ఉందని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ కాముని మురళి, అడ్వకేట్ కాళీ ప్రసాద్, చేనేత సహకార సంఘం అధ్యక్షులు స్వర్గం రాజేశం, పద్మశాలి సంఘం మాజీ అధ్యక్షులు,గాడి పల్లి శ్రీనివాస్, దేవులపల్లి రాజారాం తలకొక్కుల దుర్గాప్రసాద్, గాడి పల్లి విజయ్, రాచకొండ శ్రీనివాస్, ఉపాధ్యక్షులు పూల సత్యం, ఏడెల్లి రామచంద్రం, సిద్దిపేట జిల్లా పద్మశాలి ఉద్యోగుల ప్రధాన కార్యదర్శి దేవసాని వాసుదేవ్. దేవసాని పోశెట్టి, నల్ల శివకుమార్, భాస్కర్, పద్మశాలి కులస్తులు తదితరులు పాల్గొన్నారు.





# అక్టోబర్‌లోగా యాతాలకుంట టన్నెల్ పనులు పూర్తి కావాలి

## సత్తుపల్లి ట్రంక్‌కు గోదావరి జలాలు అందించడమే లక్ష్యం

పంటలను కాపాడేందుకు గోదావరి జలాల వినియోగం

రాష్ట్ర వ్యవసాయ శాఖా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

కమలాపురం పంపుహౌస్ నుండి అన్నదైవం ప్రాజెక్టుకు నీటి విడుదల

కుమ్మరిపాడులో హై లెవల్ బ్రిడ్జి, బీటీ రోడ్డు ప్రారంభం

**ములకలపల్లి, సెప్టెంబర్ 21(మనం న్యూస్):** సీతారామ ప్రాజెక్టు ద్వారా సత్తుపల్లి ట్రంక్కు గోదావరి జలాలను అందించి రైతులకు సాగునీటి భరోసా కల్పించేందుకు పనులను వేగవంతం చేస్తున్నామని రాష్ట్ర వ్యవసాయ, సహకార, మార్కెటింగ్, చేనేత శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. సత్తుపల్లి మండలం యాతాలకుంట వద్ద సీతారామ ప్రాజెక్టు టన్నెల్ పనులను మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, అశ్వారావుపేట శాసనసభ్యులు జారే ఆదినారాయణ, జిల్లా కలెక్టర్ అంకిత్తో కలిసి పరిశీలించారు. యాతాలకుంట టన్నెల్లో జరుగుతున్న పనులను పరిశీలించిన మంత్రి, టన్నెల్ నిర్మాణ పనుల పురోగతిపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. టన్నెల్ కింది భాగంలో ఉన్న ఖాళీలను కాంక్రీట్తో పటిష్టంగా నింపాలని, గ్రౌటింగ్, ప్యాకింగ్, కాంక్రీట్ పనులను సాంకేతిక ప్రమాణాలకు అనుగుణంగా పూర్తి చేయాలని సూచించారు. టన్నెల్ పనుల్లో నాణ్యత, భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, ఎలాంటి జాప్యానికి తావులేకుండా పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు. టన్నెల్‌కు సంబంధించిన మిగిలిన పనులను 25 రోజుల్లో పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటామని అధికారులు మంత్రికి వివరించారు. అక్టోబర్ నెలలో టన్నెల్ పనులను పూర్తి చేసి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా ప్రారంభించే విధంగా అవసరమైన చర్యలు చేపట్టాలని మంత్రి ఆదేశించారు. టన్నెల్ లైనింగ్, కెనాల్ లైనింగ్, రోడ్ క్రాసింగ్స్ తదితర మిగిలిన పనులను సమన్వయంతో వేగవంతం చేయాలని స్పష్టం చేశారు.

### హై లెవల్ బ్రిడ్జి, బీటీ రోడ్డును ప్రారంభించిన మంత్రి

ములకలపల్లి మండలం కుమ్మరిపాడు గ్రామంలో ఎస్టీఎస్డీఎఫ్ నిధులతో 4 కోట్ల 63 లక్షల అంచనా వ్యయంతో నిర్మించిన హై లెవల్ బ్రిడ్జి, బీటీ రోడ్డును మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సోమవారం ప్రారంభించారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు రాకపోకలు సులభతరం చేయడంతో పాటు అన్ని కాలాల్లో రవాణా సౌకర్యం అందుబాటులో ఉండేలా మౌలిక వసతులను అభివృద్ధి చేస్తున్నామని మంత్రి తెలిపారు.

### అన్నదైవం ప్రాజెక్టుకు నీటి విడుదల

ములకలపల్లి మండలం కమలాపురం గ్రామంలో సీతారామ ఎత్తిపోతల పథకంలోని మూడో పంపుహౌస్‌ను మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ఎమ్మెల్యే జారే ఆదినారాయణ, జిల్లా కలెక్టర్ అంకిత్ తో కలిసి పరిశీలించారు. మోటార్ను ఆన్ చేసి అన్నదైవం ప్రాజెక్టుకు నీటిని విడుదల చేశారు. పంపుహౌస్ నుంచి విడుదలైన నీటి ప్రవాహాన్ని పరిశీలించి, నీటి విడుదలకు సంబంధించిన వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. సాగు అవసరాలకు అనుగుణంగా నీటిని సమర్థవంతంగా వినియోగించేలా చర్యలు చేపట్టాలని సూచించారు.

### సీతారామ ద్వారా సత్తుపల్లికి గోదావరి జలాలు

మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ సీతారామ ప్రాజెక్టు ద్వారా సత్తుపల్లి ట్రంక్‌కు గోదావరి జలాలను అందించాలన్నది ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి లక్ష్యమని తెలిపారు. ఆ దిశగా ప్రాజెక్టు పనులను వేగవంతం చేస్తున్నామని చెప్పారు. యాతాలకుంట వద్ద టన్నెల్ పనులను పరిశీలించి, మిగిలిన పనులను నిర్ణీత గడువులో పూర్తి చేయాలని అధికారులకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చామని తెలిపారు.

టన్నెల్లో కొన్ని ప్రాంతాల్లో కింది భాగంలో ఖాళీలు ఉండటంతో వాటిని కాంక్రీట్తో పూర్తిస్థాయిలో ప్యాకింగ్ చేసి పటిష్టం చేయాల్సిన అవసరం ఉందన్నారు. అక్టోబర్లో సీతారామ ప్రాజెక్టు పనులను పూర్తి చేసి ముఖ్యమంత్రి చేతుల మీదుగా ప్రారంభించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు.

సత్తుపల్లి ట్రంక్కు నీటిని తీసుకెళ్లే క్రమంలో భూసేకరణకు సంబంధించిన సమస్యలను దాదాపుగా పరిష్కరించామని మంత్రి తెలిపారు. భూసేకరణ కోసం ఇటీవల రూ.48 కోట్లు విడుదల చేశామని, ఇంకా అవసరమైన భూముల కోసం జిల్లా కలెక్టర్ ప్రతిపాదనలు పంపితే అవసరమైన నిధులను కూడా సమకూర్చేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. భూసేకరణ, నిర్మాణ పనులు, సాంకేతిక సమస్యలు ఏవైనా ఉంటే వాటిని వేగంగా పరిష్కరించి ప్రాజెక్టు పనులను ముందుకు తీసుకెళ్లాలని అధికారులకు సూచించామని చెప్పారు. సీతారామ ప్రాజెక్టు ద్వారా ములకలపల్లి, దమ్మపేట, అశ్వారావుపేట ప్రాంతాల్లో కూడా సాగునీటి అవసరాలను తీర్చేలా ప్రణాళికలు



రూపొందిస్తున్నామని మంత్రి తెలిపారు. ముఖ్యంగా డమ్మపేట, అశ్వారావుపేట ప్రాంతాల్లో పెద్ద ఎత్తున ఆయిల్పామ్ సాగు జరుగుతున్నందున సాగునీటి సౌకర్యం మరింత మెరుగుపడాల్సిన అవసరం ఉందన్నారు. సుమారు 80 వేల ఎకరాల్లో ఆయిల్పామ్ సాగు ఉన్న ప్రాంతాలకు నీటి లభ్యతను పెంచే విధంగా సీతారామ జలాలను వినియోగించాల్సిన అవసరం ఉందన్నారు.

నాలుగో పంప్హౌస్ ద్వారా అవసరమైన ప్రాంతాలకు నీటిని తీసుకెళ్లేలా పనులను వేగవంతం చేయాలని మంత్రి తెలిపారు. ప్రధాన కాలువలతో పాటు అవసరమైన చోట్ల పైప్లైన్ వ్యవస్థను ఏర్పాటు చేస్తే భూసేకరణ సమస్యలు తగ్గుతాయని, నీటిని నేరుగా రైతుల పొలాలకు తీసుకెళ్లే అవకాశం ఉంటుందని చెప్పారు. పైప్లైన్తో పాటు డ్రిప్, స్ప్రింక్లర్ విధానాలను ప్రోత్సహించడం ద్వారా నీటి వినియోగాన్ని తగ్గించవచ్చని, తక్కువ నీటితో ఎక్కువ విస్తీర్ణంలో సాగు చేయడానికి అవకాశం ఉంటుందని తెలిపారు. సీతారామ ప్రాజెక్టు పనులపై జిల్లా కలెక్టర్, స్థానిక ప్రజాప్రతినిధులు వారానికోసారి సమీక్ష నిర్వహించాలని మంత్రి సూచించారు.

### ములకలపల్లి అభివృద్ధికి ప్రాధాన్యత

ములకలపల్లి ప్రాంత అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని మంత్రి తుమ్మల తెలిపారు. రహదారులు, మండల కార్యాలయాలు, గురుకులాలు, ఏకలవ్య పాఠశాలలు, విద్యుత్ సబ్‌స్టేషన్లు, ఎంపీడీవో కార్యాలయం, పోలీస్ స్టేషన్ తదితర మౌలిక వసతుల అభివృద్ధికి చర్యలు తీసుకున్నామని చెప్పారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి కార్యక్రమాలను కొనసాగిస్తామని తెలిపారు. కమలాపురం వద్ద పంప్ మోటార్ను ఆన్ చేసి అన్నదైవం ప్రాజెక్టుకు నీటిని విడుదల చేయడం ద్వారా ఈ ప్రాంత రైతులకు సాగునీటి ప్రయోజనం కల్పించే దిశగా మరో అడుగు ముందుకు వేసినట్లు మంత్రి తెలిపారు. విడుదలైన నీరు ఆయకట్టులోని రైతులకు సక్రమంగా అందేలా అధికారులు పర్యవేక్షించాలని సూచించారు. ఈ కార్యక్రమాల్లో సంబంధిత ఇంజినీరింగ్ అధికారులు, రెవెన్యూ అధికారులు, ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# ఎస్సీ ఎస్టీలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలి

- తెలంగాణ రాష్ట్ర షెడ్యూల్ కులాల,తెగల కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య
- భద్రాద్రి జిల్లా పవిత్రమైన ప్రాంతం
- శ్రీసీతారామచంద్రస్వామి ఆశీస్సులు ఎల్లవేళలా ఉంటాయి
- భద్రాద్రి గిరి మార్ట్ ఏర్పాటు ఆదర్శనీయం
- ఐటీడీఏ పీవో రాహుల్‌ను అభినందించిన కమిషన్ చైర్మన్




**భద్రాద్రి కొత్తగూడెం, సెప్టెంబర్ 21(మనం ప్రతినిధి):** ఎస్సీ, ఎస్టీలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలని అందుకోసం రాష్ట్ర ప్రభుత్వం ఎన్నో సంక్షేమ పథకాలు ప్రవేశ పెట్టి అమలు చేస్తూ, రక్షణ చట్టాలను రూపొందించిందని

తెలంగాణ రాష్ట్ర షెడ్యూల్ కులాల, తెగల కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య అన్నారు. సోమవారం భద్రాద్రి జిల్లా ఐ.డీ.ఓ.సీ లో ల్యాండ్, సర్వీస్( ఆర్.ఓ.ఆర్), అట్రాసిటీస్ అంశాలపై అధికారులతో సమీక్షా సమావేశం ముగ్గురు కమీషన్ సభ్యులతో కలిసి నిర్వహించి మాట్లాడారు. రాష్ట్రంలోనే విస్తీర్ణంలో అతి పెద్ద ఏజెన్సీ జిల్లా భద్రాద్రి జిల్లా అని గుర్తుచేశారు. కమిషన్ సమావేశానికి జిల్లాకు రెండోసారి రావడం జిల్లా అధికారులు ఘనస్వాగతం పలకడం మర్చిపోలేని సంఘటనని అన్నారు.రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీల అభ్యున్నతి కోసం ఎన్నో సంక్షేమ పథకాలను అమలు చేస్తుందని, వాటిని అందిపుచ్చుకొని ఆర్థికంగా దినదినాభివృద్ధి చెందాలని సూచించారు. వివిధ శాఖల్లో పని చేస్తున్న ప్రభుత్వ ఎస్సీ, ఎస్టీల భూమి సమస్యలు, బ్యాక్ లాగ్ పోస్టులు వివరాలు, ఉద్యోగులు రక్షణ కోసం చట్టాలను, రోస్టర్ విధానాలు,రూపొందించి వాటిని పకడ్బందీగా అమలు చేసేందుకు కమిషన్ చర్యలు చేపడుతుందని గుర్తు చేశారు. ఎస్సీ, ఎస్టీ ప్రజల పైన ఉద్యోగులపైన ఎటువంటి వేధింపులు కానీ చిత్రహింసలు గాని ఇబ్బందులు గురి చేసిన శాఖ పరంగా కఠిన చర్యలు తీసుకుంటామని కమిషన్ చైర్మన్ హెచ్చరించారు. న్యాయం కోసం దరఖాస్తు చేసుకున్న ఎస్సీ, ఎస్టీ బాధితులకు ఎఫ్.ఐ.ఆర్, చార్జిషీట్, కమిషన్, కంపెన్సేషన్ వరకు పారదర్శకంగా ఉండేందుకు అధికారులు పనిచేయాలని ఆదేశించారు. భద్రాద్రి జిల్లాకు శ్రీ సీతారామచంద్రస్వామి ఆశీస్సులు ఎల్లవేళలా ఉంటాయని, ఎస్సీ సమస్యలు ఉన్న వాటి పరిష్కారం ఆ రాములోరి దయ వలన సత్వరమే తీరిపోతాయని కమిషన్ చైర్మన్ పేర్కొన్నారు. దక్షిణ అయోధ్యగా పేరు గడించిన భద్రాచలం పుణ్యక్షేత్రాన్ని దర్శించుకోవడం ఎంతో భాగ్యమన్నారు. అదేవిధంగా వివిధశాఖల అధికారుల నుంచి వివరాలు తోపాటు ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల నివేదిక రాష్ట్ర కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య అడిగి తెలుసుకున్నారు. ఈ క్రమంలో భద్రాద్రి జిల్లా పోలీస్ శాఖ నివేదికను కమిషన్ చైర్మన్ అడుగగా 2014 నుంచి ఇప్పటివరకు జిల్లాలో 1115 ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు నమోదయాయని జిల్లా ఎస్పీ రోహిత్ రాజు వివరించారు. అందులో 51 కేసులు ప్రస్తుతం విచారణలో ఉన్నాయని, వాటిలో 20 కేసులో చార్జింగ్ చార్జిషీట్ చేశామని, రెండు హైకోర్టు స్టేలు ఉండగా, 9 కేసులు లీగల్ ఒపీనియన్ కోసం ఉన్నాయని, 20 పెండింగ్ కేసులు ప్రస్తుతం ఉన్నట్లు జిల్స్ ఎస్పీ వివరించారు.

ఈ క్రమంలోనే జిల్లా షెడ్యూల్ కులముల అభివృద్ధి శాఖ, జిల్లా పంచాయతీ, డీ.ఆర్.డీ.ఓ, ఎస్సీ కార్పొరేషన్, గురుకులాల, జిల్లా స్త్రీ శిశు సంక్షేమ శాఖ, జిల్లా ప్రజా పరిషత్, ఉపాధి శాఖ మున్సిపల్ శాఖ, వ్యవసాయ శాఖ, పరిశ్రమలు, విద్యుత్, ఆర్డబ్ల్యూఎస్, మిషన్ భగీరథ, పంచాయితీ రాజ్, ఆర్ అండ్ బి, ఎక్సైజ్ జ్యోతిరావు పూలే డిసిఓ, జిల్లా రెవెన్యూ, ఫారెస్ట్, ఐటీడీఏ లో నమోదైన ఎస్సీ ఎస్టీ కేసుల వివరాలు ఉద్యోగుల సమస్యలు ప్రస్తుతం ఉన్న ఉద్యోగుల సంఖ్య భర్తీ కానీ బ్యాక్లాగ్ పోస్టుల వివరాలను క్షేత్రస్థాయిలో క్షుణ్ణంగా అడిగి తెలుసుకున్నారు. సీఎం రేవంత్ రెడ్డి ఎస్సీ, ఎస్టీ ల అభ్యున్నతి కోసం నిరంతరం కృషి చేస్తున్నారని వారి అభ్యున్నతే లక్ష్యంగా వివిధ పథకాల అమలుకు కృషిచేస్తున్నట్లు పేర్కొన్నారు. మండల తాహసిల్దార్లు, ఎంపీడీవోలు, సిడిపివోలు సమన్వయంతో జిల్లా అధికారులతో మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ ల సమస్యల పరిష్కారానికి న్యాయం కోసం ఎదురుచూస్తున్న బాధితుల కోసం పని చేయాలని ఆదేశించారు.

### భద్రాద్రి గిరి మార్ట్ ఏర్పాటు ఆదర్శనీయం

భద్రాద్రి గిరి మార్ట్ ఏర్పాటు ఆదర్శనీయమని భద్రాచలం ఐటిడిఏ పిఓ రాహుల్ ను చైర్మన్ అభినందించారు. గిరిజన మహిళా సంఘాల ఆధ్వర్యంలో వారి సాంప్రదాయ వృత్తి ప్రోత్సహించే ఉద్దేశంలో భాగంగా భద్రాచలంలో ఈ గిరిమార్టును ఏర్పాటు చేయడం గర్వించదగ్గ విషయం అన్నారు. వారి ఉత్పత్తులు ను ఏర్పాటు చేసి, గిరిజనుల జీవనశైలి విధి,విధానాలను కళ్ళకు కట్టే విధంగా చూపించిన మ్యూజియం అద్భుతంగా ఉన్నాయని కొనియాడారు. వారు ఉత్పత్తి చేసిన వస్తువులను మార్కెటింగ్ చేస్తు ప్రోత్సహిస్తు చర్యలు చెప్పట్టడం, ఇలాంటి మార్పులను స్వాగతిస్తున్నట్లు పేర్కొన్నారు.

### దరఖాస్తుల స్వీకరణ

న్యాయంకోసం వచ్చిన ఎస్సీ, ఎస్టీ బాధితుల నుంచి కమిషన్ సభ్యులు లక్ష్మీనారాయణ, రాంబాబు నాయక్, నీలాదేవి, డీ.బీ.ఎఫ్ శంకర్ లతో కమిషన్ చైర్మన్ వెంకటయ్య దరఖాస్తులను స్వీకరించి సంబంధిత శాఖల అధికారులకు రిఫర్ చేసి ఎటువంటి నిర్లక్ష్యం, అలసత్వం ప్రదర్శించకుండా తక్షణమే సమస్యలు పరిష్కారం చేసేలా చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. తొలుత రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ వెంకటయ్యకు భద్రాద్రి పోలీస్, ఏ.ఆర్ విభాగాల ఆధ్వర్యంలో గాడ్ ఆఫ్ హనర్ ఏర్పాటు చేసి ఘన స్వాగతం పలికారు. ఈ సమావేశంలో భద్రాద్రి జిల్లా ఎస్పీ రోహిత్ రాజు, అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వేణుగోపాల్, భద్రాచలం ఐటిడిఏ పి.ఓ రాహుల్, భద్రాచలం సబ్ కలెక్టర్ మృనాల్ శ్రేష్ట్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యా చందన,డీ. ఆర్.ఓ పద్మావతి, సిపిఓ సునీత, జిల్లా షెడ్యూలు కులముల అధికారిని శ్రీలత, కార్పొరేషన్ ఈ.డీ ఉపేందర్,జడ్పీ సీఈఓ నాగలక్ష్మి,డీపీఓ అనూష, డీ.ఏ.వో బాబురావు, విద్యుత్ శాఖ ఈ వివిధ శాఖల అధికారులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# మంత్రి తుమ్మలను కలిసిన ఎంఎల్ఏ

**దమ్మపేట, సెప్టెంబర్ 21(మనం న్యూస్):** దమ్మపేట మండల పరిధిలోని గండుగులపల్లి గ్రామంలో సోమవారం ఉదయం రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుని స్థానిక శాసనసభ్యుడు జారే ఆదినారాయణ, చింతలపూడి మాజీ శాసనసభ్యులు గంట మురళి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ కార్యక్రమంలో సత్తుపల్లి, దమ్మపేట సీనియర్ నాయకులు, తుమ్మల అభిమానులు పాల్గొన్నారు.

# సీఎంఆర్ఎఫ్‌తో పేదలకు ఆపన్నహస్తం



- 223 మందికి రూ.78.17 లక్షల సాయం
- లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేసిన దయాకర్ రెడ్డి

**ఖమ్మం, సెప్టెంబర్ 21(మనం న్యూస్):** రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రివర్యులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి సిఫారసుతో మంజూరైన ముఖ్యమంత్రి సహాయనిధి ( సీఎంఆర్ఎఫ్) చెక్కుల పంపిణీ కార్యక్రమాన్ని సోమవారం మంత్రి పొంగులేటి క్యాంప్ కార్యాలయంలో నిర్వహించారు. తిరుమలాయపాలెం మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన, అలాగే ఉభయ జిల్లాల్లోని వివిధ మండలాలకు చెందిన మొత్తం 223 మందికి పైగా లబ్ధిదారులకు. రూ.78.17 లక్షల విలువ చేసే చెక్కులను.. రాష్ట్ర రెవెన్యూ మంత్రి పొంగులేటి క్యాంప్ కార్యాలయ ఇన్ చార్జ్ తుంబూరు దయాకర్ రెడ్డి కాంగ్రెస్ నేతలతో కలిసి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అనారోగ్యంతో వైద్య ఖర్చులు భరించలేక ఇబ్బందులు పడుతున్న పేద, మధ్యతరగతి కుటుంబాలకు సీఎంఆర్ఎఫ్ ద్వారా ఆర్థిక సహాయం అందడం ఎంతో ఊరటనిస్తోందన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాల ఫలాలు అందేలా మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి కృషి చేస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, పాల్గొన్నారు.

# రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్గా మళ్లీ డాక్టర్ ఎస్.ఎల్. కాంతారావుకే మొగ్గు

- అభివృద్ధి, సేవా కార్యక్రమాలే ఆయనకు శ్రీరామరక్ష
- మెజార్టీ సభ్యుల మద్దతు





**భద్రాచలం, సెప్టెంబర్ 21 (మనం న్యూస్):** ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా ఎన్నికల సమయం దగ్గరపడుతున్న నేపథ్యంలో సంస్థలో ఎన్నికల వేడి మొదలైంది. ప్రస్తుతం జిల్లా సమన్వయకర్త/చైర్మన్గా బాధ్యతలు నిర్వర్తిస్తున్న డాక్టర్ ఎస్.ఎల్. కాంతారావు ఆధ్వర్యంలో జరిగిన విస్తృత సేవా, అభివృద్ధి కార్యక్రమాలే ఆయనను మరోసారి ఆ పదవికి బలమైన అభ్యర్థిగా నిలబెడుతున్నాయి. జిల్లాలోని పేద, గిరిజన ప్రజలకు అందించిన అద్భుత వైద్య సేవల దృష్ట్యా, ఆయనే తిరిగి చైర్మన్గా కొనసాగాలని సొసైటీ మెజార్టీ సభ్యులు ఏకగ్రీవంగా అభిప్రాయపడుతున్నారు.

### కోట్లాది రూపాయలతో ఆధునిక వైద్య సౌకర్యాలు

డాక్టర్ కాంతారావు నాయకత్వంలో రెడ్ క్రాస్ సొసైటీ గతంలో ఎన్నడూ లేని విధంగా ప్రగతి సాధించింది. సుమారు రూ. 3 కోట్ల విలువైన అత్యాధునిక వైద్య పరికరాలను సమకూర్చి, పేద ప్రజలకు కార్పొరేట్ స్థాయి వైద్య పరీక్షలు, చికిత్సలను అందుబాటులోకి తెచ్చారు. అలాగే, ఏజెన్సీ ప్రాంతంలో తీవ్రంగా వేధిస్తున్న తలసేమియా, సికిల్ సెల్ అనీమియా బాధితుల కోసం రూ. 46 లక్షల వ్యయంతో నూతన పక్కా భవనాన్ని నిర్మించి, వారికి శాశ్వత భవనాన్ని చేకూర్చారు.

### రూ. 2 కోట్లతో పాల్వంచలో క్యాన్సర్ నిర్ధారణ కేంద్రం

భవిష్యత్ ప్రణాళికలో భాగంగా పాల్వంచలో త్వరలోనే పూర్తిస్థాయి క్యాన్సర్ నిర్ధారణ కేంద్రాన్ని ఏర్పాటు చేయనున్నారు. ఇందుకోసం స్థల సేకరణ, భవన నిర్మాణం అధునాతన స్క్రీనింగ్ యంత్రాల కొనుగోలు నిమిత్తం సుమారు రూ. 2 కోట్లకు పైగా ఖర్చు చేయనున్నారు. ఈ కేంద్రం అందుబాటులోకి వస్తే గ్రామీణ ప్రాంత ప్రజలకు క్యాన్సర్ ముందస్తు నిర్ధారణ ఎంతో సులభతరం కానుంది.

### కొనసాగాల్సిన అభివృద్ధి

ప్రస్తుతం చేపట్టిన ప్రతిష్టాత్మక ప్రాజెక్టులు, పాల్వంచ క్యాన్సర్ కేంద్రం నిర్మాణం, భద్రాచలంలో ప్రతిపాదించిన డయాలసిస్, రక్తనిధి కేంద్రాల పనులు ఆటంకం లేకుండా సాగాలంటే డాక్టర్ ఎస్.ఎల్. కాంతారావు అనుభవం, నిబద్ధత ఎంతో అవసరమని సభ్యులు స్పష్టం చేస్తున్నట్లుగా తెలుస్తుంది. ఆయన అంకితభావంతో పనిచేసే వ్యక్తి అని, ఈసారి కూడా జిల్లా చైర్మన్ పగ్గాలు ఆయనకే అప్పగించాలని మెజార్టీ సభ్యులు ముక్తకంఠంతో కోరుతున్నారు.





# టియూడబ్ల్యూజె వైద్యశిబిరం విజయవంతం

- శిబిరాన్ని ప్రారంభించిన అడిషనల్ కలెక్టర్ పి.శ్రీనివాసరెడ్డి
- ఇలాంటి క్యాంపులు జర్నలిస్టులకు చాలా అవసరం: ఎమ్‌డి ఖాదర్‌బాబా
- ప్రెస్‌క్లబ్ కృషి అభినందనీయం: కె.రాంనారాయణ

**ఖమ్మం, సెప్టెంబర్ 21(మనం న్యూస్):** టియూడబ్ల్యూజె(ఐజెయూ) ఖమ్మం ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరం విజయవంతమైంది. ఖమ్మంలోని యశోద క్లీనిక్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన ఈ శిబిరాన్ని జిల్లా అదనపు కలెక్టర్(రెవెన్యూ) పి.శ్రీనివాసరెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎం.డి ఖాదర్‌బాబాతో కలిసి ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి డిపిఆర్ఓ ఎం.ఏ గౌస్, టియూడబ్ల్యూజె(ఐజెయూ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.రాంనారాయణ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ప్రారంభం అనంతరం అదనపు కలెక్టర్ పరీక్షలు చేయించుకున్నారు. అనేక ఒత్తిడుల మధ్య పని చేస్తున్న జర్నలిస్టులకు ఇలాంటి వైద్య శిబిరాలు అవసరమని అభిప్రాయపడ్డారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎం.డి ఖాదర్‌బాబా మాట్లాడుతూ అనేక ప్రజా సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళుతూ వాటి పరిష్కారానికి కారణమవుతున్న జర్నలిస్టులు తమ పని బాధ్యతల్లో పడి ఆరోగ్యాన్ని పట్టించుకోవడం లేదని, ఇలాంటి శిబిరాలు నిర్వహించడం ద్వారా ఎంతో ప్రయోజనం ఉందని పేర్కొన్నారు. యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.రాంనారాయణ మాట్లాడుతూ వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసిన ప్రెస్‌క్లబ్ కమిటీకి అభినందనలు తెలిపారు. ఈ వైద్య శిబిరంలో గుండె, బోన్ పరీక్షలు, ఈసిజి, షుగర్, ఆర్థోపెడిక్ పరీక్షలు నిర్వహించారు. యశోద హాస్పటల్ సోమాజిగూడ వైద్యులు డాక్టర్ శ్రీహర్ష జిఆర్ , డాక్టర్ మురళీ, డాక్టర్ కీర్తి కృష్ణ వైద్యసేవలందించారు. జర్నలిస్టు కుటుంబ సభ్యులు విరివిగా పాల్గొని ఉచిత వైద్యసేవలు పొందారు. ఈ కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మాటేటి వేణుగోపాల్, జిల్లా అధ్యక్షులు ఏనుగు వెంకటేశ్వరరావు, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు సామినేని మురారి, ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్షులు ఎం.భూపాల్, యూనియన్ రాష్ట్ర నాయకులు వనం వెంకటేశ్వర్లు, జిల్లా ఉపాధ్యక్షులు మోహిద్దీన్, పసుపులేటి సత్యనారాయణ, ప్రెస్‌క్లబ్ అధ్యక్షులు నామా పురుషోత్తం, కోశాధికారి పిన్ని సత్యనారాయణ, నగర కమిటీ కోశాధికారి ఏలూరి వేణు, పలువురు జిల్లా, నగర, ప్రెస్‌క్లబ్ నాయకులతో పాటు యశోద క్లీనిక్ సెంటర్ సిబ్బంది పాల్గొన్నారు.

# అన్నం పరబ్రహ్మ స్వరూపం




- అన్ని దానాలకు కన్నా అన్నదానం మిన్న..
- తాళ్లపల్లి నవీన్ సునీత దంపతులచే మహా అన్నదానం..

**ఆళ్లపల్లి, సెప్టెంబర్ 21 (మనం న్యూస్):** అన్నం పరబ్రహ్మ స్వరూపం అని అన్నదానం చేయడం ఎంతో ఆత్మ సంతృప్తినిస్తుందని తాళ్లపల్లి నవీన్ సునీత దంపతులు అన్నారు. గణేష్ నవరాత్రుల సందర్భంగా మండల పరిధిలోని మర్కోడు గ్రామంలో గల బొడ్రాయి సెంటర్ నందు ఏర్పాటుచేసిన గణనాథుని సన్నిధిలో మహా అన్నదాన కార్యక్రమాన్ని వారు ఏర్పాటు చేశారు. గ్రామానికి రక్షగా ఉండే బొడ్రాయి వద్ద వినాయక చవితి రోజున పూజలు చేయడం, అన్నదానం చేయడం ద్వారా గ్రామమంతా సుభిక్షంగా ఉంటుందని వారు పేర్కొన్నారు. అన్నదానం సందర్భంగా వినాయకుడికి 21 పత్రాలతో పూజ, గరిక పూజ, ఉండ్రాళ్ల నైవేద్యం సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులకు, గ్రామస్తులకు మహా అన్నప్రసాద వితరణ కార్యక్రమం చేపట్టారు. ఈ మహా అన్నదాన కార్యక్రమానికి తాళ్లపల్లి నవీన్, సునీత దంపతులు తమ కుమారుడు చి. హేమంత్ పుట్టినరోజు సందర్భంగా దాతలుగా వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు తాళ్లపల్లి వెంకన్న, వ్యాపారస్తులు తాళ్లపల్లి నాగేష్ తాటికొండ వెంకటాచారి, పొదిల రాము, వార్డు మెంబర్లు తాళ్లపల్లి ఎల్ల గౌడ్, కేక్కర్ల సునీత, కొమరం కృష్ణంరాజు, యువత చిరంజీవి రంజిత్, రవి, శ్రావణ్, సతీష్, శేఖర్, వేణు,రాము, సాయి, ఎ.నవీన్, నవజీవన్, వినయ్, వికాస్, వెంకన్న, నవీన్, చరణ్, ఉదయ్, మనీ, గ్రామస్తులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

# పవన్ కల్యాణ్ సమక్షంలో జనసేనలో చేరిన చదలవాడ బాబీ



కిర్లంపూడి సెప్టెంబర్ 21:(మనం న్యూస్): కిర్లంపూడి మండలానికి చెందిన రాజకీయ నాయకుడు, సామాజిక సేవకుడు చదలవాడ రాజ్ కుమార్ (బాబీ) జనసేన పార్టీలో చేరారు.సోమవారం పిఠాపురంలో ఉప ముఖ్యమంత్రి,జనసేన పార్టీ అధినేత పవన్ కల్యాణ్ సమక్షంలో జనసేన కండువా కప్పుకున్నారు. సుమారు 25 ఏళ్లుగా రాజకీయాల్లో కొనసాగుతున్న బాబీ వివిధ రాజకీయ,సామాజిక కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటున్నారు. 2003 నుంచి 2014 వరకు కాంగ్రెస్ పార్టీలో నీటి సంఘం అధ్యక్షుడిగా పనిచేశారు.2014 నుంచి 2019 వరకు తెలుగుదేశం పార్టీ హయాంలో ఏలేరు ప్రాజెక్టు డైరెక్టర్గా బాధ్యతలు నిర్వహించారు.2019 నుంచి 2024 వరకు కిర్లంపూడి కోఆపరేటివ్ సొసైటీ చైర్మన్గా సేవలందించారు.

2010 నుంచి 2025 వరకు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ఖోఖో అసోసియేషన్ వైస్ చైర్మన్గా కొనసాగారు.కరోనా సమయంలో చలమలశెట్టి సునీల్ సహకారంతో ఆక్సిజన్ సిలిండర్లు ఏర్పాటు చేయడంతో పాటు నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు.పేదలకు ఇళ్ల స్థలాలు ఇప్పించడం,ఇళ్లు నిర్మించి ఇవ్వడం,వికలాంగులు,వృద్ధులకు పింఛన్లు ఇప్పించడం, వైద్య సదుపాయాలు కల్పించడం,ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా ఆర్థిక సాయం అందేలా కృషి చేశారు.క్రీడల అభివృద్ధిలోనూ బాబీ తనవంతు పాత్ర పోషించారు. ఆయన ఆధ్వర్యంలో 2018, 2019, 2021 సంవత్సరాల్లో రాష్ట్రస్థాయి ఖోఖో, కబడ్డీ పోటీలను నిర్వహించారు.జనసేన అధినేత పవన్ కల్యాణ్ ఆశయాలకు కట్టుబడి పనిచేయాలనే ఉద్దేశంతో జనసేనలో చేరినట్లు బాబీ తెలిపారు.కిర్లంపూడి మండలంలో జనసేన పార్టీ బలోపేతానికి తనవంతు కృషి చేస్తానని పేర్కొన్నారు.

# పవన్ కల్యాణ్ సమక్షంలో జనసేనలో చేరిన వరుపుల సుబ్బారావు



ఏలేశ్వరం, సెప్టెంబర్,21:-(మనం న్యూస్): ప్రత్తిపాడు మాజీ ఎమ్మెల్యే,సీనియర్ రాజకీయ నాయకుడు వరుపుల సుబ్బారావు జనసేన పార్టీలో చేరారు.సోమవారం జనసేన అధినేత పవన్ కల్యాణ్ సమక్షంలో పిఠాపురంలో ఆయన జనసేన కండువా కప్పుకున్నారు.1983లో కాంగ్రెస్ పార్టీతో రాజకీయ ప్రస్థానం ప్రారంభించిన వరుపుల సుబ్బారావు ప్రత్తిపాడు నియోజకవర్గం నుంచి ఏడు సార్లు ఎన్నికల బరిలో నిలిచి రెండుసార్లు ఎమ్మెల్యేగా విజయం సాధించారు.2004లో కాంగ్రెస్ పార్టీ తరఫున,2014లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తరఫున ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు.గతంలో జిల్లా కేంద్ర సహకార బ్యాంకు (డీసీసీబీ) చైర్మన్గా కూడా పనిచేశారు.పార్టీలకు అతీతంగా అందరితో సత్సంబంధాలు కొనసాగిస్తూ అజాతశత్రువుగా గుర్తింపు పొందారు.2024లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా ప్రత్తిపాడు నుంచి పోటీ చేసిన ఆయన,తాజాగా ఆ పార్టీకి రాజీనామా చేసి జనసేనలో చేరారు.ఆయనతో పాటు కుమారులు వరుపుల సుబ్బారావు, వరుపుల రాజబాబు, కత్తిపూడికి చెందిన గాబు కృష్ణ జనసేనలో చేరారు. కూటమి చేస్తున్న ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి,సంక్షేమ కార్యక్రమాలు ఆకర్షితులై పార్టీలో చేరినట్టు సుబ్బారావు తెలిపారు.. పవన్ కళ్యాణ్ ఆశయాలకు అనుగుణంగా పనిచేస్తూ ప్రత్తిపాడు నియోజకవర్గంలో జనసేన పార్టీ బలోపేతానికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు.ఈ చేరికలు ఎంపీ తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్,కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ, కాకినాడ జిల్లా జనసేన అధ్యక్షులు తుమ్మల బాబు ఆధ్వర్యంలో జరిగాయి.



# గురజాడ రచనలు నేటి తరానికి స్ఫూర్తిదాయకం

- ఎంఏ షరీఫ్, పొత్తూరి రామరాజు

నరసాపురం, సెప్టెంబర్ 21(మనం న్యూస్): తన రచనల ద్వారా ప్రజలలో సామాజిక చైతన్యాన్ని తీసుకొచ్చి సమాజంలో మార్పు కోసం ఆలోచింపచేసిన మహనీయుడు గురజాడ అప్పారావు అని శాసనమండలి మాజీ చైర్మన్, రాష్ట్ర ప్రభుత్వం మైనారిటీ వ్యవహారాల సలహాదారు ఎంఏ షరీఫ్, నరసాపురం నియోజకవర్గ తెదేపా ఇంచార్జ్ పొత్తూరి రామరాజు పేర్కొన్నారు. సోమవారం స్థానిక నియోజవర్గ తెదేపా కార్యాలయంలో కవి పితామహుడు బ్రహ్మశ్రీ గురజాడ అప్పారావు 164వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎం.ఎ. షరీఫ్, పొత్తూరి రామరాజు పాల్గొని మాట్లాడుతూ, గురజాడ అప్పారావు తెలుగు సాహిత్యానికి చేసిన సేవలు చిరస్మరణీయమని ఆయన రచనలు నేటి తరానికి కూడా స్ఫూర్తిదాయకమని అన్నారు. గురజాడ జయంతిని ప్రభుత్వం రాష్ట్ర పండుగగా ప్రకటించడం తెలుగు సాహిత్యానికి, ఆయన సేవలకు దక్కిన గౌరవమని పేర్కొన్నారు. గురజాడ అప్పారావు తెలుగు భాష, సాహిత్యం, సమాజ అభ్యున్నతికి చేసిన కృషి ఎప్పటికీ గుర్తుండిపోతుందని దేశమంటే మట్టి కాదోయ్, దేశమంటే మనుషులోయ్ అనే మహోన్నత సందేశం ద్వారా మానవతా విలువలు, దేశభక్తి, సామాజిక బాధ్యతను ప్రజల్లో పెంపొందించారని ఆయన ఆశయాలను నేటి యువతకు చేరువ చేయాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. ఈ సందర్భంగా గురజాడ అప్పారావు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. కార్యక్రమంలో నియోజకవర్గ తెదేపా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# వీఆర్ఏల పోరాటానికి పోడూరు వీఆర్వోల అండ

- సమస్యలు పరిష్కరించాలంటూ తహసీల్దార్ కార్యాలయం వద్ద కొనసాగుతున్న శాంతియుత నిరసనలు
- వీఆర్ఏలకు భోజనం ఏర్పాటు చేసిన వీఆర్వోల సంక్షేమ సంఘం,సంఘీభావం తెలియచేసిన తాసిల్దార్ ఫాజిల్



పోడూరు, సెప్టెంబర్ 21, మనం ప్రతినిధి: వీఆర్ఏల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని కోరుతూ ఏపీ వీఆర్ఏ సంఘాల జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా కొనసాగుతున్న శాంతియుత నిరసనలకు పోడూరు మండల వీఆర్వోలు శ్రీ పాద కుమార్,చలం,వర్మ, శేఖర్, లక్ష్మీనారాయణ, వెంకటేశ్వరరావు, నరసింహారావు,శ్రీనివాస్, రెవెన్యూ ఇన్స్పెక్టర్ కందుల రాంబాబు, టైపిస్ట్ సునీల్, సీనియర్ అసిస్టెంట్ కృపారావు, డిప్యూటీ తాసిల్దార్ తదితరులు సంఘీభావం తెలిపారు. సెప్టెంబర్ 16వ తేదీ నుంచి వీఆర్ఏలు సహాయ నిరాకరణ ఉద్యమ సమ్మె చేపట్టి తమ న్యాయమైన డిమాండ్ల పరిష్కారం కోసం పోరాటం కొనసాగిస్తున్నారు. ఇందులో భాగంగా సోమవారం పోడూరు మండల తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో వీఆర్ఏలు చేపట్టిన నిరసన కార్యక్రమానికి వీఆర్వోల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో వీఆర్వోలు హాజరై సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా వీఆర్ఏలకు వీఆర్వోల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో భోజన సదుపాయం ఏర్పాటు చేశారు. మండల తహసీల్దార్ సయ్యద్ మౌలానా ఫాజిల్ ఆధ్వర్యంలో వీఆర్వోలు వీఆర్ఏలకు మద్దతు తెలిపారు. వీఆర్ఏలు చేస్తున్న నిరసన కార్యక్రమానికి తాను,తన రెవెన్యూ సిబ్బంది సంఘీభావం తెలియజేస్తున్నామని తహసీల్దార్ సయ్యద్ మౌలానా ఫాజిల్ తెలిపారు.వీఆర్ఏల ప్రధాన డిమాండ్లలో గ్రామ రెవెన్యూ సహాయకులకు పేస్కేల్ అమలు చేయడం, నామినీ వీఆర్ఏలుగా పనిచేస్తున్న వారికి వీఆర్ఏల ప్రమోషన్ కోటాను 30 శాతం నుంచి 70 శాతానికి పెంచడం, కారుణ్య నియామకాలు చేపట్టడం వంటి అంశాలు ఉన్నాయని వీఆర్ఏలు తెలిపారు. ప్రభుత్వం తమ డిమాండ్లను సానుకూలంగా పరిశీలించి వెంటనే పరిష్కరించాలని వారు కోరారు.

# జిన్నూరులో అక్రమ మట్టి తరలింపుపై కొరడా

- ట్రాక్టర్ల అడ్డగింత.. రెవెన్యూ అధికారుల దూకుడు
- రాజకీయ అండ ఉందంటూ యజమాని వ్యాఖ్యలు.. అధికారుల తీరుపై ఉత్కంఠ



పోడూరు, సెప్టెంబర్ 21 మనం ప్రతినిధి : జిన్నూరు గ్రామం నరసింహారావుపేట కాలువ గట్టు సమీపంలో అక్రమంగా మట్టి తరలిస్తున్న ట్రాక్టర్లను రెవెన్యూ అధికారులు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా మట్టి తరలింపు యజమాని గుబ్బల ఆనందరావు తమకు రాజకీయ ప్రజాప్రతినిధుల అండ ఉందని, గతంలో అధికారులకు డబ్బులు ఇచ్చామని విలేకరుల సమక్షంలో వ్యాఖ్యానించినట్లు సమాచారం.ఈ వ్యాఖ్యలపై అధికారులు ఎలా స్పందిస్తారు? అక్రమ మట్టి తవ్వకాల వెనుక ఎవరి ప్రమేయం ఉందన్న అంశంపై ఎలాంటి చర్యలు తీసుకుంటారన్నది ఆసక్తిగా మారింది.

# వై.ఎన్ కళాశాలలో ఎన్.సి.సి క్యాడెట్ల ఎంపికలు



నరసాపురం, సెప్టెంబర్ 21(మనం న్యూస్): స్థానిక వై.ఎన్. కళాశాలలో 2026-2027 విద్యా సంవత్సరానికి సంబంధించి 7(ఎ) నేవల్ యూనిట్ ఆధ్వర్యంలో సోమవారం ఎన్.సి.సి. నేవల్ వింగ్ ప్రవేశాల ఎంపిక కార్యక్రమం నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.పి.వి. అప్పారావు అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో నేవల్ కమాండింగ్ ఆఫీసర్ లెఫ్టినెంట్ కమాండర్ శ్రేయ్ దీక్షిత్ ముఖ్యఅతిథిగా పాల్గొని విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ సాయుధ బలగాల్లో చేరాలనుకునే యువతకు నేవల్ ఎన్.సి.సి. ఒక సువర్ణావకాశమని అన్నారు.

విద్యార్థులు చదువుతో పాటు క్రీడలు, సాహస క్రీడలు, సామాజిక సేవా కార్యక్రమాలలో ముందుండాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఎన్.సి.సిలో ప్రవేశాల కొరకు విద్యార్థులకు శారీరక దారుఢ్య పరీక్షలు, రాత పరీక్ష, ఈత పరీక్ష, మరియు ఇంటర్వ్యూల ద్వారా విద్యార్థుల దేహ దారుఢ్యం, కమ్యూనికేషన్ నైపుణ్యాలు, ఆత్మవిశ్వాసం, వ్యక్తిత్వాలను పరిశీలించారు. ఈ ఎంపిక ప్రక్రియను కళాశాల ఏ.ఎన్.వో సబ్ లెఫ్టినెంట్ జి. సునీత, 7(ఎ) నేవల్ యూనిట్ పిఐ సిబ్బంది, నేవెల్ యూనిట్ సూపరింటెండెంట్ దుర్గా ప్రసాద్ పర్యవేక్షించారు.

ఈ కార్యక్రమంలో విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించారు. ఎంపికైన విద్యార్థులకు కళాశాల ప్రిన్సిపాల్, నేవల్ యూనిట్ అధికారులు అభినందనలు తెలిపారు.

# ఒక్కసారి దరఖాస్తు చేస్తే.. బాధ్యత నాదే: మంత్రి నిమ్మల

## 129 మందికి రూ.64.65 లక్షల సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ



పాలకొల్లు, సెప్టెంబర్ 21, మనం ప్రతినిధి: పేద, మధ్యతరగతి కుటుంబాలకు వైద్య ఖర్చుల భారం తగ్గించేందుకు ముఖ్యమంత్రి సహాయనిధి (సీఎంఆర్ఎఫ్) అండగా నిలుస్తోందని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. సోమవారం పాలకొల్లులోని తన క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గానికి చెందిన 129 మంది లబ్ధిదారులకు రూ.64.65 లక్షల సీఎంఆర్ఎఫ్ చెక్కులను కూటమి నాయకులతో కలిసి అందజేశారు. సీఎంఆర్ఎఫ్ కోసం ఒక్కసారి తన కార్యాలయానికి వచ్చి దరఖాస్తు చేసుకుంటే, తదుపరి ప్రక్రియను తానే పర్యవేక్షించి మంజూరు అనంతరం లబ్ధిదారులకు చెక్కులు అందిస్తున్నానని తెలిపారు. పాలకొల్లు నియోజకవర్గంలో ఇప్పటివరకు రూ.17.60 కోట్ల సీఎంఆర్ఎఫ్ సాయం అందించినట్లు చెప్పారు. ఆపదలో ఉన్న అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సాయం అందేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ అంగర రాంమోహన్, కూటమి నాయకులు పాల్గొన్నారు.



# గ్రామాల్లో స్వచ్ఛతకు పెద్దపీట వేయాలి

తాడేపల్లిగూడెం సెప్టెంబర్ 21(మనం న్యూస్): గ్రామ పంచాయతీల్లో చెత్త నిర్వహణ కష్టతరంగా మారుతోందని దీని కోసం స్వచ్ఛ భారత్ మిషన్ ఆధ్వర్యంలో గ్రామాలకు ఉచితంగా ఈ ఆటోలు ఇవ్వడం శుభపరిణామం అని తాడేపల్లిగూడెం ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ పేర్కొన్నారు. తాడేపల్లిగూడెం లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వద్ద ఎస్బిఎం ఆధ్వర్యంలో అందించిన గ్రీన్ వెహికల్స్ ( ఎలక్ట్రికల్ ఆటోలు) ఆరుళ్ల, కృష్ణయ్యపాలెం, మాధవరం, బంగారుగూడెం గ్రామాల వాహనాలను ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామాల్లో చెత్త నివాహలకు ప్రజల సహకారం అవసరమని తడిపుడే చెత్తను వేరు చేసి ఇవ్వాలని సూచించారు. ఈ సందర్భంగా నూతన వాహనాలను ఈతకోట తాతాజీ, మద్దిపాటి ధర్మేంద్ర, వర్తనపల్లి కాశి, పుల్ల బాబి, చేతుల మీదుగా ఆటోలు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో వి చంద్రశేఖర్, ఆర్డబ్ల్యూఎస్ ఏఈ రాజా శ్రీనివాస్, పాల్గొన్నారు.

# శంఖవరంలో రోడ్లపై పారుతున్న మురుగునీరు



శంఖవరం సెప్టెంబర్ 21 మనం ప్రతినిధి: మండల కేంద్రమైన శంఖవరం ప్రధాన రహదారులపై మురుగునీరు నిలిచిపోవడంతో స్థానిక ప్రజలు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కొద్దిపాటి వర్షానికే రోడ్లన్నీ చెరువులను తలపిస్తున్నాయి. డ్రైనేజీ వ్యవస్థ సరిగా లేకపోవడం, మురుగు కాలువలు పూడికతో నిండిపోవడంతో నీరు రోడ్లపైకి వచ్చి నిలుస్తోంది. దీనితో రహదారిపై ప్రయాణించే వాహనాలు,బురద నీటిలోనే వెళ్తున్నాయి. గుంతల్లో నీరు నిలిచి ప్రమాదాలకు కారణమవుతుందని, స్థానికులు ఆందోళన చెందుతున్నారు. రోజూ స్కూల్ కి వెళ్లే పిల్లలు, గుడికి వెళ్లే భక్తులు ఈ మురుగు నీటిలోనే నడవాల్సి వస్తోందని వాపోతున్నారు. దుర్వాసనతో పాటు దోమల బెడద పెరిగి రోగాల భయం పట్టుకుందని అంటున్నారు. అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని, తాత్కాలిక మరమ్మతులు కూడా చేయడం లేదని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి డ్రైనేజీలను శుభ్రం చేసి, రోడ్డు మరమ్మతులు చేపట్టాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

# ప్రచారం ప్రారంభించిన కూనపరెడ్డి రంగారావు



నరసాపురం, ఫిబ్రవరి 21 (మనం న్యూస్) : రానున్న స్థానిక సంస్థల ఎన్నికలలో తాను జడ్పిటిసి లేదా ఎంపీపీగా పోటీ చేయనున్నానని ప్రజల ఆశీస్సులతో ఘన విజయం సాధించడం ఖాయమని నరసాపురం మండలం యర్రంశెట్టివారి వారి పాలెం గ్రామ పంచాయతీ మాజీ సర్పంచ్ కూనపరెడ్డి వీర వెంకట విజయ రంగారావు ధీమా వ్యక్తం చేశారు. స్థానిక సంస్థల ఎన్నికల బరిలో ఉన్న రంగారావు సోమవారం నరసాపురం మండలం గొంది గ్రామం నుండి తన ఎన్నికల ప్రచారాన్ని లాంఛనగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో తాను చేసిన అభివృద్ధి కార్యక్రమాలను ఓటర్లకు తెలియజేసే విధంగా కరపత్రాలలో ప్రచురించి పంపిణీ చేస్తున్నానని తెలిపారు. ఈ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పటికీ నరసాపురం మండలం అభివృద్ధికి ఆయా ప్రభుత్వాల నుండి నిధులు మంజూరు చేయించి అభివృద్ధితో పాటు సేవా సంస్థలు, ఎన్ఆర్ఐల ద్వారా సేవా కార్యక్రమాలతో ఎటువంటి రాజీ లేకుండా అభివృద్ధి చేసి సత్తా తనకు ఉందని రంగారావు తెలిపారు. గ్రామ సర్పంచ్ గా గతంలో తాను చేసిన అభివృద్ధి పనులే తనను గెలిపిస్తాయని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

# నిత్యావసర ధరలు తగ్గించడంలో ప్రభుత్వం విఫలం !



తాడేపల్లిగూడెం సెప్టెంబర్ 21 మనం న్యూస్ : నిత్యవసర ధరలను తగ్గించడంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం విఫలం చెందిందని , ప్రజలు వినియోగించే నిత్యావసరాల ధరలు హద్దు, అదుపు లేకుండా పెరుగుతుంటే కూటమి ప్రభుత్వం ఏమి చేస్తుందని నిత్యావసర ధరలు వెంటనే తగ్గించాలని కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కె క్రాంతి బాబు డిమాండ్ చేశారు.

సోమవారం క్రాంతి బాబు మాట్లాడుతూ ఎన్నికల ముందు మాత్రమే ప్రజలకు భారాలు వేయని పాలన అందిస్తామని చెప్పిన కూటమి నేడు అధికారంలోకి వచ్చాక కరెంట్, ఇంటి పన్నులు, బియ్యం, వంట నూనెలు, పంచదార, గ్యాస్, కూరగాయలు ఒక్కసారిగా భారీగా పెంచిందని మండిపడ్డారు. బియ్యం , ఉల్లిపాయలు , నూనె కూరగాయలు నిత్యవసర సరుకులు ధరలను వెంటనే తగ్గించాలని అన్నారు.

# పశ్చిమగోదావరి జిల్లా అథ్లెటిక్స్లో ఎస్వీకెపి డిగ్రీ కళాశాల విద్యార్థుల విజయభేరి

- పలు విభాగాల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు కైవసం



వాసవి పెనుగొండ, మనం న్యూస్: పశ్చిమగోదావరి జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో తణుకులోని ఎస్కేఐఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాల (అటానమస్) వేదికగా నిర్వహించిన జిల్లా స్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో పెనుగొండ ఎస్వీకేపీ అండ్ డాక్టర్ కె.ఎస్. రాజు ఆరట్స్ అండ్ సైన్స్ కళాశాల (అటానమస్) విద్యార్థులు సత్తా చాటారు. వివిధ అథ్లెటిక్స్ విభాగాల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి పలు ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలను సాధించి కళాశాలకు మంచి పేరు తీసుకువచ్చారు.కళాశాలలో డిగ్రీ ప్రథమ సంవత్సరం బీకాం చదువుతున్న జి. సోమేశ్వరరావు మూడు విభాగాల్లో ప్రతిభ కనబరిచి సత్తా చాటారు. 100 మీటర్ల పరుగులో ప్రథమ స్థానం, లాంగ్జంప్లో ప్రథమ స్థానం సాధించడంతో పాటు 200 మీటర్ల పరుగులో ద్వితీయ స్థానం కైవసం చేసుకున్నారు. వేగం, పట్టుదలతో పోటీపడి రెండు విభాగాల్లో అగ్రస్థానాలు సాధించడం విశేషంగా నిలిచింది.అదేవిధంగా డిగ్రీ ప్రథమ సంవత్సరం బీఎస్సీ చదువుతున్న ఎన్.వి. గణేష్ నాలుగు విభాగాల్లో తన ప్రతిభను చాటుకున్నారు. 200 మీటర్ల పరుగులో ప్రథమ స్థానం, 100 మీటర్ల పరుగులో ద్వితీయ స్థానం, లాంగ్జంప్లో ద్వితీయ స్థానం, 400 మీటర్ల పరుగులో తృతీయ స్థానం సాధించారు. పలు విభాగాల్లో ఏకకాలంలో రాణించి కళాశాల క్రీడా ప్రతిభను చాటారు.అలాగే బీకాం విద్యార్థి బి. లక్ష్మీపతిరాజు 400 మీటర్ల పరుగులో, 1500 మీటర్ల పరుగులో ప్రథమ స్థానాలు సాధించి అద్భుత ప్రదర్శన కనబరిచారు. రెండు విభాగాల్లోనూ అగ్రస్థానాలు సాధించడం ద్వారా కళాశాల విజయాల్లో కీలకంగా నిలిచారు.జిల్లా స్థాయి పోటీల్లో కళాశాల విద్యార్థులు సాధించిన విజయాలపై కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వై.వి.వి. అప్పారావు హర్షం వ్యక్తం చేసి విజేతలైన క్రీడాకారులను అభినందించారు. చదువుతో పాటు క్రీడల్లోనూ విద్యార్థులు రాణించడం అభినందనీయమని, క్రీడలు విద్యార్థుల్లో క్రమశిక్షణ, పట్టుదల, ఆత్మవిశ్వాసాన్ని పెంపొందిస్తాయని పేర్కొన్నారు. భవిష్యత్తులో రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లోనూ రాణించి మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.విద్యార్థుల విజయాల పట్ల కళాశాల పాలకవర్గ అధ్యక్షులు తాడి నాగిరెడ్డి, సెక్రటరీ కరస్పాండెంట్ డాక్టర్ కె. రామచంద్ర రాజు,సూపరింటెండెంట్ సంకురాత్రి సూర్యనారాయణ,ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ బి. బాపిరెడ్డి హర్షం వ్యక్తం చేసి క్రీడాకారులను అభినందించారు. విజేతలను అధ్యాపకులు, కళాశాల సిబ్బంది, తోటి విద్యార్థులు అభినందిస్తూ హర్షం వ్యక్తం చేశారు.జిల్లా స్థాయిలో సాధించిన ఈ విజయాలు విద్యార్థులకు మరింత ఉత్సాహాన్ని అందించడంతో పాటు కళాశాలలో క్రీడా ప్రతిభను ప్రోత్సహించేందుకు దోహదపడతాయని కళాశాల యాజమాన్యం పేర్కొంది. రానున్న రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లోనూ ఎస్వీకేపీ కళాశాల విద్యార్థులు మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

# జిన్‌పింగ్‌కు ట్రంప్ ఎర్ర తివాచీ..

**వాషింగ్టన్, సెప్టెంబర్ 21 :** అమెరికా ఆర్థిక వ్యవస్థకు చైనా ముప్పుగా పరిణమించింది. మన పరిశ్రమల్ని నాశనం చేసి మధ్యతరగతిని చిదిమేసింది. తొలిసారి అమెరికా అధ్యక్ష పదవికి పోటీ చేసినప్పుడు ట్రంప్ అన్న మాటలవి. ఆ మాటలతో ప్రభావితమైన అమెరికా ప్రజలు ఆయనకు బ్రహ్మరథం పట్టి అధ్యక్ష పీఠాన్ని కట్టబెట్టారు. కానీ ఇప్పుడు ట్రంప్ మాట మార్చారు. చైనాను, ఆ దేశాధ్యక్షుడు జిన్పింగ్‌ను ఆకాశానికెత్తేస్తున్నారు. ''ఆయన నిజంగా జెంటిల్‌మాన్. ఆయనతో నా అనుబంధం స్నేహపూర్వకంగా, శాంతియుతంగా ఉంటుంది'' అని ట్రంప్ ఇటీవల జిన్‌పింగ్‌ను గురించి అన్న మాటలు మారిన ఆయన వైఖరిని స్పష్టం చేస్తున్నాయి. ఈ క్రమంలోనే చైనా అధినేత బుధవారం అమెరికాలో అధికారిక పర్యటనకు వస్తున్నారు. ఈ సందర్భంగా ట్రంప్ ఆయనకు గురువారం ఘనమైన విందు ఏర్పాటు చేయనున్నారు.

ప్రపంచంపై ఆధిపత్యం కోసం చైనా, అమెరికాల మధ్య సాగుతున్న పోటీ నేపథ్యంలో



ట్రంప్ చూపుతున్న ఔదార్యం చర్చనీయాంశమైంది. చైనా ఉత్పాదక రంగంలో బాగా విస్తరించింది. అమెరికా, జర్మనీ, ఇటలీ, ఫ్రాన్స్, దక్షిణ కొరియా, జపాన్ వంటి దేశాల ఆర్థిక వ్యవస్థలకు సవాలు విసురుతున్న కృత్రిమ మేధ, ఎలక్ట్రిక్ వాహనాలు వంటి రంగాల్లోనూ చైనా దూసుకుపోతోంది. చైనాపై పైచేయి సాధించడంలో విఫలమైన ట్రంప్ ఇప్పుడు ఆ దేశంపై ఔదార్యం ప్రదర్శించడం ప్రారంభించారు. మే నెలలో ఆయన బీజింగ్ సందర్శించారు. అంతర్జాతీయ శిఖరాగ్ర సదస్సుల్లో జిన్‌పింగ్, ట్రంప్‌లు కలిసి మాట్లాడుకున్నారు. చైనా అధినేత రాక కోసం చేసిన సన్నాహాల్లో భాగంగా శ్వేతసౌధం ప్రాంగణంలో హెలిప్యాడ్ నిర్మించారు.

సుంకాలు విధించడం ద్వారా చైనాను లొంగదీసుకునేందుకు ట్రంప్ వేసిన ఎత్తు చిత్తైంది. ఎలక్ట్రానిక్స్‌లో ఉపయోగించే అరుదైన ఖనిజాల ఉత్పాదనలో చైనా గుత్తాధిపత్యం కలిగి ఉంది. ఆ ఆధిపత్యమే ట్రంప్ దిగిరావడానికి ఉపయోగపడింది. ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మెక్రాన్‌ను ట్రంప్ ఎగతాళి చేశారు. ఇరాన్‌పై తాను ప్రారంభించిన యుద్ధాన్ని తప్పుబట్టిన నాటో కూటమి సభ్యులను గద్దించారు. కెనడాకు వ్యతిరేకంగా వాణిజ్య యుద్ధమే ప్రకటించారు. కెనడాను ఆక్రమించుకుని దాన్ని అమెరికా 51వ రాష్ట్రంగా గుర్తింపునిస్తామని పేర్కొన్నారు. తన వింత ప్రకటనలు, విచిత్ర వ్యవహార సరళి కారణంగా అమెరికా కన్నా చైనా మరింత సుస్థిరమైనదన్న భావన ప్రపంచ దేశాల్లో కలిగించారు. ఇది ఆయనకు ఇబ్బందికర పరిస్థితిని సృష్టించింది.

# విద్యార్థి ఆత్మహత్య





## ● సారీ చెప్పిన ఐఐటీ బాంబే

**ముంబై, సెప్టెంబర్ 21 :** ఐఐటీ బాంబేకి చెందిన పవయి క్యాంపస్లో ఓ విద్యార్థి ఆత్మహత్య చేసుకోవడం తీవ్ర నిరసలకు దారితీస్తోంది. ఈ ఘటనపై ఇప్పటికే స్పందించిన ఐఐటీ బాంబే.. తాజాగా క్షమాపణలు చెప్పింది. ఈ ఘటనకు దారితీసిన పరిస్థితులపై దర్యాప్తు జరుగుతోందని చెప్పింది. అతడి మరణానికి సంబంధించిన వివరాలు నిర్ధరణ కాకముందే వెల్లడించడం సరైంది కాదని పేర్కొంది. దర్యాప్తు ప్రారంభానికి ముందే.. సదరు విద్యార్థి పరీక్షలో చాట్జీపీటీని వినియోగించాడని చెప్పినందుకు గానూ క్షమాపణలు తెలియజేస్తున్నట్లు చెప్పింది. అలాగే తమ డైరెక్టర్ శిరీష్ కేదారే రాజీనామా చేయలేదని స్పష్టం చేసింది. ఆయన రాజీనామా కోసం విద్యార్థులు డిమాండ్ చేస్తోన్న విషయం తెలిసిందే.

**ప్రొఫెసర్ తొలగింపు..**

కుల వివక్షతో కూడిన వేధింపులవల్లే తమ కుమారుడు చనిపోయాడని తల్లిదండ్రులు ఆరోపించడంతో ఈ వివాదం మలుపు తిరిగింది. వారి ఫిర్యాదు మేరకు పోలీసులు భారతీయ న్యాయ సంహిత సెక్షన్ 108 (ఆత్మహత్యకు ప్రోత్సాహం), ఎస్సీ,ఎస్టీ వేధింపుల నిరోధక చట్ట నిబంధనల కింద కేసు నమోదు చేశారు. ఆ పరీక్ష సమయంలో ఇన్విజిలేటర్ గా ఉన్న ప్రొఫెసర్ ను డీన్ పోస్ట్ నుంచి విద్యాసంస్థ తొలగించింది. ఈ నిర్ణయం వెంటనే అమల్లోకి వస్తుందని వెల్లడించింది. దర్యాప్తు తర్వాత తదుపరి చర్యలు ఉంటాయని తెలిపింది.

**అసలేం జరిగిందంటే..?**

మహారాష్ట్రలోని యవత్మాల్ జిల్లాకు చెందిన సాహిల్ రవీంద్ర వకోడే ఐఐటీ బాంబేలో 'ఎనర్జీ సైన్స్ అండ్ ఇంజినీరింగ్' విభాగ రెండో సంవత్సర విద్యార్థి. ఇటీవల పరీక్ష హాలులోకి సెల్ఫోన్ తీసుకొచ్చి ప్రశ్నపత్రాన్ని చాట్ జీపీటీలో అప్లోడ్ చేస్తుంటే దొరికిపోయాడని అధికారులు తెలిపారు. అయినప్పటికీ క్రమశిక్షణ చర్యలు తీసుకోలేదని, డిపార్ట్ మెంట్ హెడ్, ఇన్ స్ట్రక్టర్... సాహిల్ను పిలిచి కౌన్సెలింగ్ ఇచ్చి పంపించినట్లు పేర్కొన్నారు. కాగా, శుక్రవారం రాత్రి హాస్టల్ గదిలో సాహిల్ ఆత్మహత్య చేసుకోవడం అనుమానాలకు తావిచ్చింది 'విద్యార్థి మరణం పట్ల మేం తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తున్నాం. ఈ విచారకర సమయంలో మృతుడి స్నేహితులు, కుటుంబసభ్యులకు సానుభూతి ప్రకటిస్తున్నాం. ఘటనకు గల కారణాలపై సంబంధిత అధికారులతో దర్యాప్తు చేస్తున్నాం' అని ఐఐటీ బాంబే శనివారం ప్రకటన విడుదల చేసింది.

# వారం రోజుల్లో ఉక్రెయిన్‌కు రెక్కలు..



## మాస్కోపైదాడి వేళ జెలెన్‌స్కీ సన్నిహితుడి వ్యాఖ్యలు

**కీవ్, సెప్టెంబర్ 21 :** రష్యా-ఉక్రెయిన్ ఘర్షణలు ఇటీవల తీవ్రరూపం దాల్చాయి. రష్యాపై 1600 డ్రోన్లతో ఉక్రెయిన్ విరుచుకుపడింది. దీంతో రాజధాని నగరం మాస్కోలో మంటలు చెలరేగిన దృశ్యాలు వెలుగులోకి వచ్చాయి. మరోవైపు, తాము ఉక్రెయిన్‌లోని146 ప్రాంతాల్లో దాడులు చేసినట్లు రష్యా ప్రకటించింది. రవాణా మౌలిక సదుపాయాలు, ఆయుధ డిపోలు, డ్రోన్ నిల్వ కేంద్రాలు, ఉక్రెయిన్ బలగాలు, విదేశీ కిరాయిసైన్యాన్ని మోహరించిన ప్రాంతాలపై విరుచుకుపడినట్లు చెప్పింది. ఇదిలాఉంటే.. రానున్న రోజుల్లో తమ దేశానికి రెక్కలొస్తాయని ఉక్రెయిన్ పాత్రికేయుడు దిమిత్రో గొర్డన్ వ్యాఖ్యలు చేశారు.

''నాకు కచ్చితంగా తెలుసు. కొద్దిరోజుల్లోనే గొప్ప ఆశను కలిగించేది ఏదో జరుగుతుంది. అదేమిటో చెప్పలేను. అదొక సైనిక రహస్యం. కానీ, వారం లేక రెండు వారాల్లో మన దేశానికి రెక్కలు తొడిగేలా ఏదో ఒకటి జరుగుతుంది'' అని వ్యాఖ్యానించారు. కాగా...రెండు దేశాల మధ్య భీకర దాడులు జరుగుతోన్న సమయంలో రష్యా ప్రజలు అధ్యక్షుడు పుతిన్ పార్టీకి అనుకూలంగా నిలిచినట్లు కనిపిస్తోంది. రష్యాలో యుద్ధకాలంలో జరిగిన మొట్టమొదటి పార్లమెంటరీ ఎన్నికల పోలింగ్ ఆదివారం రాత్రి ముగిసింది. మూడు రోజుల పాటు జరిగిన ఈ ఎన్నికల చివరి రోజున ఉక్రెయిన్ దళాలు రష్యాపై వందల డ్రోన్లతో విరుచుకుపడిన సంగతి తెలిసిందే. 11.1కోట్ల మంది ఓటర్లు ఉండగా.. వారిలో ఇప్పటికీ పూర్తి నియంత్రణలో లేని నాలుగు ఉక్రెయిన్ ప్రాంతాల ప్రజలు, అలాగే 2014లో రష్యా స్వాధీనం చేసుకున్న క్రిమియాలోని ఓటర్లు కూడా ఇందులో పాల్గొనడం గమనార్హం. తమ ఎన్నికల ప్రక్రియకు అంతరాయం కలిగించేందుకే ఉక్రెయిన్ దాడులు చేసిందని రష్యా రక్షణ శాఖ పేర్కొంది.

# అమెరికా నౌకలను టార్గెట్ చేయబోం

## ● హూతీల పొలిటికల్ విభాగం సభ్యుడు మొహమ్మద్ అల్ బుఖైతీ వెల్లడి

**సనా, సెప్టెంబర్ 21 :** సౌదీ అరేబియాపై హూతీ తిరుగుబాటుదారుల దాడులతో పశ్చిమాసియాలో పరిస్థితులు మళ్లీ ఉద్రిక్తంగా మారుతున్నాయి. మరోవైపు హూతీలపై స్వయంగా దాడులకు దిగే అవకాశాలను అమెరికా పరిశీలిస్తోందన్న వార్తలూ వస్తున్నాయి. ఈ నేపథ్యంలో హూతీలు కీలక ప్రకటన చేశారు. ఎర్ర సముద్రంలో అమెరికా నౌకలను లక్ష్యం చేసుకోబోమన్నారు. ఈ విషయంలో ఇప్పటికే అగ్రరాజ్యంతో చర్చలు జరిపినట్లు హూతీల పొలిటికల్ విభాగం సభ్యుడు మొహమ్మద్ అల్ బుఖైతీ వెల్లడించారు. ఇతర దేశాల నౌకల జోలికి కూడా వెళ్లబోమన్నారు.

'సౌదీని మినహాయిస్తే ఈ ఎర్ర సముద్రంలో మరే ఇతర దేశాల నౌకలను లక్ష్యంగా చేసుకోలేదు. ఇకపై చేసుకోము కూడా. ఇతర దేశాలు మాకు వ్యతిరేకంగా సౌదీ అరేబియాతో చేతులు కలపనంత వరకూ మేము ఎవరి జోలికీ వెళ్లము. లేదంటే ఘర్షణను విస్తరించడానికి సిద్ధంగా ఉన్నాం. ఎర్ర సముద్రాన్ని ఏడెన్ గల్ఫ్‌ను కలిపే కీలక సముద్ర



మార్గమైన బాబ్ అల్-మండేబ్ జలసంధిని మూసివేయాలని అనుకోవట్లేదు. యెమెన్ సహా ప్రతి ఒక్కరికీ జలసంధిలో నౌకాయాన స్వేచ్ఛను కల్పించడమే మా లక్ష్యం' అని బుఖైతీ పేర్కొన్నారు.

కాగా.. ఇరాన్ నాగరికతను తుడిచిపెట్టేలా దాడులు చేస్తామంటూ ట్రంప్ చేసిన బెదిరింపులను ఇరాన్ పార్లమెంట్ స్పీకర్ ఘాలిబఫ్ తిప్పికొట్టారు. అగ్రరాజ్యం హద్దు మీరితే భీకర దాడులు చేస్తామని హెచ్చరించారు. టెహ్రాన్ షరతులను వాషింగ్టన్ అంగీకరించే వరకు చర్చల ప్రసక్తే లేదని హర్మూజ్‌లో రాకపోకలను పునరుద్ధరించే అవకాశమే లేదని స్పష్టం చేశారు. తమ దేశంపై దాడులకు అమెరికా మళ్లీ సిద్ధమవుతున్నట్లు తమకు సమాచారం అందిందన్నారు.

# బతుకమ్మ యంగ్ ఫిలిం మేకర్స్ ఛాలెంజ్‌కు మంచి స్పందన



## ఔత్సాహిక ఫిలిం మేకర్స్ విజ్ఞప్తి మేరకు గడువు పొడిగింపు
## జ్యూరీ కమిటీలతో సమావేశంలో నిర్ణయం

**హైదరాబాద్,సెప్టెంబర్ 21(మనం న్యూస్):** బతుకమ్మ యంగ్ ఫిలిం మేకర్స్ ఛాలెంజ్‌కు విశేష స్పందన లభిస్తోంది. ఈ నేపథ్యంలో ఔత్సాహిక ఫిలిం మేకర్స్ విజ్ఞప్తి మేరకు పోటీలో పాల్గొనే గడువును వచ్చే నెల రెండు వరకు పొడిగించారు. ఈ మేరకు సోమవారం ఎఫ్‌డీసీ కార్యాలయంలో తెలంగాణ ఫిల్మ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ దిల్ రాజు, ఎఫ్‌డీసీ మేనేజింగ్ డైరెక్టర్ ఎం. ముకుంద రెడ్డి, ప్రభుత్వ క్రియేటివ్ డైరెక్టర్ కొండా రాజు, జ్యూరీ కమిటీ చైర్మన్ హరీష్ శంకర్ ఆధ్వర్యంలో అన్ని జ్యూరీ కమిటీల సభ్యులతో నిర్వహించిన సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. యువతలోని సృజనాత్మక ప్రతిభను ప్రోత్సహించడంతో పాటు, ఔత్సాహిక ఫిలిం మేకర్స్‌కు తమ ప్రతిభను చాటుకునేందుకు మరింత అవకాశం కల్పించాలనే ఉద్దేశంతో గడువును పొడిగించినట్లు వారు తెలిపారు. ఈ సమావేశంలో మీడియా అకాడమీ చైర్మన్ కె. శ్రీనివాస్ రెడ్డి, తెలంగాణ సాంస్కృతిక సారథి చైర్‌పర్సన్ వెన్నెల గద్దర్, ఎఫ్‌డీసీ ఈడి. కిషోర్ బాబు, బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ మామిడి హరికృష్ణ, విమలక్క, కాసర్ల శ్యామ్, పొన్నం రవిచంద్ర, అనిల్ జీలా ఇతర జ్యూరీ సభ్యులు పాల్గొన్నారు.

# హూతీలపై భారీ దాడికి సిద్ధమవుతున్న అమెరికా!

## ● పశ్చిమాసియా మళ్లీ ఉద్రిక్తం
## ఏదో ఒకటి తేల్చేస్తా: ట్రంప్

**దుబాయ్, సెప్టెంబర్ 21 :** సౌదీ అరేబియాపై హూతీ తిరుగుబాటుదారుల దాడులతో పశ్చిమాసియాలో పరిస్థితులు మళ్లీ ఉద్రిక్తంగా మారుతున్నాయి. హూతీలపై స్వయంగా దాడులకు దిగే అవకాశాలను అమెరికా పరిశీలిస్తోందన్న వార్తలూ వస్తున్నాయి. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ క్యాంప్ డేవిడ్‌లో తన పర్యటనను కుదించుకుని షెడ్యూల్ కంటే ఒక రోజు ముందుగానే శ్వేతసౌధానికి చేరుకోవడం ఈ వార్తలకు మరింత బలాన్నిస్తోంది. హూతీలపై దాడులకు సైనికపరమైన ఎంపికలను క్యాంప్ డేవిడ్ సమావేశంలో ట్రంప్ సమీక్షించినట్లు సీఎన్ఎన్ జాతీయ భద్రతా



విశ్లేషకుడు అలెక్స్ ప్లిట్సాస్ 'ఎక్స్'లో పేర్కొన్నారు.

బ్రిటన్‌లోని రాఫ్ ఫెయిర్‌ఫోర్డ్ బేస్ నుంచి అమెరికాకు చెందిన అత్యాధునిక బీ-1బీ బాంబర్ యుద్ధ విమానం తాజాగా టేకాఫ్ అయింది. అయితే అది ఎక్కడికి వెళ్తోందనేది తెలియరాలేదు.

**ఏదో ఒకటి తేల్చేస్తా; ట్రంప్**

ఇరాన్‌తో యుద్ధం విషయంలో ఇక తాను తుది నిర్ణయం తీసుకోనున్నట్లు ట్రంప్ తెలిపారు. త్వరలో భారీ పరిణామాలు చోటుచేసుకుంటాయన్నారు. హర్మూజ్ జలసంధిని తెరిచేందుకు.. మధ్యవర్తిత్వ దేశమైన ఖతార్ ద్వారా ఏడు షరతులతో కీలక ప్రతిపాదనను అమెరికాకు ఇరాన్ చేరవేసిన నేపథ్యంలో ట్రంప్ ఈ వ్యాఖ్యలు చేశారు. టెహ్రాన్‌తో యుద్ధం గురించి ఏదో ఒకటి తేల్చేస్తానన్నారు. ఇరాన్‌ను పూర్తిగా తుడిచిపెట్టేయడం, ఆ దేశం ఆర్థికంగా చితికిపోయేలా చేయడం లేదా దానితో ఒప్పందం కుదుర్చుకోవడం అనే మూడు ఐచ్ఛికాలపై ట్రంప్ ప్రధానంగా సమాలోచనలు జరుపుతున్నట్లు తెలుస్తోంది.

# పాకిస్థాన్‌లో గణేశ్ ఉత్సవాలు

**కరాచీ, సెప్టెంబర్ 21 :** పాకిస్థాన్‌లోని కరాచీలో ఓ కుటుంబం ఏటా గణేశ్ ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తోంది. ఈసారీ వారు భారీగా వేడుకలు చేస్తున్నారు. క్రిష్ నాయక్ కుటుంబ స్వస్థలం మహారాష్ట్రలోని కొంకణ్ ప్రాంతం. బ్రిటిష్ కాలంలో వీరి కుటుంబ సభ్యులు పాకిస్థాన్‌కు వలస వెళ్లిపోయారు. కరాచీలోనే స్థిరపడిపోయారు. అయినప్పటికీ వారు తమ మూలాలను మర్చిపోలేదు. తమ నివాసంలో మరాఠా సంప్రదాయంలో గణేశోత్సవం నిర్వహిస్తున్నారు. క్రిష్ నాయక్ ఈ పండగను మొదట ప్రారంభించగా ఆ తర్వాత రాజేశ్ కృష్ణ నాయక్, ముకేశ్ నాయక్ ఈ సంప్రదాయాన్ని కొనసాగిస్తున్నారు. కుటుంబ



సభ్యులందరూ కలిసి ఇంట్లోనే బొజ్జ గణపయ్య ప్రతిమను తయారు చేస్తారు. ఈ ఏడాది 5 అడుగుల విగ్రహాన్ని తమ ఇంట్లో ప్రతిష్ఠించి పూజలు చేస్తున్నారు. నాయక్ కుటుంబం తమ ఇంట్లో ప్రతిష్ఠించిన విగ్రహాన్ని నిమజ్జనం కోసం ఐదో అంతస్తు నుంచి కిందకు తీసుకొస్తున్నప్పుడు స్థానిక ముస్లింలు వారికి సహాయం చేశారు. నిమజ్జనాన్ని తిలకించేందుకు స్థానిక ముస్లింలు హాజరు కావడం విశేషం. కరాచీలో సుమారు 150 మరాఠీ కుటుంబాలు నివసిస్తున్నాయి.

## పశ్చిమాసియా ఘర్షణలు..

# ఇరాన్ అధ్యక్షుడి బృందానికి వీసాల నిరాకరణ

**వాషింగ్టన్, సెప్టెంబర్ 21 :** అమెరికా-ఇరాన్ మధ్య దౌత్యపరమైన అంశాల్లో కీలక పరిణామాలు చోటుచేసుకుంటున్నాయి. మంగళవారం ఐరాస సమావేశం కోసం అమెరికా వెళ్లనున్న ఇరాన్ అధ్యక్షుడు పెజెష్కియాన్ వెంట వచ్చే బృందం మొత్తానికి వీసాలు ఇచ్చేందుకు అమెరికా నిరాకరించింది. దాంతో అనుకున్నదానికంటే తక్కువమంది ప్రతినిధులతో పెజెష్కియాన్ యూఎస్ పర్యటనకు వెళ్లనున్నారు. ఈ మేరకు అంతర్జాతీయ మీడియా కథనాలు వెల్లడించింది.

ఈ వారం న్యూయార్క్‌లో ఐక్యరాజ్యసమితి సర్వప్రతినిధి సభ (యూఎన్జీఏ) 81వ



సమావేశాలు జరగనున్నాయి. సభలో ఇరాన్ అధ్యక్షుడు ప్రసంగించనున్నారు. ఈ సందర్భంగా పలు దేశాల నేతలు, ప్రతినిధులతో సమావేశం కానున్నారు.

పరిమితస్థాయి బృందంతోనే అధ్యక్షుడు యూఎన్ సమావేశానికి వెళ్తారని ఇరాన్ అధ్యక్ష కార్యాలయం వెల్లడించింది. పశ్చిమాసియా యుద్ధం , ఇరాన్‌పై అమెరికా చర్యలపై ఆయన మాట్లాడనున్నారని పేర్కొంది. ఇక, ఇరాన్ బృందంపై అమెరికాలో ప్రయాణ ఆంక్షలు ఉంటాయని, విలాస వస్తువులు, ఇతర వస్తువుల కొనుగోలుపై నిషేధం ఉంటుందని ఇప్పటికే అగ్రరాజ్యం వెల్లడించింది.

# ఇటలీలో విదేశీ విద్యార్థుల సంఖ్యపై పరిమితి..

## త్వరలోనే ప్రతిపాదన

**రోమ్, సెప్టెంబర్ 21 :** ఇటలీ తరగతి గదుల్లో విదేశీ విద్యార్థుల సంఖ్యపై పరిమితులను తీసుకురావడంతో పాటు పాఠశాలల్లో బుర్ఖా, నిఖాబ్ ధరించడాన్ని నిషేధించేందుకు ప్రభుత్వం సిద్ధమైంది. ఈ మేరకు



ప్రధాని జార్జియా మెలోని కీలక వ్యాఖ్యలు చేశారు. దీనిపై త్వరలో మంత్రివర్గం ముందుకు ప్రతిపాదన తీసుకురానున్నట్లు తెలిపారు. విదేశీ విద్యార్థులు అధికంగా ఉన్న తరగతుల్లో భాషా పరమైన ఇబ్బందులు తలెత్తుతున్నాయని మెలోని పేర్కొన్నారు. ఇటాలియన్ పిల్లలు తమ తరగతుల్లో మైనారిటీలుగా భావించే పరిస్థితి రాకూడదని తెలిపారు.

అయితే తరగతికి ఎంతమంది విదేశీ విద్యార్థులను అనుమతించాలనే దానిపై మెలోని స్పష్టమైన సంఖ్యను వెల్లడించలేదు. ప్రస్తుతం ఇటలీలోని పాఠశాలల్లో విదేశీ విద్యార్థులకు సంబంధించి 30 శాతం పరిమితి అమల్లో ఉంది. కొత్త ప్రతిపాదన అమల్లోకి రావాలంటే మంత్రివర్గం, తర్వాత పార్లమెంట్ ఆమోదం కూడా అవసరం. ఇటాలియన్ భాష అర్థంకాని విదేశీ విద్యార్థులు.. తోటి విద్యార్థులు, ఉపాధ్యాయుల సహకారంతో త్వరగా నేర్చుకోవాలని మెలోని సూచించారు. అలాగే వారి తల్లిదండ్రులూ భాషా పరమైన ఇబ్బందులు లేకుండా ఉండేందుకు ఇటాలియన్ నేర్చుకోవడం తప్పనిసరి చేయాలని ప్రభుత్వం ప్రతిపాదిస్తోంది.

# అఫ్గానిస్థాన్‌పై పాక్ వైమానిక దాడులు..

## ● 28 మంది మృతి..!

**ఇస్లామాబాద్, సెప్టెంబర్ 21 :** అఫ్గానిస్థాన్‌పై సోమవారం పాకిస్థాన్ వైమానిక దాడులకు పాల్పడింది. ఈ దాడుల్లో 28 మంది ఉగ్రవాదులు మరణించినట్లు పాక్ ప్రకటించగా ముగ్గురు పౌరులు ప్రాణాలు కోల్పోయారని అఫ్గాన్ వెల్లడించింది. గత కొన్ని నెలలుగా ఈ రెండు దేశాల మధ్య జరుగుతోన్న ఘర్షణల్లో ఇప్పటికే వందల సంఖ్యలో మరణాలు చోటుచేసుకున్న సంగతి తెలిసిందే. తాజా వైమానిక దాడులు అఫ్గానిస్థాన్‌లోని కునార్, పక్తికా, ఖోస్త్ ప్రావిన్సులను లక్ష్యంగా



చేసుకున్నాయని కాబూల్ అధికారులు వెల్లడించారు. దాడుల్లో పలు నివాసాలు ధ్వంసమయ్యాయన్నారు.

పాక్ వైమానిక దాడులను తాలిబన్ ప్రధాన ప్రతినిధి జబీవుల్లా ముజాహిద్ తీవ్రంగా ఖండించారు. రోజురోజుకూ ఇస్లామాబాద్ దురాక్రమణలు పెరిగిపోతున్నాయని దుయ్యబట్టారు. దీనికి ప్రతీకారం తీర్చుకుంటామన్నారు. ఇటీవల పాకిస్థాన్‌లో జరిగిన పలు ఉగ్రదాడులకు ప్రతిస్పందనగా.. అఫ్గానిస్థాన్ దాడులు చేపడతామని ఆ దేశ సమాచార మంత్రిత్వ శాఖ హెచ్చరించింది. ఈ నేపథ్యంలోనే దాడులు చోటుచేసుకున్నాయి.

## మా ఖబరస్థాన్ భూమిని
# మాకు చూపించండి
### ఆర్డీవోకు వినతి పత్రం అందజేసిన ముస్లిం సోదరులు



**సూర్యాపేట, సెప్టెంబర్ 21 (మనం ప్రతినిధి):** గాంధీనగర్ గ్రామానికి చెందిన ముస్లిం సోదరుల కవరస్తాన్ కోసం కేటాయించిన రెండెకరాల స్థలాన్ని చూపించాలని కోరుతూ గాంధీనగర్ గ్రామ ముస్లిం నాయకులు సోమవారం ఆర్డీవో, తహసిల్దార్లను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ... సూర్యాపేట జిల్లా కేంద్రంలోని పిల్లలమర్రి గ్రామ శివారు 349 సర్వే నెంబర్లో 3.19 ఎకరాల స్థలంలో 2018 జూన్ లో గాంధీనగర్ గ్రామం ముస్లిం సోదరుల ఖబరస్థాన్ కోసం రెండెకరాల స్థలాన్ని, క్రిస్టియన్ సోదరుల కోసం 1.19 స్థలాన్ని కేటాయిస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశాడన్నారు. అనంతరం తాము కొంత ఆర్థిక ఇబ్బందుల వల్ల దానికి చుట్టూ ప్రహరీ గోడ కట్టలేకపోయామన్నారు. ప్రస్తుతం శ్రీకృష్ణదేవరాయ ట్రస్ట్ వారు ఆ స్థలం మాదంటూ నిర్మాణాలు చేస్తున్నారని ఈ విషయ మై అధికారులు తగిన విచారణ చేసి మా ఖబరస్థాన్ స్థలం మాకు అప్పగించి న్యాయం చేయాల్సిందిగా విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో మహమ్మద్ జలీల్, మహమ్మద్ రహమాన్, షేక్ రఫీ, షేక్ నజీర్, అబ్దుల్ నబీ, ఎండి నయీం, మహమ్మద్ రహీం, రసూల్, చాంద్ పాషా, మహమ్మద్ వజీద్ తదితరులు ఉన్నారు.

# ప్రజావాణి దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలి



**సూర్యాపేట, సెప్టెంబర్ 21 (మనం ప్రతినిధి):** ప్రజల సమస్యల పరిష్కారమే వేదికగా సాగుతున్న ప్రజావాణి కార్యక్రమానికి అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అధికారులను ఆదేశించారు. సోమవారం సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి అనంతరం జిల్లా అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో మాట్లాడుతూ...ప్రతి సోమవారం జరుగు ప్రజావాణి కి జిల్లా స్థాయి అధికారులు తప్పనిసరిగా హాజరు కావాలని తెలిపారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా. మండల స్థాయి ప్రజావాణి దరఖాస్తులను తప్పనిసరిగా ఆన్లైన్ పోర్టల్లో నమోదు చేయాలని స్పష్టం చేశారు. ప్రజావాణి పోర్టల్లో ఇంకా పరిష్కారం కాకుండా ఉన్న దరఖాస్తులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. కొత్తగా అందుతున్న దరఖాస్తులను ఎప్పటికప్పుడు పోర్టల్లో నమోదు చేయాలని సూచించారు. ముఖ్యంగా రాష్ట్ర ప్రజావాణిలో పెండింగ్లో ఉన్న దరఖాస్తులను తక్షణమే పరిష్కరించేలా సంబంధిత శాఖల అధికారులు ప్రత్యేక చొరవ చూపాలని ప్రతి అధికారి తమ లాగిన్ లో ఉన్న పెండింగ్ దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని లేకుంటే వారిపై చర్యలు తీసుకోవడం జరుగుతుందని పేర్కొన్నారు. ప్రజలు పెట్టుకున్న అర్జీలను పెండింగ్లో ఉంచకుండా, నిర్ణీత గడువులోగా వాటిని పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని అన్నారు.మండల స్థాయిలో ప్రారంభమైన ప్రజావాణి కి అన్ని శాఖల మండల స్థాయి అధికారులు తప్పనిసరిగా హాజరయ్యేలా జిల్లా అధికారులు పర్యవేక్షించాలని ఆదేశించారు. మండల స్థాయి సమస్యలు స్థానికంగానే పరిష్కారమైతే ప్రజలకు ఇబ్బందులు తప్పుతాయని వెల్లడించారు సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమం లో భూ సమస్యలకి, రెవిన్యూ కి సంబంధించి 56 దరఖాస్తులు, డిపిఓ 4, డిడబ్ల్యూ ఓ 7, మునిసిపల్ 4, ఆర్ డి ఓ లు 6, మిగిలిన 21 దరఖాస్తులు వివిధ శాఖలకి చెందినవని, మొత్తం 98 దరఖాస్తులు వచ్చాయాని వాటిని పరిష్కరించేందుకు శాఖల వారీగా పంపించటం జరిగిందని కలెక్టర్ అన్నారు.

**అభినందనలు తెలిపిన కలెక్టర్...**

కోదాడ జాబ్ మేళాలో పనిచేసిన అదనపు కలెక్టర్, డిఆర్ఓ, సిఈఓ జడ్పి జిఎం ఇండస్ట్రీస్, డిపిఓ, డిపిఆర్ఓ, డిఐఈఓ, ఫైర్, ట్రాన్స్పోర్ట్, మున్సిపల్ కమిషనర్, ఆర్డీవోలు సంబంధిత శాఖల అధికారులను, సిబ్బందికి కలెక్టర్ తేజస్ మందులాల్ పవర్ ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమానికి అదనపు కలెక్టర్ బి. హరి సింగ్, డిఆర్ఓ ప్రేమ్ రాజ్, జిల్లా పరిషత్ సీఈఓ శిరీష, డిఆర్డిఓ పిడి సన్యాసయ్య, డిఎంహెచ్వో వెంకటరమణ, డిఏఓ శ్రీధర్ రెడ్డి, డిఎస్ఓ మోహన్ బాబు, డిడబ్ల్యూఓ నరసింహారావు, మున్సిపల్ కమిషనర్ హనుమంత్ రెడ్డి జిల్లా అధికారులు తదితరులు హాజరయ్యారు.

## రైతులకు నీళ్లివ్వమంటే
# అరెస్టులు చేస్తుండ్రు?



- ఎండిపోతున్న పంటలకు నీళ్లివ్వాలని కోరిన రైతులు
- బీఆర్ఎస్ నేతలను అక్రమంగా నిర్బంధించిన్రు?.. సీఎం రేవంత్ రెడ్డిది రాక్షస మనస్తత్వం
- అరెస్ట్ చేసిన వారిని విడుదల చేయండి.. పంటలకు నీళ్లు ఇవ్వండి
- రేవంత్ రెడ్డి ప్రభుత్వంపై కేటీఆర్ ఫైర్

**హైదరాబాద్, సెప్టెంబర్ 21, మనం ప్రతినిధి:** ఈ దుష్ట కాంగ్రెస్ ప్రభుత్వం రాకతో.. తెలంగాణ రాష్ట్రంలో పలు జిల్లాల్లో పంటలు ఎండిపోతున్న సంగతి తెలిసిందే. ఆరుగాలం కష్టం నుంచి పంట వేస్తే? ఎండిపోతున్న పంటలను కాపాడేందుకు జూరాల ప్రాజెక్టు నుంచి సాగునీరు విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ రైతులు ఆందోళన బాట పట్టారు. వారికి మద్దతుగా ఆందోళన చేపట్టిన రైతులు, బీఆర్ఎస్ నేతలను అరెస్ట్ చేయడంపై ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాల్సింది పోయి, బీఆర్ఎస్ శ్రేణులను అణచివేసేందుకు రేవంత్ రెడ్డి ప్రభుత్వం కుట్ర పన్నుతోందని ఆయన ఆరోపించారు. ఈ మేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లాకు చెందిన మాజీ మంత్రులు నిరంజన్ రెడ్డి, లక్ష్మారెడ్డి, శ్రీనివాస్ గౌడ్తో పాటు పలువురు మాజీ ఎమ్మెల్యేలు, వందలాది మంది రైతులను పోలీసులు అక్రమంగా అరెస్ట్ చేశారని కేటీఆర్ ఆరోపించారు. ప్రభుత్వ వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకే ఈ అరెస్టులకు పాల్పడుతున్నారని, ఇది ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాక్షస మనస్తత్వానికి నిదర్శనమని ఆయన తీవ్రంగా విమర్శించారు. జూరాల ప్రాజెక్టులో 9 టీఎంసీల నీరు అందుబాటులో ఉన్నప్పటికీ, ప్రభుత్వం నీటిని విడుదల చేయకపోవడంతో పంటలు ఎండిపోతున్నాయని కేటీఆర్ ఆవేదన వ్యక్తం చేశారు. పంటలను కాపాడుకోవడానికి ప్రాజెక్టు గేట్లు ఎత్తేందుకు ప్రయత్నించిన రైతులపై తప్పుడు కేసులు బనాయిస్తున్నారని ఆయన మండిపడ్డారు. రైతులు ప్రాజెక్టు వద్దకు వెళ్లకుండా బారికేడ్లు ఏర్పాటు చేసి, భారీగా పోలీసులను మోహరించడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. అరెస్ట్ చేసిన బీఆర్ఎస్ నేతలను, రైతులను వెంటనే విడుదల చేసి, జూరాల ఆయకట్టుకు తక్షణమే సాగునీరు అందించాలని కేటీఆర్ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

# అక్రమ రవాణాపై ఉక్కుపాదం



గనులు, భూగర్భ వనరుల శాఖపై సీఎస్ సమీక్ష..

**విజిలెన్స్ బృందాలతో నిరంతరం తనిఖీలు, దాడులు నిర్వహించాలని స్పష్టీకరణ**

**పదోన్నతుల ప్రక్రియను వేగవంతం చేయాలని అధికారులకు సూచన**

**ప్రభుత్వ ఆదాయాన్ని పెంచేలా సమర్థవంతమైన చర్యలు చేపట్టాలని ఉద్ఘాటన**

**హైదరాబాద్,సెప్టెంబర్ 21 (మనం న్యూస్):** రాష్ట్రంలో అక్రమ ఇసుక రవాణా, అనధికార ఖనిజాల తరలింపుపై ప్రభుత్వం ఉక్కుపాదం మోపనుంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు సోమవారం రాష్ట్ర సచివాలయంలో గనులు, భూగర్భ వనరుల శాఖపై ఉన్నతాధికారులతో ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. శాఖ పనితీరు, ఆదాయ సమీకరణ, పరిపాలనా అంశాలు, సిబ్బంది నియామకాలు తదితర కీలక అంశాలపై ఆయన సమగ్రంగా మథనం జరిపారు. రాష్ట్రంలో అక్రమ ఇసుక రవాణా, అక్రమ తవ్వకాలు, అనధికారిక ఖనిజాల తరలింపును పూర్తిగా అరికట్టాలని సీఎస్ స్పష్టం చేశారు. అక్రమ కార్యకలాపాలు జరిగే సున్నిత ప్రాంతాలను గుర్తించి నిరంతరం నిఘా ఉంచాలని సీఎస్ అధికారులను ఆదేశించారు. విజిలెన్స్ బృందాలతో ఆకస్మిక తనిఖీలు, దాడులు చేపట్టి అక్రమ రవాణాకు తక్షణమే అడ్డుకట్ట వేయాలని సూచించారు. ఎక్కడి నుంచైనా ఫిర్యాదులు వస్తే క్షణాల వ్యవధిలో స్పందించి, నిబంధనలు ఉల్లంఘించే వారిపై ఎలాంటి మొహమాటం లేకుండా కఠిన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సీఎస్ తేల్చిచెప్పారు.

**పదోన్నతుల ప్రక్రియ వేగవంతం..**

గనులు, భూగర్భ వనరుల శాఖ ద్వారా ప్రభుత్వ ఆదాయాన్ని గణనీయంగా పెంచేందుకు తగిన కార్యాచరణ రూపొందించాలని సీఎస్ ఆదేశించారు. శాఖలో ఖాళీగా ఉన్న పోస్టుల భర్తీ, ఉద్యోగుల పదోన్నతులకు సంబంధించిన ప్రక్రియను నిబంధనల మేరకు వేగవంతం చేయాలని ఆయన సూచించారు. సిబ్బంది కొరత వల్ల శాఖ కార్యకలాపాలకు ఎక్కడా అంతరాయం కలగకూడదని స్పష్టం చేశారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని పూర్తి స్థాయిలో వినియోగించి పర్యవేక్షణ వ్యవస్థను మరింత బలోపేతం చేయాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు.ఈ సమీక్షా సమావేశంలో మైన్స్ అండ్ జియాలజీ శాఖ కార్యదర్శి రఘునందన్ రావు, విజిలెన్స్ అండ్ ఎన్ఫోర్స్మెంట్ డైరెక్టర్ జనరల్ డి.ఎస్.చౌహాన్, ఐటీఈఅండ్‌సీ సంయుక్త కార్యదర్శి, మైన్స్ డైరెక్టర్ అనుదీప్ పాల్గొన్నారు.

## మార్చురీలో మృతదేహంపై
# ఎలుకల దాడి

- మానవ హక్కుల కమిషన్ సుమోటోగా విచారణ
- పత్రికల్లో వచ్చిన కథనాలపై తీవ్రంగా స్పందించిన టీజీహెచ్ఆర్సీ
- కోల్ స్టోరేజ్, పారిశుధ్య లోపాలపై వరంగల్ జిల్లా కలెక్టర్‌కు సమగ్ర నివేదిక సమర్పించాలని ఆదేశం
- తదుపరి విచారణను వచ్చే నెల 27కి వాయిదా వేసిన కమిషన్

**హైదరాబాద్, సెప్టెంబర్ 21 (మనం న్యూస్):** వరంగల్ జిల్లా వర్ధన్నపేట ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి మార్చురీలో రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన వ్యక్తి మృతదేహాన్ని ఎలుకలు కొరికిన ఘటనపై తెలంగాణ మానవ హక్కుల కమిషన్ తీవ్రంగా స్పందించింది. పత్రికల్లో ప్రచురితమైన వార్తా కథనాలను సుమోటోగా స్వీకరించిన కమిషన్ ఛైర్‌పర్సన్ డాక్టర్ జస్టిస్ షమీమ్ అక్తర్, దీనిపై సమగ్ర విచారణకు ఆదేశించారు. మృతదేహాలకు తగిన గౌరవం, రక్షణ కల్పించడంలో వైఫల్యంపై ఆందోళన వ్యక్తం చేశారు.ప్రముఖ పత్రికల్లో ప్రచురితమైన వార్తలను కమిషన్ పరిశీలించింది. రాయపర్తి మండలానికి చెందిన గారె వీరయ్య (55-58) రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా, ఆయన భౌతికకాయాన్ని వర్ధన్నపేట ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి మార్చురీ గదిలో రాత్రంతా ఉంచారు.

మరుసటి రోజు ఉదయం మృతదేహంపై, ముఖ్యంగా కంటి భాగంలో ఎలుకలు కొరికినట్లుగా గుర్తులు కనిపించడంతో బంధువులు, స్థానికులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. మార్చురీలో ఫ్రీజర్ సౌకర్యం లేకపోవడం, విద్యుత్ అంతరాయం, పారిశుద్ధ్య లోపాలు, ఎలుకల బెడద వంటి అంశాలపై కథనాల్లో వెల్లడైన విషయాలను కమిషన్ తీవ్రంగా పరిగణించింది.

**కలెక్టర్ నుంచి నివేదిక కోరిన కమిషన్..**

మృతదేహానికి గౌరవప్రదమైన రీతిలో సంరక్షణ కల్పించడం ప్రభుత్వ ఆసుపత్రుల కనీస బాధ్యత అని కమిషన్ స్పష్టం చేసింది. ఈ నేపథ్యంలో వరంగల్ జిల్లా కలెక్టర్ నుండి సమగ్ర నివేదిక సమర్పించాలని ఆదేశించింది. మార్చురీలో ఫ్రీజర్, విద్యుత్ సదుపాయాల లభ్యత, ఎలుకల నివారణకు తీసుకుంటున్న చర్యలు, ఘటనకు దారితీసిన పరిస్థితులు, బాధ్యులైన సిబ్బంది వివరాలతో పాటు భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా తీసుకుంటున్న చర్యలను నివేదికలో పొందుపరచాలని స్పష్టం చేసింది. ఈ కేసుకు సంబంధించి నివేదిక సమర్పణను అక్టోబర్ 27,కి కమిషన్ విచారణకు ఉంచింది.

# గుప్త నిధుల తవ్వకాల నిందితుల అరెస్టు



**పెన్ పహాడ్ సెప్టెంబర్ 21 (మనం న్యూస్):** మండలంలోని అనాజిపురం గ్రామ ఆవాసం రాజుపేట గ్రామంలో పురాతన మసీదులో గుప్త నిధుల కొరకు అక్రమ తవ్వకాల కోసం ప్రయత్నం చేసిన 13 మందిలో 12 మందిని అరెస్ట్ చేసి పోలీసులు సోమవారం అదుపులోకి తీసుకొని రూరల్ సీఐ రాజశేఖర్ వద్ద హాజరు పరిచగా మరో వ్యక్తి పరారీలో ఉన్నట్లు ఎస్సై నేనావత్ బాలు నాయక్ తెలిపారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్థానిక పోలీస్ స్టేషన్ పరిధిలోని అనాజిపురం ఆవాసం రాజుపేట గ్రామంలోని పురాతన, చారిత్రాత్మక దర్గా (మసీదు) లో ఈనెల 16న రాత్రి వేళల్లో కొందరు వ్యక్తులు ఆ దర్గాలో దాగి ఉన్న గుప్త నిధి కోసం తవ్వకాలు జరుపుతున్నట్లు గమనించి నిధుల కోసం అక్రమంగా తవ్వకాలు చేస్తున్న కొంత మందిని గ్రామస్తులు గుర్తించి తమకు సమాచారం అందించారని వెంటనే పోలీసు వారు వెళ్ళి సంఘటనవద్ద ఎ పి -16-డి ఆర్ -5256 నంబర్ గల కారు, రెండు బైక్లలో వచ్చిన కొందరు వ్యక్తులు దర్గా ఆవరణలోకి చట్టవిరుద్ధంగా ప్రవేశించి, అక్కడ తవ్వకాలు జరుపుతూ దర్గాకు నష్టం కలిగిస్తు అనుమానాస్పదంగా తవ్వకాలు చేస్తున్న వ్యక్తులను గుర్తించి 10 మందిని పోలీస్ స్టేషన్ కు తరలించగ మరో ముగ్గురు పరారీలో ఉన్నారు మరుసటి రోజే వెల్లడించడం జరిగిందని తెలిపారు.

ఈ ఘటనపై అనంతారం గ్రామంలో జి పి ఓ గా పనిచేస్తున్న పెరుమళ్ల పిచ్చమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి,దర్యాప్తు కొనసాగిస్తు సూర్యాపేట రూరల్ సి ఐ జి.రాజశేఖర్ ఆద్వర్యంలో12 మంది నిందితులను అదుపులోకి తీసుకుని ఈ రోజు అరెస్ట్ చేయటం జరిగినదని ,మరో వ్యక్తి పరారీ లో ఉన్నారని తెలిపారు ఈ సందర్భంగా నిందితుల వివరాలు వెల్లడించారు వారు దొంగరి మధన్ (దోసపహాడ్) షేక్ సైదా (దోసపహాడ్), సయ్యద్ అమీర్ అలీ (కాసరాబాద్),షేక్ రహమాన్ (నందిగామ), షేక్ అహమ్మద్ (నందిగామ), షేక్ మహ్మద్ రఫీ( నందిగామ ), మైనుద్దీన్ (నందిగామ), మహ్మద్ సుల్తానా మియా (నారాయణపూర్) జార్ఖండ్ రాష్ట్రం, మహమ్మద యాసిర్ ఖి/గా సిరాజ్ అన్సారీ (నారాయణపూర్ జార్ఖండ్ రాష్ట్రా),పి. మీనయ్య (రాజీవ్ నగర్, దురాజ్పల్లి),సయ్యద్ అక్బర్ (దోసపహాడ్), రూపాని వెంకన్న (దూరాజ్ పల్లి), అదుపులోకి తీసుకోగా కాసరబాధకు చెందిన కొమరరాజు నరసింహ పరారీలో ఉన్నట్లు తెలిపారు స్వాదీన పరుచుకున్న వివరాలు కార్, 2 బైక్ లు,1 స్కూటీ,2 పారలు,2 టెంకలు, 12 సెల్ ఫోన్ లు స్వాధీనపరుచుకున్నారు ప్రజలు గుప్త నిధుల పేరుతో జరిగే మోసాలను నమ్మవద్దని, ఇలాంటి కార్యకలాపాలపై వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సీఐ రాజశేఖర్ సూచించారు...

# దరఖాస్తులన్నిటిని వారం రోజుల్లో పరిష్కరిస్తాం



**నల్లగొండ, సెప్టెంబర్ 21(మనం ప్రతినిధి):** నల్లగొండ జిల్లాలో ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగంగా పెండింగ్లో ఉన్న దరఖాస్తులు, విచార పూర్తయినవి ఇంకా విచారించవలసినవి డిస్పోజల్ స్టేటస్కు సంబంధించిన పనులను వారం రోజుల్లో పూర్తి చేస్తామని జిల్లా కలెక్టర్ బి.చంద్రశేఖర్ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారికి వివరించారు. సోమవారం హైదరాబాద్ నుండి రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి అన్ని జిల్లాల కలెక్టర్లతో ఎస్ఐఆర్ ప్రక్రియపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. జిల్లాలో సర్ పురోగతిని జిల్లా కలెక్టర్ వివరిస్తూ... జిల్లాలో ఎస్ఐఆర్కు సంబంధించి పెండింగ్లో ఉన్న దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నామని , పెండింగ్ ఫారాల పరిష్కారం వేగంగా పూర్తి చేస్తామని వివరించారు. అంతకుముందు రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ... అన్ని జిల్లాల్లో ఎస్ఐఆర్ ప్రక్రియలో పెండింగ్లో ఉన్న దరఖాస్తులను త్వరితగతిన డిస్పోజల్ చేయాలని కలెక్టర్లను ఆదేశించారు. కంప్యూటర్లో డేటా నమోదు సమయంలో ఎలాంటి తప్పులు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. వెరిఫికేషన్కు బదులుగా అవసరమైన చోట డిక్లరేషన్ తీసుకోవాలని తెలిపారు.ఫామ్-6, ఫామ్-7, ఫామ్-8లకు సంబంధించిన దరఖాస్తుల విచారణ సమయంలో అన్ని వివరాలను క్షుణ్ణంగా పరిశీలించాలని చెప్పారు. ఎస్ఐఆర్‌కు సంబంధించిన పనులన్నింటినీ అక్టోబర్ 2వ తేదీలోగా పూర్తి చేయాలని, సూపర్వైజర్లు, బీఎల్ఓలు వారికి కేటాయించిన లక్ష్యాలను పూర్తిచేయాలని ఆదేశించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో రెవిన్యూ అదనపు కలెక్టరేట్ జే. శ్రీనివాస్ ,జిల్లా రెవెన్యూ అధికారి దశరథ , భూసేకరణ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రమాదేవి , తదితరులు హాజరయ్యారు.

# దేశానికి ఇంజనీరింగ్ రంగమే వెన్నెముక

- ఆసియా ఖండంలోనే ముత్యాల నగరంలో నంబర్-1 శిక్షణా కేంద్రం
- ఎస్కీ డెరెక్టర్ కల్నల్ హర్ పాల్ సింగ్ గ్రేవల్ వెల్లడి
- ఎస్కీలో ఘనంగా నేషనల్ ట్రేనింగ్ ప్రోగ్రామ్స్ ప్రారంభం
- వివిధ రాష్ట్రాల నుంచి తరలివచ్చిన 140 మంది ఇంజనీర్లు



**హైదరాబాద్,సెప్టెంబర్ 21 (మనం న్యూస్):** దేశానికి ఇంజనీరింగ్ రంగమే వెన్నెముక అని... మారుతున్న కాలానికి అనుగుణంగా సాంకేతికతను అందిపుచ్చుకుంటూ అద్భుతాలు సృష్టిస్తున్న ఆసియా ప్రసిద్ధ శిక్షణా సంస్థ 'ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా' (ఎస్కీ) గత నాలుగున్నర దశాబ్దాలుగా దేశ ప్రగతిలో కీలక పాత్ర పోషిస్తోందని ఆ సంస్థ డైరెక్టర్ కల్నల్ హర్ పాల్ సింగ్ గ్రేవల్ వెల్లడించారు.సోమవారం హైదరాబాద్‌లోని ఎస్కీ కన్వెన్షన్ సెంటర్‌లో మేనేజ్మెంట్, టెక్నాలజీ, పవర్ అండ్ ఎనర్జీ తదితర డివిజన్‌ల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రతిష్టాత్మక శిక్షణా కార్యక్రమాలను ఆయన జ్యోతి వెలిగించి లాంఛనంగా ప్రారంభించారు. దేశంలోని నలుమూలల నుంచి వివిధ రంగాలకు ప్రాతినిధ్యం వహిస్తూ సుమారు 140 మంది ఇంజనీర్లు ఈ శిబిరానికి హాజరయ్యారు.

**ప్రభుత్వ రంగ దిగ్గజాల నమ్మకం.. ఎస్కీ..**

ఈ సందర్భంగా డైరెక్టర్ మాట్లాడుతూ... యూనిసెఫ్, ఫ్యాన్సా వంటి అంతర్జాతీయ సంస్థల ప్రశంసలు పొందిన ఘనత ఎస్కీ సొంతమన్నారు. దేశ ప్రజల జీవన ప్రమాణాలను మార్చే కేంద్ర ప్రభుత్వ అత్యున్నత ప్రాజెక్టులైన జల్ జీవన్ మిషన్, మినిస్ట్రీ ఆఫ్ రోడ్ అండ్ ట్రాన్స్పోర్ట్, పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్, ఎన్ఎండీసీ, మధ్యప్రదేశ్ పబ్లిక్ వర్క్స్ డిపార్ట్‌మెంట్, చివరికి దేశ అత్యున్నత ఆడిట్ సంస్థ అయిన కాగ్ సిబ్బంది సైతం ఇక్కడికే వచ్చి శిక్షణ పొందడం ఈ సంస్థకున్న విశ్వసనీయతకు నిదర్శనమని కల్నల్ స్పష్టం చేశారు.

**అకడమిక్ జ్ఞానంతో పాటు నగర విహారం..**

విషయ పరిజ్ఞానంలో ఆరితేరిన సీనియర్ ఫ్యాకల్టీ ఆధ్వర్యంలో 3 నుండి 5 రోజుల పాటు జరిగే కఠినమైన, పకడ్బందీ అకడమిక్ శిక్షణతో పాటు క్షేత్రస్థాయి పరిశీలనలు (ఫీల్ విజిట్లు) ఉంటాయని ఆయన తెలిపారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన ఇంజనీర్లు కేవలం పుస్తకాలకే పరిమితం కాకుండా, ఫార్చ్యూన్ 500 కంపెనీలు, గ్లోబల్ క్యాపబిలిటీ సెంటర్లకు కేంద్రమైన, ముత్యాల నగరమైన హైదరాబాద్‌లోని చారిత్రక కట్టడాలు చార్మినార్, గోల్కొండతో పాటు రామోజీ ఫిల్మ్ సిటీ వంటి అద్భుతాలను కూడా తిలకించి సరికొత్త అనుభూతిని సొంతం చేసుకోవాలని గ్రేవల్ పిలుపునిచ్చారు.వచ్చే డిసెంబర్‌లో హైదరాబాద్ వేదికగా అట్టహాసంగా జరగనున్న 41వ ఇండియన్ ఇంజనీరింగ్ కాంగ్రెస్ సావనీర్ కోసం నిపుణులు తమ టెక్నికల్ పేపర్లను పంపాలని ఈ సందర్భంగా ఆయన ఆహ్వానించారు. ఈ ప్రారంభ వేడుకలో కాలేజ్ చీఫ్ డాక్టర్ పి. రాజారావు, డాక్టర్ జ్యోతి, డాక్టర్ భరత్ తదితర ప్రముఖులు, ఫ్యాకల్టీ సభ్యులు పాల్గొన్నారు.

# ఆకర్షణీయమైన డిజైన్‌తో ఏఐప్లస్ నోవా 2 పవర్ 5జీ




**హైదరాబాద్, సెప్టెంబర్ 21 (మనంన్యూస్):** ఏఐ+ స్మార్ట్ ఫోన్ సంస్థ నోవ 2 సిరిస్ లో తాజా స్మార్ట్ఫోన్ అయిన ఏఐ+నోవ2పవర్ 5జీ ను విడుదల చేసింది. ఇది సాంకేతికతను ఇష్టపడే తరానికి అత్యాధునిక డిజైన్, నమ్మదగిన పనితీరు, దీర్ఘకాలం నిలిచే శక్తి కలయికను అందిస్తుంది. స్మార్ట్ఫోన్ విడుదల కార్యక్రమాల సంప్రదాయ పద్ధతికి భిన్నంగా, ఏఐ+నోవ2పవర్ ను న్యూ ఢిల్లీలో ర్యాంప్ పై ఆవిష్కరించారు. అక్కడ ఫ్యాషన్, సాంకేతికత సహజంగా మిళితమయ్యాయి. ఈ స్మార్ట్ఫోన్ను సమకాలీన ర్యాంప్ వస్త్రధారణలో భాగంగా చేర్చారు, దీనివల్ల ఒక స్టైలిష్ అనుబంధ వస్తువుగా (యాక్సెసరీ) దీని పాత్ర ప్రస్ఫుటమైంది.స్ఫూర్తినిచ్చే డిజైన్, దీర్ఘకాలం నిలిచే శక్తి అనే మూల మంత్రంపై ఆధారపడిన ఏఐ+నోవ2పవర్, స్మార్ట్ఫోన్ అనుభవానికి కేంద్రంలో డిజైన్ను ఉంచుతూనే, వినియోగదారులు ఆశించే పనితీరును, మన్నికను అందిస్తుంది. సాంకేతికత, ఫ్యాషన్ కలిసే చోట స్మార్ట్ఫోన్లు వ్యక్తిగత గుర్తింపును మరింత ఎక్కువగా ప్రతిబింబిస్తున్న కొద్దీ, ఏఐ+నోవ2పవర్ కేవలం ఉపయోగితను దాటి నిలుస్తుంది. ర్యాంప్ పై దీని ప్రదర్శన, పరికరాన్ని డిజైన్, ఆకాంక్ష, సాంకేతికతల సంగమ స్థానంలో నిలపాలనే ఏఐ+ స్మార్ట్ ఫోన్ దార్శనికతను ప్రముఖంగా చూపుతుంది. దీని ముఖ్య లక్షణాలలో ఆకర్షణీయమైన ద్వివర్ణ వెనుక ప్యానెల్ ఒకటి. దీనికి సంబంధించిన ఆ సంస్థ ముఖ్య కార్యనిర్వాహక అధికారి మాధవ్ సేథ్ మాట్లాడుతూ 'నేటి కాలంలో సాంకేతికత వ్యక్తిగతమైనది. స్మార్ట్ఫోన్ కేవలం ఉపయోగకరమైన సాధనం కాదని, అది తనను తాను వ్యక్తపరచుకునే మాధ్యమం. నోవ2పవర్ లో డిజైన్, పనితీరు ఒకదానికొకటి సరితూగుతాయి. దీని ఆకర్షణీయమైన కలర్ ఫ్యూజన్ డిజైన్ సహజంగానే దృష్టిని ఆకట్టుకుంటుంది; అదే సమయంలో దీని అంతర్గత శక్తి రోజువారీ జీవితానికి అండగా నిలుస్తుందన్నారు.

## మహా అన్నదాన కార్యక్రమం



**టేకుమట్ల సెప్టెంబర్ 21 మనం న్యూస్:** టేకుమట్ల మండలం సుబ్బక్కపల్లి గ్రామం లో ఆంజనేయ స్వామి దేవాలయ కమిటీ ఆధ్వర్యంలో సోమవారం భక్తి శ్రద్ధలతో మహా అన్నదానకార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామి వారికి నైవేద్యంసమర్పించారు.అనంతరం భక్తులు గ్రామస్తులకు మహా అన్నదానం చేపట్టారు.ఈ కార్యక్రమానికి భక్తులు గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై స్వామివారిని దర్శించుకొని అన్నప్రాసదాన్ని స్వీకరించారు.ఆంజనేయస్వామి ఆశీస్సులతో గ్రామ ప్రజలు అందరు సుఖ సంతోషాలతో ఆయురారోగ్యాలతో ఉండాలని ఆలయ కమిటీ సభ్యులు ఆకాంక్షించారు.మహా అన్నదానకార్యక్రమానికి సహకరించిన దాతలు భక్తులు గ్రామస్తులకు నిర్వాహకులు కృతజ్ఞతలు తెలిపారు.

## ప్రశాంతమైన వాతావరణంలో వినాయక నిమజ్జనం చేసుకోవాలి: ఎస్సై జి అమూల్య




**టేకుమట్ల, సెప్టెంబర్ 21 మనం న్యూస్:** మండలం లోని గ్రామాలలో ఉన్న డీజే సౌండ్ సిస్టం వాహనదారులను పిలిపించి వినాయక చవితి సందర్భంగా ఏ గ్రామంలో కూడా డిజె సౌండ్ సిస్టం వాడకూడదు అని టేకుమట్ల ఎస్సై జి . అమూల్య కౌన్సిలింగ్ చేయడం జరిగినది. అదేవిధంగా డిజె సౌండ్ సిస్టం వాహనదారులను తాసిల్దార్ టేకుమట్ల ముందు బౌండోవర్ చేయగా టేకుమట్ల తాసిల్దార్ స్వరూప రాణి డిజె సౌండ్ సిస్టం వాడినట్లయితే ఒకరికి లక్ష రూపాయలు జరిమానా లేదా మూడు నెలలు జైలు శిక్ష ఉంటుంది అని హెచ్చరించారు.

## కొండా లక్ష్మణ్ బాపూజీ సేవలు చిరస్మరణీయం

- మంత్రి సీతక్క



**ములుగు, సెప్టెంబర్ 21, మనం ప్రతినిధిః** ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు, తెలంగాణ ఉద్యమ వేత్త, మాజీ మంత్రి కొండా లక్ష్మణ్ బాపూజీ వర్ధంతి సందర్భంగా మంత్రి డా. ధనసరి అనసూయ సీతక్క నివాళులర్పించారు. ట్యాంక్బండ్ ఉన్న ఆయన విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళి అర్పించారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ.. దేశ స్వాతంత్ర్యం కోసం పోరాడిన కొండా లక్ష్మణ్ బాపూజీ, అనంతరం తెలంగాణ ప్రజల హక్కులు, ఆత్మగౌరవం కోసం నిరంతరం ఉద్యమించారని గుర్తుచేశారు. తెలంగాణ సమాజం కోసం తన జీవితాన్ని అంకితం చేసిన మహనీయుల్లో బాపూజీ ఒకరని పేర్కొన్నారు. పదవులు, రాజకీయ ప్రయోజనాల కంటే ప్రజా ప్రయోజనాలకే ఆయన ఎప్పుడూ ప్రాధాన్యం ఇచ్చారని తెలిపారు. తెలంగాణ సాధన కోసం ఆయన చేసిన పోరాటం, సామాజిక న్యాయం కోసం చూపిన నిబద్ధత నేటి తరానికి స్ఫూర్తిదాయకమన్నారు. అణగారిన వర్గాల అభ్యున్నతి, బడుగు బలహీన వర్గాల హక్కుల కోసం ఆయన చేసిన కృషిని సమాజం ఎప్పటికీ గుర్తుంచుకుంటుందని చెప్పారు.

కొండా లక్ష్మణ్ బాపూజీ ఆశయాలను ముందుకు తీసుకెళ్లడమే ఆయనకు ఇచ్చే నిజమైన నివాళి అని మంత్రి సీతక్క అన్నారు. ప్రజాస్వామ్య విలువలు, సామాజిక న్యాయం, ప్రజల హక్కుల పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మంత్రి సీతక్కతో పాటు జీహెచ్ఎంసీ మేయర్ గుండు సుధారాణి, ఇతర ప్రముఖులు పాల్గొన్నారు.

## ఎన్నికలు లేకున్నా.. అభివృద్ధికి నిధుల కొరత లేదు!

### 58 గ్రామపంచాయతీలకు రూ.33.62 కోట్లు విడుదల
### మంత్రి సీతక్క ప్రత్యేక చొరవతో కీలక నిర్ణయం



**ములుగు, సెప్టెంబర్ 21, మనం ప్రతినిధిః** ఎన్నికలు జరగని గ్రామపంచాయతీలకు రాష్ట్ర ప్రభుత్వం అండగా నిలిచింది. కోర్టు కేసులు, ఇతర కారణాలతో ఎన్నికలు నిర్వహించలేకపోయిన 58 గ్రామపంచాయతీలకు రాష్ట్ర నిధులను విడుదల చేసింది. మంత్రి సీతక్క ప్రత్యేక చొరవతో మొత్తం రూ.33.62 కోట్ల నిధులను మంజూరు చేసి, సంబంధిత గ్రామపంచాయతీల ఖాతాల్లో జమ చేసింది. కేంద్ర నిధులు నిలిచిపోవడంతో.. గ్రామపంచాయతీలకు సాధారణంగా అందాల్సిన కేంద్ర ఆర్థిక సంఘం నిధులు ఎన్నికలు జరగని కారణంగా ఆయా పంచాయతీలకు నిలిచిపోయాయి. దీంతో గ్రామాల్లో పారిశుద్ధ్యం, మౌలిక వసతులు, ప్రజలకు అవసరమైన కనీస సదుపాయాల కల్పన వంటి పనులకు నిధుల సమస్య తలెత్తే పరిస్థితి ఏర్పడింది. ఈ నేపథ్యంలో ఎన్నికలు జరగని కారణంగా గ్రామాల అభివృద్ధి ఎక్కడా నిలిచిపోకూడదన్న ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టింది. కేంద్ర నిధులు అందకపోయినా ఆయా గ్రామపంచాయతీలకు రాష్ట్ర నిధులు అందించాలని నిర్ణయించింది.

**58 పంచాయతీలకు రూ.33.62 కోట్లు**

మంత్రి సీతక్క ప్రత్యేక చొరవతో 58 గ్రామపంచాయతీలకు రూ.33.62 కోట్ల నిధులను రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసింది. ఇప్పటికే ఈ నిధులు ఆయా గ్రామపంచాయతీల ఖాతాల్లో జమ చేసినట్లు ప్రభుత్వం వెల్లడించింది. దీంతో నిధుల లేమితో ఇబ్బందులు ఎదుర్కొంటున్న పంచాయతీలకు ఊరట లభించనుంది.

**అభివృద్ధి పనులకు ఊతం**

గ్రామపంచాయతీల్లో ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనతో పాటు పారిశుద్ధ్యం, స్థానిక అవసరాలకు అనుగుణంగా చేపట్టే అభివృద్ధి కార్యక్రమాలకు ఈ నిధులు ఉపయోగపడనున్నా యి. ఎన్నికలు జరగకపోయినా గ్రామీణ ప్రాంతాల్లో పాలన, అభివృద్ధి కార్యక్రమాలు కొనసాగేందుకు ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకున్నట్లు అధికారులు తెలిపారు.

**గ్రామాల ప్రయోజనాలే లక్ష్యంగా..**

ఎన్నికలు నిర్వహించలేకపోయిన గ్రామాలను నిధుల విషయంలో వెనుకబెట్టకూడదన్న ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. కేంద్రం నుంచి వచ్చే నిధులు ఆలస్యమైనా లేదా నిలిచిపోయినా గ్రామాల్లో అభివృద్ధి పనులకు ఆటంకం కలగకుండా రాష్ట్ర నిధులతో భర్తీ చేసే చర్యలు చేపట్టింది. 58 గ్రామపంచాయతీలకు రూ.33.62 కోట్ల నిధులు విడుదల కావడంతో ఆయా గ్రామాల్లో అభివృద్ధి కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్లేందుకు మార్గం సుగమమైంది. ఎన్నికల ప్రక్రియ పూర్తయ్యే వరకు గ్రామాల అభివృద్ధి ఆగకుండా నిధుల ప్రవాహాన్ని కొనసాగించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవడం ప్రాధాన్యం సంతరించుకుంది.

## మంత్రి సీతక్కకు కృతజ్ఞతలు

**మంగపేట, సెప్టెంబర్ 21, మనం ప్రతినిధిః** రాష్ట్రవ్యాప్తంగా వివిధ కారణాలతో ఎన్నికలు నిర్వహించలేని 58 గ్రామ పంచాయతీల్లో అభివృద్ధి, పారిశుద్ధ్య పనులు, గ్రామపంచాయతీల నిర్వహణ కుంటుపడకుండా రాష్ట్ర ప్రభుత్వం నిధులు మంజూరు చేయడం అభినందనీయమని మంగపేట మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చెట్టిపెల్లి వెంకటేశ్వర్లు అన్నారు.అదే విధంగా మంగపేట మండలంలోని 25 పంచాయతీలలో నెలకొన్న ప్రత్యేక పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని, గ్రామపంచాయతీల ఎన్నికలు నిర్వహించలేని పరిస్థితుల్లోనూ ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలు,పారిశుద్ధ్య కార్యక్రమాలు, గ్రామపంచాయతీల నిర్వహణ మరియు అభివృద్ధి పనులు ఎక్కడా నిలిచిపోకుండా ఉండేందుకు ప్రత్యేక చొరవ తీసుకుని మంగపేట మండలానికి ఒక కోటి 76 లక్షల 86 వేల 65 రూపాయల నిధులు మంజూరు చేయించిన తెలంగాణ రాష్ట్ర పంచాయతీరాజ్,గ్రామీణ అభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ ధనసరి అనసూయ సీతక్క కి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అలాగే మంగపేట మండల ప్రజల అవసరాలను దృష్టిలో పెట్టుకుని నిధులు



మంజూరు చేసిన తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ ఎనుముల రేవంత్ రెడ్డి కి హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు.ప్రజల సంక్షేమం,గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా ప్రభుత్వం తీసుకుంటున్న ప్రతి నిర్ణయం ప్రజలకు మరింత మేలు చేకూర్చేలా ఉందని చెట్టిపెల్లి వెంకటేశ్వర్లు పేర్కొన్నారు.

## ఫైర్‌స్టేషన్ సిద్ధం..ప్రారంభం ఎప్పుడు?

### ఆరు నెలలుగా జాప్యం..బీఆర్ఎస్ ఆధ్వర్యంలో నిరసన



**మహాదేవపూర్, సెప్టెంబర్ 21 మనం న్యూస్:** మండల కేంద్రానికి మంజూరైన అగ్నిమాపక కేంద్రాన్ని వెంటనే ప్రారంభించాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఫైర్‌స్టేషన్ వద్ద కొబ్బరికాయ కొట్టి నాయకులు నిరసన తెలిపారు. ఆరు నెలల క్రితమే కేంద్రంలో మంజూరైనా ప్రారంభించడంలో జాప్యం ఎందుకని ప్రశ్నించారు. ఫైర్‌స్టేషన్కు అవసరమైన నీటి ట్యాంకులు, వాహనాలు, సిబ్బంది ఏర్పాటు చేయలేదని ఆరోపించారు. మహాదేవపూర్‌తో పాటు ఐదు మండలాల ప్రజలకు సేవలందించేలా వెంటనే ప్రారంభించాలని డిమాండ్ చేశారు. మండలానికి మంజూరైన ప్రభుత్వ కార్యాలయాలను ఇతర ప్రాంతాలకు తరలించకుండా ఇక్కడే కొనసాగించాలని కోరారు.మండలంలో ఇసుక లారీల రాకపోకలు అధికంగా ఉండటంతో ప్రమాదాల ముప్పు ఉందని, గ్రామాలకు సంబంధించిన సీనరేజ్ ఫండ్ విడుదలలోనూ జాప్యం జరుగుతోందని నాయకులు ఆరోపించారు.మహాదేవపూర్కు మంజూరైన కోర్టును కూడా ఇక్కడే ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.సమస్యల పరిష్కారం కోసం అవసరమైతే ఆందోళనలు కొనసాగిస్తామని తెలిపారు. కార్యక్రమంలో మహాదేవపూర్ మాజీ సర్పంచ్ శ్రీపతి బాపు, మంథని నియోజకవర్గ మాజీ మహిళా అధ్యక్షురాలు కేదారి గీత, మహాదేవపూర్ మాజీ యూత్ అధ్యక్షుడు అలీం ఖాన్, కాళేశ్వరం 2వ వార్డు సభ్యులు నిట్టూరి మహేష్,బడికేలా మహేందర్, సయ్యద్ అస్లాం,చకినారపు శేషి కుమార్,ఒడేటి రవీందర్, పోత వెంకటస్వామి, వెన్నంపల్లి మహేష్ తదితర బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## బాధిత కుటుంబానికి పరామర్శ



**టేకుమట్ల సెప్టెంబర్ 21 మనం న్యూస్:** టేకుమట్ల గ్రామానికి చెందిన రాం కుమారస్వామి ( ముతా ) సతీమణి రాం శారద ప్రమాద వాశాత్తు గాయపడి హనుమకొండ గార్డెన్ ఆస్పత్రిలో సికప్ చికిత్స పొందుతూ ఉండగా విషయం తెలుసుకున్న టేకుమట్ల మాజీ ఎంపీటీసీ ఆది సునీత రఘు హుటాహుటిన గార్డెన్ హాస్పిటల్ కు చేరుకొని రామ్ శారదను పరామర్శించారు తదనంతరం గార్డెన్ హాస్పిటల్ డాక్టర్లతో మాట్లాడి ఆమె ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు డాక్టర్ చెప్పిన సూచనలు తప్పక పాటించి ఆమె తొందరగా కోలుకోవాలని ఆమెకు మనోధైర్యాన్ని కల్పించారు.తదనంతరం ఆమెకు ఆర్థిక సాయం అందించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షులు మచ్చ శ్రీకాంత్ మాదిగ,కోండ్ర ప్రశాంత్, కోండ్ర రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

## చింతలమోరి పాఠశాలను సందర్శించిన కాంగ్రెస్ నాయకులు



**ఏటూర్ నాగారం, సెప్టెంబర్ 21 మనం ప్రతినిధి:** చింతలమోరి గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలపై కాంగ్రెస్ నాయకులు స్పందించారు. మంత్రి సీతక్క ఆదేశాల మేరకు ఏటూరునాగారం మండల కాంగ్రెస్ నాయకులు సోమవారం గ్రామాన్ని సందర్శించి పాఠశాలను పరిశీలించారు. గ్రామస్తులు, విద్యార్థులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. వర్షం కురిసిన సమయంలో పాఠశాల పైకప్పు పెంకుల నుంచి నీరు కారుతుండటంతో తరగతి గదుల్లో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని గ్రామస్తులు నాయకుల దృష్టికి తీసుకువచ్చారు. దీంతో పాఠశాల భవనాన్ని పరిశీలించిన నాయకులు సమస్య తీవ్రతను తెలుసుకున్నారు.విద్యార్థుల ఇబ్బందులను మంత్రి సీతక్క దృష్టికి తీసుకెళ్లి, త్వరలోనే మెరుగైన పాఠశాల వసతులు కల్పించేలా చర్యలు తీసుకుంటామని గ్రామస్తులకు, విద్యార్థులకు హామీ ఇచ్చారు. అనంతరం గ్రామస్తులతో మాట్లాడి స్థానిక సమస్యలు, వారి బాగోగులను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఇర్సవడ్ల వెంకన్న, జిల్లా ప్రధాన కార్యదర్శి గుడ్ల దేవేందర్, మండల ప్రధాన కార్యదర్శి వావిలాల ఎల్లయ్య, టౌన్ అధ్యక్షుడు కే. రంజిత్, కందుకూరి రతన్ తదితరులు పాల్గొన్నారు.

## మల్లంపల్లి మండల ఏర్పాటుతో అభివృద్ధికి బాటలు

### సీతక్క కృషితోనే మండలానికి శాశ్వత రూపం
### కాంగ్రెస్ మండల అధ్యక్షుడు చెరుకుపల్లి శ్రీకాంత్‌రెడ్డి



**ములుగు, సెప్టెంబర్ 21, మనం ప్రతినిధిః** మల్లంపల్లి మండల ఏర్పాటులో మంత్రి సీతక్క కీలక పాత్ర పోషించారని మల్లంపల్లి మండల కాంగ్రెస్ అధ్యక్షుడు చెరుకుపల్లి శ్రీకాంత్రెడ్డి అన్నారు. ములుగు జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు పైడాకుల అశోక్ ఆదేశాల మేరకు సోమవారం మల్లంపల్లి మండల కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.

గత ప్రభుత్వ హయాంలో ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని ములుగు జిల్లాకు సంబంధం లేని గ్రామాలను కలుపుతూ మల్లంపల్లి మండలాన్ని ప్రకటించారని ఆరోపించారు. మండల సాధన కోసం జరిగిన ఉద్యమంలో మంత్రి సీతక్క పలుమార్లు ప్రత్యక్షంగా పాల్గొని ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు ములుగు జిల్లాలోని గ్రామాలను కలుపుతూ శాస్త్రీయ పద్ధతిలో మండలాన్ని ఏర్పాటు చేయించారని తెలిపారు. ప్రతిపక్ష నాయకుడిగా పనిచేసిన స్వర్గీయ కుసుమ జగదీశ్ పేరుతో మండలాన్ని ఏర్పాటు చేయించడం సీతక్క మానవత్వానికి నిదర్శనమన్నారు. ప్రస్తుతం తాత్కాలిక భవనాల్లో ప్రభుత్వ కార్యకలాపాలు కొనసాగుతున్నాయని, శాశ్వత భవనాల నిర్మాణానికి ప్రభుత్వం నిధులు మంజూరు చేసిందని చెప్పారు. నూతన ఎంపీడీవో భవనానికి రూ.1.70 కోట్లు, ఎమ్మార్వో భవనానికి రూ.2.20 కోట్లు, మండలంలోని సీసీ రోడ్ల నిర్మాణానికి రూ.3 కోట్లు మంజూరయ్యాయని వివరించారు. ఎస్టీ గ్రామపంచాయతీలు, తండాల అభివృద్ధి కోసం మల్లంపల్లి మండలానికి రూ.2.27 కోట్లు కేటాయించినందుకు మంత్రి సీతక్కకు మండల ప్రజల తరఫున కృతజ్ఞతలు తెలిపారు. మల్లంపల్లి మండలం ఒక్కరి వల్ల ఏర్పడలేదని, అన్ని గ్రామాల ప్రజలు, నాయకులు, మహిళలు చేసిన పోరాటంతో పాటు సీతక్క కృషి ఫలితంగానే సాధ్యమైందని శ్రీకాంత్రెడ్డి పేర్కొన్నారు. కాంగ్రెస్ నుంచి పలువురు నాయకులు బీఆర్ఎస్లో చేరారంటూ ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు చేసిన ప్రకటనను ఆయన తప్పుబట్టారు. పార్టీతో సంబంధం లేని కొందరిని చూపించి కాంగ్రెస్ నాయకులు చేరారని చెప్పడం హాస్యాస్పదమన్నారు. మండల అభివృద్ధిని ఎవరూ అడ్డుకోలేరని, త్వరలో పోలీస్‌స్టేషన్, షాపింగ్ కాంప్లెక్స్, డ్రైనేజీ సౌకర్యాలతో పాటు పేదలకు ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేయనున్నట్లు తెలిపారు. మంత్రి సీతక్క చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలపై మండలంలోని గ్రామాల ప్రజలు సంతోషంగా ఉన్నారని చెప్పారు. ఈ సమావేశంలో సర్పంచుల ఫోరం అధ్యక్షుడు, మల్లంపల్లి సర్పంచ్ ల్యాద శ్యామ్రావు, మెడికల్ హెల్త్ వింగ్ జిల్లా అధ్యక్షుడు ఆనందపు రవిబాబు, జిల్లా కాంగ్రెస్ ఎగ్జిక్యూటివ్ సభ్యుడు చిట్టిరెడ్డి రాంరెడ్డి, మండల సర్పంచులు రమణారెడ్డి, పసుల కార్తీక్, రాంమోహన్రెడ్డి, బానోతు రాజేందర్, భాస్కర్, జోషి, స్థానిక గ్రామ పార్టీ అధ్యక్షులు పొనుగోటి రవీందర్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## రథోత్సవాన్ని తిలకించి పరవశించిన భక్తులు

### కాణిపాకం పురవీధులలో విహరిస్తూ భక్తులకు దర్శనమిచ్చిన గణనాథుడు
### లక్ష మందికి పైగా రథోత్సవం తిలకించిన భక్తులు
### రథోత్సవాన్ని పూజతో ప్రారంభించిన ఎమ్మెల్యే ఆలయ ఈవో చైర్మన్

**కాణిపాకం సెప్టెంబర్ 21 మనం న్యూస్:** కాణిపాకం వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం మధ్యాహ్నం నిర్వహించిన రథోత్సవాన్ని తిలకించడానికి భక్తులు లక్షలాదిగా వచ్చి గణనాథుడిని దర్శించి పరవశించిపోయారు. ముందుగా రథానికి పూతలపట్టు శాసనసభ్యులు డాక్టర్ కలిగిరి మురళి మోహన్, ఆలయ చైర్మన్ మనీ నాయుడు, ఈ వో పెంచల కిషోర్, శ్రీశైలం మల్లికార్జున భ్రమరాంబిక ఆలయ ఈవో శ్రీనివాసులు పూజలు నిర్వహించి సోమవారం సాయంత్రం 3 గంటల 19 నిమిషాలకు రథాన్ని ప్రారంభించారు.కానిపాకం నందు రథోత్సవాన్ని తిలకించడానికి ఉమ్మడి జిల్లా నలుమూలల నుండి అంతేకాకుండా రెండు తెలుగు రాష్ట్రాలతో పాటు కర్ణాటక తమిళనాడు రాష్ట్రాల నుంచి కూడా ఆలయానికి అంచనాలకు మించి భక్తులతో వచ్చారు. సోమవారం మధ్యాహ్నం ప్రారంభమైన రథోత్సవం సుమారు నాలుగు గంటల పాటు కాణిపాకం పురవీధులలో రథోత్సవం కొనసాగింది. సిద్ధిబుద్ధి సమేత శ్రీ వరసిద్ధి వినాయక స్వామి వారు ఈ రథంపై ఆసీనులై ఆలయ మాడవీధులలో పాటు ,కాణిపాకం పురవీధులతో పాటు విహరిస్తూ భక్తులకు దర్శనమిచ్చారు. అదేవిధంగా దేవతామూర్తుల జండాలను రథంపై కన్నులువిందగా అలంకరింపజేశారు. దానికి తోడు వివిధ రకాల పుష్పాలతో రథాన్ని శోభయామానంగానంగా అలరింపజేశారు. రంగురంగులగ అలంకరణ చేశారు.

రథోత్సవాన్ని తిలకిస్తే గణనాథుడు కోరికలను తీరుస్తాడని భక్తులకు ప్రత్యేక వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా కాణిపాకం లో సోమవారం మధ్యాహ్నం జరిగిన రథోత్సవాన్ని తిలకిస్తే గణనాథుడు కోరిన కోరికలను తీరుస్తాడని భక్తులకు ప్రతీక భక్తులు భక్తిశ్రద్ధలతో రథోత్సవంలో పాల్గొని సిద్ది బుద్ధి సమేత శ్రీ వరసిద్ధి వినాయక స్వామి వారిని దర్శించుకున్న వారికి ఆరోగ్యం, ఆదాయం, చదువు, విజ్ఞానం, వివాహం, అప్పులు లేకుండా



సుఖశాంతులతో వారికి సంతాన ప్రాప్తి కలుగుతుందని నమ్మకం. రథోత్సవం సందర్భంగా భక్తులు రథంపై ఊరేగుతున్న స్వామి వారిపై మిరియాలు, చిల్లర నాణేలు, ఉప్పు, చల్లి తమ కోరికలను కోరుకుంటే వినాయక స్వామి తీరుస్తాడని భక్తులకు గట్టి నమ్మకమని పురోహితులు వేద పండితులు చెబుతున్నారని వారి ఉద్దేశం.

# ‘ఆల్మోస్ట్ నల్లవన్’ షూటింగ్ అప్డేట్ ఇచ్చిన దుషారా విజయన్



కోలీవుడ్ టాలెంటెడ్ యంగ్ బ్యూటీ దుషారా విజయన్ వరుస క్రేజీ ప్రాజెక్టతో ఫుల్ జోరుమీదున్నారు. ఇటీవల ‘జీడి నాయుడు’ సినిమాతో ప్రేక్షకులను అలరించిన ఈ భామ.. తాజాగా మరో ఆసక్తికరమైన చిత్రంతో వస్తున్నారు. ఆమె ప్రధాన పాత్రలో నటిస్తున్న లేటెస్ట్ మూవీ ‘ఆల్మోస్ట్ నల్లవన్’. ఈ చిత్రానికి ప్రముఖ నటుడు రాజు జయమోహన్ దర్శకత్వం వహిస్తుండటంతో పాటు ఇందులో ప్రధాన పాత్రలోనూ నటిస్తున్నారు. మరో విశేషం ఏమిటంటే.. టాలెంటెడ్ డైరెక్టర్ హెచ్. వినోద్ ఈ సినిమాకు నిర్మాతగా వ్యవహరిస్తున్నారు. ‘ఆస్ట్రేర్ ఉబుంటు ఫిల్మ్స్’ బ్యాన్ర ఈ చిత్రాన్ని అత్యంత ప్రతిష్టాత్మకంగా రూపొందిస్తున్నారు.

ఈ సినిమాలో సీనియర్ నటుడు సత్యరాజ్, ఇమ్మాన్ అన్నాచ్చి, తామరై సెల్వి తదితరులు కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఇప్పటికే ఈ సినిమాకు సంబంధించిన మొదటి షెడ్యూల్ విజయవంతంగా పూర్తి కాగా.. తాజాగా, దుషారా రెండో షెడ్యూల్ అప్డేట్ ఇచ్చారు. ప్రస్తుతం రెండో షెడ్యూల్ షూటింగ్ తెన్కాశి పరిసర ప్రాంతాల్లో శరవేగంగా జరుగుతోందని వెల్లడించారు. అంతేకాకుండా షూటింగ్ స్పాట్కు సంబంధించిన కొన్ని ప్రత్యేక ఫొటోలను కూడా ఆమె షేర్ చేయడంతో నెట్టింట వైరల్ అవుతున్నాయి. డిఫరెంట్ కాన్సెప్ట్తో రానున్న ఈ సినిమాపై ఇండస్ట్రీలో అప్పుడే మంచి అంచనాలు నెలకొన్నాయి.

# ఖేలో ఇండియా యూత్ గేమ్స్‌కు ఘనంగా ఏర్పాట్లు

- ఈ ఏడాది డిసెంబర్ 11 నుంచి 23 వరకు జాతీయ స్థాయి పోటీలు
- క్రీడా వేదికలు, వసతి, రవాణా, భద్రతపై సమీక్ష నిర్వహించిన మంత్రి
- తెలంగాణ ప్రతిష్టను చాటేలా సమగ్ర కార్యాచరణతో ముందుకు సాగాలని మంత్రి వాకిటి ఆదేశం




హైదరాబాద్,సెప్టెంబర్ 21 (మనం న్యూస్): రాష్ట్రంలో ఈ ఏడాది డిసెంబర్ 11 నుండి 23 వరకు నిర్వహించనున్న ఖేలో ఇండియా యూత్ గేమ్స్-2026 పోటీలను అత్యంత ప్రతిష్టాత్మకంగా, విజయవంతంగా నిర్వహించేందుకు తెలంగాణ ప్రభుత్వం భారీ ఏర్పాట్లకు శ్రీకారం చుట్టింది. ఈ నేపథ్యంలో పోటీల సన్నాహాలపై సచివాలయంలో రాష్ట్ర క్రీడా శాఖ మంత్రి వాకిటి శ్రీహరి ఉన్నత స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాల నుంచి వచ్చే యువ క్రీడాకారులకు రాష్ట్రంలో అత్యుత్తమ వసతులు కల్పించడమే లక్ష్యంగా అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆయన స్పష్టం చేశారు.

పోటీల నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లను శాఖల వారీగా మంత్రి సమీక్షించారు. క్రీడా వేదికల సిద్ధత, మౌలిక సదుపాయాల కల్పన, క్రీడాకారుల వసతి, రవాణా, భద్రత, వైద్య సదుపాయాలు, ఆహారం, పరిశుభ్రత, స్వాగత ఏర్పాట్లు, ప్రచార కార్యక్రమాలపై అధికారులతో విస్తృతంగా చర్చించారు. ప్రతి క్రీడా వేదిక వద్ద అన్ని అవసరమైన వసతులు అందుబాటులో ఉండేలా ముందస్తు చర్యలు చేపట్టాలని, ఎలాంటి లోటుపాట్లకు తావివ్వకుండా శాఖలన్నీ అప్రమత్తంగా వ్యవహరించాలని మంత్రి సూచించారు.

**క్రీడా సంస్కృతిని బలోపేతం చేయడమే లక్ష్యం..**

ఖేలో ఇండియా యూత్ గేమ్స్ వంటి జాతీయ స్థాయి పోటీలు తెలంగాణలోని యువ క్రీడాకారులకు తమ ప్రతిభను జాతీయ స్థాయిలో ప్రదర్శించేందుకు గొప్ప వేదికగా నిలుస్తాయని మంత్రి పేర్కొన్నారు. రాష్ట్రంలో క్రీడా సంస్కృతిని మరింత బలోపేతం చేయడంతో పాటు, గ్రామీణ ప్రాంతాల నుంచి ప్రతిభావంతులైన క్రీడాకారులను గుర్తించి ప్రోత్సహించేందుకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని మంత్రి వెల్లడించారు. తెలంగాణ ఆతిథ్య వైభవానికి, క్రీడా రంగంలో రాష్ట్ర ప్రతిష్ఠకు ఏమాత్రం తగ్గకుండా ఈ క్రీడోత్సవాన్ని దిగ్విజయం చేయాలని మంత్రి అధికారులను ఆదేశించారు.ఈ ఉన్నత స్థాయి సమీక్షా సమావేశంలో మంత్రి తో పాటు రాష్ట్ర ప్రభుత్వ క్రీడల సలహాదారు ఏపీ జితేందర్ రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి జయేశ్ రంజన్, స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ ఎండి సోని బాలదేవి తదితర క్రీడా శాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# భారత్ - జపాన్ ఏకైక టీ20కి టైఫూన్ ముప్పు?




భారత క్రికెటర్లు జపాన్తో ఏకైక టీ20 మ్యాచ్ ఆడేందుకు సిద్ధమవుతున్నారు. భారత్ - జపాన్ 75 ఏళ్ల స్నేహానికి గుర్తుగా ఈ మ్యాచ్ను నిర్వహిస్తోన్న సంగతి తెలిసిందే. ఈ మ్యాచ్కు వేదిక సానో క్రికెట్ స్టేడియం. అయితే, ప్రస్తుతం అక్కడి వాతావరణం ఆందోళన కలిగిస్తోంది. టైఫూన్ డుజాన్ (ఖీఱజ్ఱూ్ఝ్ఞు్ఝ) ప్రభావంతో భారీ వర్షాలు పడతాయని అక్కడి వాతావరణ శాఖ చెబుతోంది. దీంతో చరిత్రాత్మకమైన మ్యాచ్కు అంతరాయం ఏర్పడుతుందా? అనే అనుమానాలు మొదలయ్యాయి.

భారత కాలమానం ప్రకారం మంగళవారం ఉదయం 9.30గంటలకు మ్యాచ్ ప్రారంభం కానుంది. వాతావరణ శాఖ నివేదిక ప్రకారం సానో స్టేడియం ఉన్న కాంటో ప్రాంతంలో ఇప్పటికే వర్షాలు కురుస్తున్నాయి. అయితే, మ్యాచ్ (ఋఛీజ్చీ రిట బ్చఇ్ఝ) నాటికి పరిస్థితులు కాస్త మెరుగవుతాయని స్థానిక అధికారులు భావిస్తున్నారు.

**ఆసియా క్రీడలకూ..**

జపాన్ వేదికగా ఆసియా క్రీడలు (అఙఙ్చీఝ ఎ్చఝ్ఝుట) జరుగుతున్నాయి. ఈ పోటీలను వర్షాలు ఇబ్బంది పెడుతున్నాయి. ఇప్పటికే ఈక్వెస్ట్రియన్ ఈవెంట్ కూడా మంగళవారానికి వాయిదా పడింది. ఇండోర్లో ఆడేవాటికి సమస్య లేకపోయినా.. ఔట్ డోర్ క్రీడలకు మాత్రం వర్షం అడ్డంకిగా మారుతోంది.



# సరికొత్త అవతార్‌లో కృతిశెట్టి బ్లాస్టింగ్ పెర్ఫార్మెన్స్ గ్యారెంటీ..

## స్పెషల్ పోస్ట్‌తో హైప్ పెంచిన మేకర్స్

టాలీవుడ్ బాక్సాఫీస్ వద్ద భారీ అంచనాలు నెలకొన్న క్రేజీ ప్రాజెక్ట్ ‘జనవరి 12 విడుదల’ . బ్లాక్ బస్టర్ డైరెక్టర్ అనిల్ రావిపూడి దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ సినిమాలో విక్టరీ వెంకటేష్, నందమూరి కళ్యాణ్ రామ్ బావ-బామ్మర్దులుగా కలిసి నటిస్తుండటం విశేషం. పూర్తి స్థాయి ఫన్, ఫ్యామిలీ ఎమోషన్స్, మాస్ ఎంటర్టైనర్గా వస్తున్న ఈ చిత్రంలో కృతి శెట్టి, కీర్తి సురేష్ హీరోయిన్లుగా నటిస్తున్నారు. షైన్ స్క్రీన్స్ బ్యానర్ సాహు గారపాటి నిర్మిస్తున్న ఈ భారీ చిత్రానికి జీ స్టూడియోస్, సురేష్ ప్రొడక్షన్స్ సమర్పిస్తున్నాయి. టాలెంటెడ్ మ్యూజిక్ డైరెక్టర్ జీ.వి. ప్రకాష్ కుమార్ ఈ సినిమాకు అదిరిపోయే సంగీతం అందిస్తున్నారు. కృతి శెట్టి బర్త్ డే కావడంతో మూవీ మేకర్స్ ఓ స్పెషల్ పోస్ట్ పెట్టి అంచనాలను రెట్టింపు చేశారు.




తన ట్యాలెంట్, ఎనర్జీతో ప్రేక్షకులను కట్టిపడేసే ఈ ముద్దుగుమ్మకు మేకర్స్ సోషల్ మీడియా వేదికగా ఘనంగా బర్త్ డే విషెస్ తెలిపారు. ఈ సందర్భంగా, కృతి శెట్టి కెరీర్లోనే అత్యంత వైవిధ్యమైన, సరికొత్త అవతారంలో కనిపించనుందని, థియేటర్లలో ఆమె పెర్ఫార్మెన్స్ నెక్స్ట్ లెవెల్లో బ్లాస్టింగ్గా ఉంటుందని మేకర్స్ అధికారికంగా ప్రకటించారు. కాగా.. ఈ సినిమా సంక్రాంతి సీజన్ను టార్గెట్ చేస్తూ వచ్చే ఏడాది సంక్రాంతి కానుకగా జనవరి 12, 2027న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్గా విడుదల కాబోతున్న విషయం తెలిసిందే. పండగ బరిలో దిగుతుండటంతో ఫ్లాపుల్లో ఉన్న కృతి శెట్టి ఈ సినిమాతో ఘన విజయాన్ని తన ఖాతాలో వేసుకోవడం ఖాయమని ఫ్యాన్స్ ఫుల్ ఖుషీ అవుతున్నారు.

# రొమాంటిక్ కామెడీ చిత్రం ‘ఏమోఏమో ఇది’ విడుదల తేదీ ప్రకటించిన దర్శకుడు



టాలీవుడ్ స్టార్ నటుడు శ్రీకాంత్ తనయుడు, చాక్లెట్ బాయ్ రోషన్ మేక హీరోగా నటిస్తున్న లేటెస్ట్ మూవీ ‘ఏమోఏమో ఇది’. ఇప్పటివరకు వరుస ఇంటెన్స్ క్రైమ్ థ్రిల్లర్లతో బాక్సాఫీస్ వద్ద సెన్సేషన్ క్రియేట్ చేసిన టాలెంటెడ్ డైరెక్టర్ శైలేష్ కొలను.. ఈసారి మాత్రం కంప్లీట్గా రూటు మార్చి ఒక అందమైన రొమాంటిక్ కామెడీ జానర్లో ఈ సినిమాను తెరకెక్కిస్తున్నారు. ఈ చిత్రంతో కన్నడ బ్యూటీ ప్రీతి ముకుందన్ హీరోయిన్గా నటిస్తున్నారు. టాలీవుడ్ ప్రముఖ నిర్మాణ సంస్థలు సితార ఎంటర్టైన్మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ సంయుక్తంగా నిర్మిస్తున్నాయి.

సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మాతలుగా వ్యవహరిస్తున్న ఈ సినిమాకు మ్యూజిక్ సెన్సేషన్ హేషమ్ అబ్దుల్ వహాబ్ సంగీతం అందిస్తున్నారు. ప్రస్తుతం శరవేగంగా షూటింగ్ జరుపుకుంటున్న ఈ మూవీ విడుదలకు సిద్ధమైంది. ఈ విషయాన్ని అనౌన్స్ చేస్తూ డైరెక్టర్ శైలేష్ కొలను ట్విట్టర్ ద్వారా ఓ పోస్ట్ పెట్టారు. ‘ఆహ్లాదకరమైన ఈ రొమాంటిక్ కామెడీ చిత్రాన్ని మీ కోసం రూపొందించాము. మీరంతా థియేటర్లకు వచ్చి మాపై మీ ప్రేమను చూపిస్తారని ఆశిస్తున్నాము. ‘ఏమోఏమోఇది’ప్రేమలో పడేందుకు అందరూ సిద్ధంగా ఉండండి. ఈ రొమాంటిక్ ఎంటర్టైనర్ అక్టోబర్ 30, 2026న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్గా థియేటర్లలో విడుదలకు సిద్ధమవుతోంది’’ అని రాసుకొచ్చారు.

# ‘ఆదర్శ కుటుంబం’ ఫస్ట్ సింగిల్ అప్డేట్ ఇచ్చిన మేకర్స్

విక్టరీ వెంకటేష్, మాటల మాంత్రికుడు త్రివిక్రమ్ కాంబినేషన్లో వస్తున్న ఫుల్ లెంత్ ఫన్ అండ్ యాక్షన్ ఎంటర్టైనర్ ‘ఆదర్శ కుటుంబం హౌస్ నెం: 47 - ఏకే 47’. ఈ చిత్రంలో శ్రీనిధి శెట్టి హీరోయిన్గా నటిస్తుండగా, హారిక హాసిని క్రియేషన్స్ బ్యానర్ భారీ బడ్జెట్తో తెరకెక్కుతోంది. అక్టోబర్ 2, 2026న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానున్న ఈ సినిమాకు సంబంధించి మేకర్స్ తాజాగా, మ్యూజికల్ జర్నీని ప్రారంభించినట్లు ప్రకటించారు. ప్రమోషన్స్లో దూసుకుపోయేందుకు చిత్రబృందం సిద్ధమైంది. సినిమాలోని మొదటి పాట ‘నారాయణమ్మ’ అని సాగే సాంగ్ అప్డేట్ సోషల్ మీడియాలో సెన్సేషన్ సృష్టిస్తోంది. ఈ సెన్సేషనల్ సాంగ్ అద్భుతమైన వైబ్తో సెప్టెంబర్ 22న విడుదల కానుందని చిత్రబృందం వెల్లడించింది. సెన్సేషనల్ మ్యూజిక్ డైరెక్టర్ ఎస్.ఎస్. థమన్ ఈ చిత్రానికి అదిరిపోయే మ్యూజిక్ అందిస్తున్నారు. ఈ ఫస్ట్ సింగిల్తో ఒక నయా బ్యాంగర్ ట్యూన్ లోడింగ్ అవుతోందని, ఆల్బమ్లోనే ఇది బిగ్గెస్ట్ చార్ట్బస్టర్గా నిలుస్తుందని మేకర్స్ ఫుల్ కాన్ఫిడెంట్గా ఉన్నారు. అయితే ఈ పాటలో వెంకటేష్తో పాటు శ్రీనిధి శెట్టి, నివేతా పేతురాజ్, డింపుల్ హయాతి కలిసి స్టెప్స్ వేయడం విశేషం. నారా రోహిత్, పూజిత పొన్నాడ, రావు రమేష్, సత్య తదితరులు కీలక పాత్రల్లో నటిస్తున్న ఈ చిత్రంలోని ఫస్ట్ సింగిల్ కోసం వెంకీ మామ ఫ్యాన్స్ అంతా ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.



# హిట్ కాంబో రిపీట్.. తొమ్మిదేళ్ల తర్వాత టాలీవుడ్ కు రీఎంట్రీ ఇస్తున్న శ్వేతా బసు ప్రసాద్!

టాలీవుడ్లో ఒకప్పుడు ట్రెండ్ సెట్ చేసిన క్యూట్ కపుల్ వరుణ్ సందేశ్, శ్వేతా బసు ప్రసాద్ జోడీ చాలా కాలం తర్వాత మరోసారి తెరపై మ్యాజిక్ చేయడానికి సిద్ధమవుతోంది. శ్రీకాంత్ అడ్డాల దర్శకత్వంలో, ప్రముఖ నిర్మాత దిల్రాజు తెరకెక్కించిన ‘కొత్త బంగారు లోకం’ చిత్రంలో బాలు, స్వప్న పాత్రలుగా వీరు చేసిన అల్లరి, చూపిన కెమిస్ట్రీ ప్రేక్షకులకు ఎప్పటికీ గుర్తిండిపోతుందనడంలో అతిశయోక్తి లేదు.. అప్పట్లో ఈ సినిమా యూత్ను ఎంతగానో ఆకట్టుకుంది. ఇప్పుడు ఈ సక్సెస్ఫుల్ జోడీ మళ్లీ రిపీట్ కానుందనే పోస్టులు ప్రేక్షకుల్లో ఆసక్తిని రేకెత్తిస్తోంది. వీరి ఆన్-స్క్రీన్ జోడీని ఇష్టపడే ఫ్యాన్స్ ఈ క్రేజీ ప్రాజెక్ట్ కోసం ఆతృతగా ఎదురుచూస్తున్నారు. ఈ సినిమాతో శ్వేతా బసు ప్రసాద్ టాలీవుడ్కు రీ-ఎంట్రీ ఇస్తుండటం ఈ ప్రాజెక్ట్కే హైలైట్గా నిలిచింది.

ఆమె చివరిసారిగా తెలుగులో 2017లో ‘మిక్చర్ పొట్లం’ మూవీలో నటించింది. ఆ తర్వాత బాలీవుడ్కు వెళ్లిన ఈ భామ అక్కడ కొన్ని చిత్రాలు, వెబ్ సిరీస్లతో అలరించింది. ఆ తర్వాత 2022లో ‘ఇండియా లాక్డౌన్’ అనే చిత్రంలో నటించిన ఆమె, ఆ తర్వాత కొంతకాలం సినిమాలకు దూరంగా ఉన్నారు. సరిగ్గా నాలుగేళ్ల సుదీర్ఘ విరామం తర్వాత ఆమె మళ్లీ టాలీవుడ్ ప్రేక్షకులను పలకరించనున్నారు. వరుణ్ సందేశ్తో కలిసి అశ్వేతా బసు ప్రసాద్ చేస్తున్న ఈ రీ-ఎంట్రీ మూవీపై అప్పుడే భారీ అంచనాలు క్రియేట్ అయ్యాయి. పాత జ్ఞాపకాలను నెమరువేసుకునేలా వీరిద్దరి కాంబినేషన్ ఉండబోతుందని సోషల్ మీడియాలో చర్చ జరుగుతోంది.

Printed and Published by VUPPARI RAMESH KUMAR on behalf of Navatharam Publications Private Limited, Printed at Sree Seshasai Enterprises Plot No:19, IDA Balanagar, Medchal-Malkajgiri Dist, Hyderabad-500037.Telangana state and Published From : Samrat Complex, Block A , Flat No : 8A, Saifabad, OPP : A G Office, Beside: Aranya Bhavan, Hyderabad, Pin : 500004, Telangana State, EDITOR: VUPPARI RAMESH KUMAR. RNI Reg No.TELTEL/2016/72952.